## అంకితము



ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే కర్తవు. నీవే భర్తవు. నీవే ఆదిమూలము. నేను నిమిత్తమాత్రుడను. అన్నమాచార్యులవారిపై ఆపేక్ష కలిగించిందీ నీవే. నా జీవితగమ్యం ఆయన కీర్తనల వివరణ అని నిర్దేశించిందీ నీవే. 70 ఏళ్ళ ముసలిప్రాణి చేత నీ శృంగార కీర్తనలను వివరింపజేస్తున్నదీ నీవే. దీనితోనైనా నాకు విముక్తి ప్రసాదించు ప్రభూ! నీవునాకు అన్నీ ఇచ్చావు నేను "దాత"కు యేమీయగలను? నాది అనేది ఈ కృతి ఒక్కటే. దీనిని నిర్మలమైన మనస్సుతో నీకర్పిస్తున్నాను.
నేను ధన్యుడను తండ్రీ! ఎందుకంటే...

శా॥ **ఆదిన్ శ్రీసతికొప్పుపై, తనువుపై, అంశోత్తరీయంబుపై,**
**పాదాబ్జంబులపై, కపోలతటిపై, పాలిండ్లపై నూత్నమ-**
**ర్యాదన్‌చెందుకరంబు క్రిందగుట మీదై నా కరంబుంట,మే-**
**ల్గాదే! ప్రాణము గీణమున్ సతతమే! గైకొమ్ము దీనిన్ ప్రభూ!**



(సంపుటి)



# హరి వేంకటపతి అఖిలం మధురం

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు

## భావదీపిక

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి వేంకటపతి అఖిలం మధురం

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు

# భావదీపిక

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు M.Tech.**



**హరి వేంకటపతి అఖిలం మధురం**

మొదటి ప్రచురణ

**జనవరి 2016**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె.వి.ఆర్.

98495 79345

వివరణనిస్తే "బూతు" అనుకునే దౌర్భాగ్యులకు అట్టి వివరణ ఇవ్వకూడదనే పెద్దలు వివరించి వుండరు. అందుకనే నేటికి అన్నమయ్య శృంగార కీర్తనలు వేల సంఖ్యలో మాయమైపోయినా మనకు చీమ కుట్టినట్టన్నాలేదు.

కొందరు మహానుభావుల కృషివలన మనబోటి వారు కొంత స్వాంతన పొందినప్పటికీ నేటి నవీనమైన పరభాషావ్యామోహం వల్ల ఈ స్వాంతన యెన్నాళ్ళుంటుంది అనేది అనుమానాస్పదమే. నేటి కాలం భక్తి, పారమార్థిక భక్తిగాక "పరమ ఆర్థిక" భక్తి అయిపోయింది. సరస శృంగారం "బ్లూ" అయిపోయింది. ఇది ఆధునికుల దురదృష్టం.

కాని అన్నమయ్య కాలంలో, జయదేవుని కాలంలో, క్షేత్రయ్యకాలంలో శృంగారం ఒక కళ. బూతు కాదు. శృంగార కవితతోనే వారు మోక్షాన్ని సాధించారు. దానిని కళలాగా, ఆరాధనలాగ చూడలేని వారికి శృంగారం మోక్ష సాధనం కాదు. అది కేవలం దైహిక సుఖం. అన్నమయ్య రాధామాధవ రతిని నిరతితో ఆరాధించాడు. శ్రీవేంకటేశ్వరుని రతిలీల అలమేలుమంగ విరహం, ఆయనకు మోక్ష సాధనాలయ్యాయి.

ఆ తాదాత్మ్యంలో అన్నమయ్య ఒక్కొక్కప్పుడు దేవికి భావనా చెలికత్తెయై ఆమెకెన్నో సలహాలనిచ్చారు కీర్తనలలో. ఒక్కొక్కప్పుడు శ్రీపతికి చెలికత్తెయై ఆయనకూ మగువ మనస్సును వివరించారు. ఒక్కొక్కప్పుడు తానే దేవుని వలపుకత్తెయై మూగ ప్రేమతో ఆరాధించాడు. మరొకప్పుడు రోషం చూపి పోట్లాడాడు. ఇవన్నీ భక్తిలో తాదాత్మ్యం చెందిన జీవుడు పడే ఆవేదనలే. పరమాత్మ, ఆత్మల "కూటమి"కి అవరోధం కలిగించేది "మాయ". ఇది కూడా పరాయిది కాదు. పరమాత్మని సోదరి. ఆవిడ పనే ఆత్మ పరమాత్మల కూటమిని ఆపటం. అది క్షేత్రయ్య భావనాతరంగం. అన్నమయ్య తనని స్వామి వలపుకత్తెగా భావించుకొని, దేవిని 'ఆత్మ'వలె విడలేని భార్యగాను, స్వామిని ఆత్మేశ్వరునిగాను ప్రతిపాదించి అనేక విరహ కీర్తనలను చెప్పారు. మాయామోహితుడై సంసార తాపత్రయంలో పడినా తాను నిజంగా వలచింది శ్రీపతినే కాబట్టి స్వామి తనకి తాత్కాలిక "కలయిక" నిచ్చినా చాలనే "కీర్తిస్తుంటాడు".

వారి కలయికలో అన్నమయ్య పాటలోను అకళంక ప్రేమే కాని అశ్లీలం లేదు. "బూతు" ఆలోచన రాదు. అయినా...



# ప్రార్థన

కం॥ శ్రీరమణీ కుచ కుంకుమ
నీ రూపము "నెఱుపు" జేయ నీరజనాభా!
నా రచన "శృతిని మించిన"
కారుణ్యము జూపి నన్ను గరుణించగదే!

ఆ.వె॥ అన్నమయ్య పాట అందదు "మేధకు"
నా స్ఫురణకు తోచి నాకు జిక్కి-
నంతవరకు దీని నందించగలవాడ
"బుధులు" తప్పుగాచి బ్రోవ మనవి

కం॥ హరి వేంకటపతి అఖిలం
బరరే!! "మధురంబు" కాదె! ఆర్యులు పొగడన్
సరియగు"మున్నుడి", "భావము"
గురుడన్నమ కవి పదంబు గొలిచి వచింతున్

ఉ॥ ఎంతని వేడుకోగలను? ఇప్పటికైనను "ముక్తు" జేయరా
సుంత దయైన రాదిటుల శోధనలేల సురేంద్రవందితా?
చెంతకుజేర రమ్మనవు సేదను దీర్చవు, దైనికంబులౌ
చింతలు దీర్చి పెంచెదవు చిత్రపుటాసలు వేంకటేశ్వరా!

సీ॥ ఎవరి కర్మఫలంబులేరీతి నుండునో
యెరిగినదెవ్వండు యీవుదక్క
ఎవరికి పాపమో యెవరికి పుణ్యమో
యెవరెరుంగుదురయ్య నీవుదక్క
ఎవరికి దుఃఖమో యెవరికి సౌఖ్యమో
యెవ్వాడెరుంగును యీవుదక్క
ఎవరికి మరణమో యెవరికి జననమో
యెవ్వడిదెరుగును యీవుదక్క

ఆ.వె॥ ఎంచి జీవకోటి ముంచేవు "భ్రమ"లోన
ఆటనాడుకొనటునాపవయ్య!
శరణుజొచ్చినాము సర్వేశ్వరా! నీకు
వేదనలను బాపు వేంకటేశ!

చం॥ పదకవితాపితామహుడు పాడిన కీర్తనలందు మాధురీ
సదనములెన్ని చూచితిని చక్కని భావములెన్ని గాంచితిన్!!
కుదురుగనో్ప్రభూ! సిరులు కోరను వో తిరువేంకటేశ్వరా!
పెదవుల నవ్వులే చలువ వెన్నెల జిల్కిన నేను ధన్యుడన్.

మ॥ కవితన్ జెప్పుట నీవె నేర్పితివి యే కావ్యంబు నే జూచితిన్?
భువిపై పుట్టుక నిచ్చి "పెంచితివి" నాపుణ్యంబదేమో విభో!
భవ బంధంబుల రోసిరోసి వెగటై ప్రార్థించి దిక్కంటిరా
భువనోద్ధారక వేంకటేశ! కృపతో బ్రోవంగ నీ భారమే

శా॥ కారే భోగులు!! భాగ్యముల్ కలుగవే గర్వోన్నతుల్ బొందరే
వారే రీ సిరి వెంటబెట్టుకొని పోవంజాలిరే భ్రాంతులై
వోరాజీవ సునేత్ర వేంకటపతీ! వొల్లన్ సిరుల్ సంపదల్
నీ రమ్యంబగు నామ సంస్మరణమున్ నీవిమ్ము నా నాల్కపై

తే.గీ॥ వేంకటేశుని రతికళావిభవమంత
పాడి మురిపించె మధురమౌ "పద కవితల",
అన్నమయ్యకు సాటిలేరయ్య! కవుల
అతని వివరించ నా పుణ్యకతన జుమ్మీ!

మత్తకోకిల :
ఒక్కమాటకు పెక్కు అర్థములున్నవీ మధురమ్ములౌ
చక్కనౌ రసస్ఫూర్తి గల్గిన సాటిలేనివి కీర్తనల్
నిక్కు వేంకటనాథు గొల్చెడి నేల నిండిన భక్తులున్
ఎక్కడున్నా అన్నమయ్యకు యెవ్వడైనను మొక్కురా.



# ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని శృంగార వైభవాన్ని వర్ణించగల సామర్థ్యం, నందకాంశ సంభూతుడైన అన్నమాచార్యులకు మాత్రమే వున్నదని నా నిశ్చితాభిప్రాయం. మన ఆత్మయే పుత్రునిగా రూపుదిద్దుకుంటుందని ఆర్యోక్తి. అన్నమయ్య పుత్రుడైన పెద తిరుమలయ్య రచించిన శృంగారకీర్తనలను పరిశీలిస్తే ఆ విషయం సుస్పష్టమవుతుంది. తండ్రి చెప్పినంత అలవోకగా శృంగార రచనతో వేంకటరమణుని, శ్రీ రమణిని మురిపించిన ఘనుడు పెదతిరుమల. తరతరాలుగా హరిని మధుర భక్తితో అలరించిన ధన్యులు తాళ్ళపాక కవులు. అది నా రచన "హరిపై పద్యమే తాళ్ళపాక పదము"లో విపులంగా యెత్తిచూపాను.

ప్రస్తుతం పాఠకులు పరిశీలిస్తున్న యీ రచన "హరి వేంకటపతి అఖిలం మధురం" అన్నమయ్య చెప్పిన శృంగార సంకీర్తనలలో యెన్నుకొన్నవాటికి విశ్లేషణ. ప్రతి కీర్తనకు "మున్నుడి" అనే అవతారికను కూడా జతకూర్చాను. దీనివల్ల కీర్తన మరింత స్పష్టమవుతుందని నా భావన.

అన్నమయ్య శృంగారకీర్తనలతో సమస్య యేమంటే ఆ కీర్తన చెబుతున్నది అన్నమయ్య భావనా రమణియా, శ్రీరమణియా, వేంకటరమణుడా లేక వారి చెలికత్తెలా అన్న విషయం ఒక్కొక్కప్పుడు స్పష్టంగా తెలియదు. అదంత తేలిక వ్యవహారం కాదు.

ఇంకొక సమస్య యేమంటే 15వ శతాబ్ది నాటి రాయలసీమ మాండలిక పదాలు కొన్ని నేటి కాలంలో "లుప్త'మైనవి. రవ్వాశ్రీహరి గారి వంటి భాషాకోవిదుల కృషివలన నాబోటి వారి పని కొంత సుగమమైనప్పటికీ చాలా పదములకు అర్థం ఊహాజనితమే. కొన్ని పదాలకు అనేక నానార్థములుండుటవలన యేది అన్నమయ్య భావమో సుస్పష్టంగా తెలియదు. అందుకనే చాలామంది ఈ కీర్తనలకు "స్థాలీపులాకన్యాయంగా" వివరణనిచ్చారేగాని నాలాగా సాహసించలేదు.

దీనికి అనేక కారణాలున్నా, నేను చెప్పగలిగే నిజాయితీగల కారణం ఒక్కటే. నా వృత్తిగాని, చదువుగాని, అనుభవంగాని ఈ నా రచనకు కారణం కావు, కాలేవు. ఒక ఉదాహరణతో నేను చెప్పేది మీకే అర్థమౌతుంది. "పట్టెమంచము కోటి గుబ్బలు చన్నులంటా పట్టి పట్టి చూచి మోమప్పళించుకొను" అనే ఒక కీర్తన చరణం, నేటి నవీనకాలం యువతీ యువకులకెలా అర్థమవుతుంది? దీనికి ప్రతిపదార్థ





ఆ.వె॥ బూతు వలన బుట్టి, బూతుకై వేసారి,
బూతు కొఱకె బ్రతికి, బూతు జరిపి
బూతుతోనె "సంతు భూతాల" పుట్టించి,
బూతు "భూత"మనగ, "బూతు" కాదె!!

ఇక్కడ నా అభిప్రాయం పాఠకులకు తెలియపరిస్తే బాగుంటుంది అని భావిస్తున్నాను. శృంగారకళను "బూతు"గా భావించేవారు "హరివేంకటపతి అఖిలం మధురం" చదవకపోవటమే మంచిది. "కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేలనేడ్చెదో..." అన్న పోతనగారి పద్యం చదివితే, చదువులతల్లి వక్షోజాలు కనుపించే "గ్రంథసాంగులకు" ఈ అమలిన శృంగారంలో "మలినమే" కళ్ళముందుంటుంది. "నేల" "నేడ్చెదో" యేమిటి అనిపిస్తుంది. అటువంటివారు దీనిని చదివి "బాధపడితే" నాదగ్గర ప్రత్యుత్తరం లేదు.

మనబోటి "భక్తులనుకొనేవారికీ" నచ్చని ఇంకొక విషయం, దేవి స్వామిని "ఏరా" అని పిలవటం. శృతిమించిన శృంగారంలో నాయిక తన మగని 'రా' అంటే తప్పులేదని లాక్షణికులేనాడో చెప్పారు.

నిరాకార నిరంజనుడైన జగన్నాథునికి 'ప్రణయతాపం' యేమిటి అంటే అన్నమయ్యను అర్థం చేసికొనే శక్తి మీకు లేదని తెలిసిపోతుంది. అటువంటి వైజ్ఞానికులకు ఇతర మత గ్రంథాలలో భగవంతుని "మహిమల ప్రస్తావన యెలా ఒప్పుగా కనుపిస్తున్నది? ఆ మతాలన్నీ మనిషి తన లోపాలను తాను సరిదిద్దుకోడానికి అవతరించాయి. వాటి దారులు వేర్వేరైనా గమ్యం ఒక్కటే. కానీ హైందవ ధర్మం అనాదిది. భగవంతుని యేరూపంలోనైనా యే విధానంలోనైనా యే భావనతోనైనా ఆరాధించు. ఆ"శక్తి"కి వినమ్రతతో మొక్కు. ఆ"శక్తి" గొప్పదనం కథల ద్వారా స్మరిస్తూ నీ అల్పత్వం గ్రహించి ఆ 'శక్తి'ని ఆరాధించి శరణువేడు, అంటుంది హైందవం.

పోనీ ఈ నామాట విని ఆలోచించండి. "చెన్నై" మహానగరాన్ని కేవలం పదిరోజుల వర్షం యేడిపిస్తే మనిషి యేమిచేయగలిగాడు? అదే సముద్రం కూడా చేయికలిపితే మానవమాత్రుడేమి చేయగలడు? నరుడు యేనాటికీ పరమాత్మునితో పోటీపడలేడు.

అందుకనే ఈ మిడిమిడి జ్ఞానం లేని మనిషి భగవంతుని తనకు తోచిన విధంగా స్తుతించాడు. శ్రీవేంకటేశ్వరుడు మానాన్న, పద్మావతీదేవి మా అమ్మ అనుకోగల మానసిక పరిపక్వతవుంటే ఇది శృంగారకావ్యం, లేనివారికి మలిన ప్రణయం. తమాషా యేమంటే ఆ పరిపక్వత అందరికీ రాదు. అది చదువులవల్లరాదు. సత్సంగత్యంవల్ల కూడా రాదు. భగవత్కృప వుంటేనే వస్తుంది.

కంచెర్లగోపన్న "నను(బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ!" అంటూ, "చక్కంగ మరుకేళి చొక్కియుండెడి వేళ రామయ్య కాదనడమ్మా" అని మొత్తుకున్నాడు. అదీ శృంగారం అంటే. చివరికి రామయ్య ఆయన మాట విన్నాడా లేదా? శ్రీవేంకటపతి అన్నమయ్య మాట విన్నాడా లేదా? ఒకనాడు నామాటకూడా వింటాడు. కాకపోతే యెన్నడో??? చెప్పలేను.

గమనిక : అన్నమయ్య "భావనా సుందరి"కి నేను "అన్నమ్మ" అని పేరు పెట్టాను. ఆమె జాణ, బేల, ప్రేయసి, చతుర, సమర్థురాలు, మంచీచెడూ స్వామికి కూడా చెప్పగల "సాహసి".

Please visit my Website in Google Network

**"www.geetadeeksha.com"** అంతేకాదు **"kinige.com"** వారి **E-Book** లో, నావి 10 పుస్తకాలు (2400) అన్నమయ్య కీర్తనల విశ్లేషణల మిమ్మల్ని అలరిస్తాయి.

TTD వారికి సదా కృతజ్ఞుడను.

"సర్వేజనాః సుఖినోభవంతు"





| | | | |
|---|---|---|---|
| 24. ఒక్కరీతినేవుండరా నీకు | | 24/168 | 23 |
| 25. ఓహో బాలకినాతోనోపుదువటే | | 24/175 | 19 |
| 26. ఓడలుబండ్లవచ్చునొక్కవేళ దానికేమి | | 24/101 | 27 |
| 27. కంటివిగావోయీ నీకాంతల సుద్ది | (చి.శృ) | 25/284 | 48 |
| 28. కోరికలు కొనసాగె గోవిందరాజ | | 25/285 | 46 |
| 29. కోరిబిడ్డడంటా గంటిగోవిందుని | | 24/103 | 31 |
| 30. చక్కనిమానిని నీసరియెవ్వరే | | 24/185 | 32 |
| 31. చాలుజాలు నిన్నింత జరియనేల | | 24/169 | 33 |
| 32. చేసినదే చేత చెల్లుబడిగలచోట | | 24/174 | 25 |
| 33. తరవాతిపనులెల్లదానె యెఱుగు | | 24/167 | 39 |
| 34. తొయ్యలివెంగెములాడదోసము | | 24/173 | 38 |
| 35. దానిసాహసము మేలుతరువాత నీవు మేలు | (చి.శృ) | 10.2/97 | 44 |
| 36. నన్ను నేలినాడితడు నరసింహుడు | | 25/183 | 35 |
| 37. నయగారిసటుకాడ నారసింహా | | 24/171 | 26 |
| 38. నవ్వేవారి నెఱగవు నాలుగు వంకల నిన్ను | | 23/215 | 02 |
| 39. నేనెతిగినవే తొల్లి నీసుద్దులు | | 23/473 | 12 |
| 40. పట్టరాని వయసుతో బలిమి సేసేముగాక | | 25/318 | 43 |
| 41. పలుకుల కొలదేకాక పంతమేటికి | | 24/177 | 21 |
| 42. పిన్నలు నాచన్నులు పిసుకకు పలుమార్లు | | 23/213 | 13 |
| 43. బతికితివన్నిటాను వనితవల్లనీవు | | 23/167 | 18 |
| 44. మదనబండారము మగువమేను | | 23/196 | 08 |
| 45. మీరు మీకే కానవచ్చు మిన్నులపై మెఱుగు | | 24/193 | 37 |
| 46. వట్టియలుకల నీకు వచ్చీదేమి | | 23/197 | 06 |
| 47. వట్టివేసాలు సేసుకవాదులకు దూరేవు | | 23/240 | 01 |
| 48. వలపేమి గంపగమ్మవచ్చునా | (చి.శృ) | 10.2/90 | 49 |
| 49. విపరీతములివి వినరాదు | | 24/197 | 29 |
| 50. సిగ్గువడనేమిటికి చెలువమె | (చి.శృ) | 10.2/96 | 40 |
| 51. సుసరాన మంచిదాయ సుదతులాల | (చి.శృ) | 10.2/92 | 45 |












# హరి వేంకటపతి అఖిలం మధురం

(సంపుటి II)

## ఎన్నుకొన్న అన్నమయ్య శృంగార కీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అట్టేకాదా మరి అవునయ్యా | 24/172 | 34 |
| 2. | అతిరాజసపువాడు అన్నిటాదాను | 24/295 | 14 |
| 3. | అదియే కాదా సతతమాతనికి | 24/176 | 20 |
| 4. | అప్పటినీ చెలువంతయును | 24/104 | 30 |
| 5. | అప్పటినాతో ఆటాడీనదివో | 24/297 | 07 |
| 6. | అయ్యాజియ్యలు వెట్టేనీఆడువారము | 24/452 | 15 |
| 7. | ఆడకేలమమ్ము బిల్చీగనరే | 24/293 | 22 |
| 8. | ఆతనికిది పరాకౌనోకాదో | 24/103 | 41 |
| 9. | ఆసోదకుడవు నిన్నేమనేము | 23/213 | 05 |
| 10. | ఇంటికి విచ్చేసితివి యెంతవనికి | 23/198 | 03 |
| 11. | ఇంతిచక్కదనమిక నేతునికొన్యాడుదుము | (చి.శృ) 10.2/8 | 47 |
| 12. | ఇంతిసింగారము నేడుయెట్లున్నది | 24/170 | 36 |
| 13. | ఇద్దరితలపులవెయింపులవె మీలోన | 24/105 | 10 |
| 14. | ఇన్నిటాఘనుడుతాను యేమిచెప్పేరే | 23/239 | 17 |
| 15. | ఎంతనేరుపరివినిన్నేమందమే | (చి.శృ) 10.2/94 | 42 |
| 16. | ఎంతమానవతివి నిన్నేమిచెప్పేది | 23/214 | 04 |
| 17. | ఎంతరాజసము చూపేవీకెయెదుట | 24/ | 50 |
| 18. | ఎటువంటిదొరవైతివేమయ్యా | (చి.శృ) 10.2/91 | 51 |
| 19. | ఎఱుగమిక నీచిత్తమెట్లున్నదో | 23/195 | 09 |
| 20. | ఏమమ్మామగువా నీవింతసేతువా | 24/198 | 28 |
| 21. | ఏమినేరుపు చూపేవెందాకాను | 23/194 | 16 |
| 22. | ఏమిసేసేవిక్కడను యెంపనిగద్దునీకు | 24/296 | 11 |
| 23. | ఏలనాతో నానతిచ్చే విచ్చకపుమాటలెల్లా | 24/293 | 24 |

సంఖ్య : 214 సంపుటము : 23 పుట: 143 రాగం : దేశాక్షి

**4 ఎంత మానాపతివి నిన్నేమి చెప్పేది**
**మంతనములాడేవు మండెమునారసింహా ॥పల్లవి॥**

**చేరి విడెమిమ్మంటే సిగ్గులువడేవు నీవు**
**వోరి నీసతెవ్వతైనా వున్నదా యీడ**
**గోర నిన్ను గీరఁగాను గొబ్బున వేఁడుకొనేవు**
**ఆరీతు లెవ్వతైనా నిన్నాడుకొనీనా ॥ఎంత॥**

**మోముచూచి నవ్వితేను మొక్కుచును లోఁగేవు**
**నీమగువ లీడ వచ్చి నిన్నుఁ జూచేరా**
**కామించి మోవికెంపులు కలిగించితే మూసేవు-**
**చూ, మరల నెవ్వతైనా సొలసి తిట్టెనా ॥ఎంత॥**

**సారెకు మాటలాడితే సన్నలుసేసేవు నీవు**
**దూరి నీమోహపుచెలి దొమ్మిసేసీనా**
**యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి**
**కేరడాన నెవ్వతైనా కేలుచాఁచీనా ॥ఎంత॥ 214**

**మున్నుడి :**

"మానాపతి" అంటే మర్యాదస్తుడు అని అర్థం. మండెములో వెలసిన నారసింహునిపై శృంగారకీర్తనను వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ మండెమునారసింహా! నీవు యెంత మర్యాదస్తుడివయ్యా!! నిన్నేమని పొగడుగలము. నీవు నీమోహపు చెలి శ్రీలక్ష్మిని చూచి సైగలు చేస్తూ పదేపదే మాటలాడేవు. ఆమె నిన్ను బలవంతం చేస్తుందాయేమి? అయినా శ్రీవేంకటేశ్వరుడవై నాతోనూ కూడితివి. "కేరడాన నెవ్వతైనా కేలుచాచీనా" అంటున్నారు. అంటే... అన్నట్లు ఈ సరసుడు మానవరూపుతోనున్న నరహరి.

**భావ దీపిక :**

ఓ మండెము నారసింహా! (మండెము గ్రామమున వెలసిన నరసింహా!) నీవెంత మానాపతివి (మర్యాదస్తుడివి!!) నిన్నేమని చెప్పేది (పొగిడేది?) నాతో మంతనములాడెదవేలనయ్యా? నన్ను చేరి తాంబూలమిమ్మంటే అంత సిగ్గుపడతావేమయ్యా? ఓరి! నీ సతి యెవ్వతైనా ఇక్కడ దాగున్నదా యేమి? నిన్ను గోటితో గీరితే, గొబ్బున (వెంటనే) వద్దని వేడుకొనెదవు. ఈ విధంగా నేనేకాక మరొకతె నీతో ఆడుకొనేనా యేమి? నీ మొగము లోకి చూచి నవ్వితే వినయంగా లోగేవు (లొంగిపోతావు) నీ మగువలైన శ్రీలక్ష్మి, చెంచులక్ష్మి మనని చూస్తారని నీకు భయమా? నీపై కోర్కెతో మోవికెంపుచేస్తానని పెదిమలు మూసేసుకొంటావు. మళ్ళీ యెవ్వతైనా సొలసి నిన్ను తిట్టేనా యేమి? స్వామీ! నేను నీతో మాట్లాడినప్పుడల్లా నీవు సైగలు చేస్తావు కారణమేమి? నీ మోహపు చెలి (శ్రీలక్ష్మి) తిట్టి దొమ్మి చేస్తుందని జంకుతున్నావా? ఇదిట్లా వుండగా నీవే నన్ను (అన్నమయ్యను) కూడితివి. కేరటాన (నవ్వులాటకు) యెవ్వతైనా, కేలుచాచీనా (సిద్ధపడిందా) యేమి?



సంఖ్య : 240 సంపుటము : 23 పుట: 161 రాగం : రామక్రియ

**1 వట్టివేసాలు సేసుక వాదులకు దూరేవు**
**గుట్టు బాయిటను వేసి గురిగాఁ జేసితినా ॥పల్లవి॥**

**కొప్పు నే దువ్వితిఁగాక కోపగించి నిన్నేమైనా**
**వొప్పుగ ముందటిపట్ల కొడిసితినా**
**విప్పక చేతులువట్టి వేఁడుకొంటిఁగాక నిన్ను**
**ముప్పిరి నొసలు మోపి మొక్కించుకొంటినా ॥వట్టి॥**

**కందువ లంటితిఁగాక కపటాన నిన్నేమైనా**
**కిందుపడ కొనగోర గీరితినా**
**అందుకొమ్మనుచు మోవినాకు నీ కిచ్చితిఁగాక**
**చెంది ఇప్పుడు నోరొగ్గించితినా యెంగిలికి ॥వట్టి॥**

**వలపు రేఁచితిఁగాక వడి నిన్ను నేమైనా**
**కులికి చన్నుల నొత్తి కుమ్మితినా**
**యెలమి శ్రీవేంకటేశ యెనసి మెచ్చితిఁగాక**
**పలుకులలో నే బూతుబండునఁ దిట్టితినా ॥వట్టి॥ 240**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామి ప్రియురాలై స్వామిని అభ్యర్థిస్తున్నారు. నేనేం చేశానని నాతో వట్టి వేసాలు వేస్తూ వాదులాటకొచ్చి నన్ను నిందిస్తున్నావయ్యా? నేనేమన్నా నీ గుట్టు బయటపెట్టానా? నీకు నేను మొక్కానుకానీ నీతో మొక్కించుకొన్నానా? ఎప్పుడూ నిన్ను మెచ్చుకొన్నానేగాని కూడని మాటలలో బూతుల బుచ్చమ్మలా బరితెగించి తిట్టానా? ఈమె శంఖినీజాతి ప్రేయసియేమో?

**భావ దీపిక :**

స్వామీ! వట్టివేసాలు (వ్యర్థమైన నటనలు) చేస్తూ నన్నెందుకు దూరేవు (నిందిస్తావు). నేనేమన్నా నీగుట్టు బయటపెట్టి గురిగాజేసితినా (కారణంగా చేశానా?). నేను నీకెన్ని చేశాను? గుర్తుతెచ్చుకో. నీ కొప్పు దువ్వాను. నిన్నేమైనా కోపగించితినా? ముందరిపట్లు (జుట్టుపట్టుకొని లాగుటకు) వొడిగట్టితినా? విప్పక (విడదీయక) నీ చేతులు పట్టుకొని బ్రతిమిలాడానుగాని నిన్ను నొసలు తాకునట్లుగా నా కాళ్ళకు మొక్కించుకొన్నానా? ప్రభూ! కందువలంటితిని (నీ కళాస్థానముల స్పృశించితిని) కాని కపటముగా నిన్నేమైనా లొంగదీసి నీపై నఖక్షతముల జేసితినా? అందుకొమ్మని నానోటి తమ్ములమును నీకిచ్చితినిగాని యెప్పుడైనా నేను నీ నోరు యెంగిలి కిష్టపడునట్లు బలవంతం చేశానా? నీలో వలపులు రేకెత్తించితినిగాని, అతిక్రమించి కులుకుతూ నిన్నేమైనా నాకుచగిరులతో కుమ్మితినా? ఇన్ని చేసినందుకు ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అతిశయించి నన్ను మెచ్చితివిగాని కూడని మాటలలో నేను బూతుబండున (బూతుల బుంగ) వలె దిట్టితినా చెప్పవయ్యా!

సంఖ్య : 215 సంపుటము : 23 పుట: 144 రాగం : సాళంగనాట

**2 నవ్వేవారి నెఱఁగవు నాలుగువంకల నిన్ను**
**జవ్వనమదముననే సాముసేసేవు** ॥పల్లవి॥

**యెంతైనా గద్దు నీయాస యేమి చెప్పే దిందరిలో**
**కాంతవలపులకు గాదె నీమేను**
**చెంతల నాకుచములు చేతులనే పట్టుకొని**
**మంతుకెక్క నాపెతోను ఆఁటలాడేవు** ॥నవ్వే॥

**తలఁచరాదు నీరతి తమకివి యిన్నిటాను**
**జలజాక్షులెంగిలికంచము నీమోవి**
**అల్లరి యధరామృత మందుకొంటా నాపెపొత్తు**
**కలసి సన్నలుసేసి కాఁకరేఁచేవు** ॥నవ్వే॥

**పట్టరాదు నీవయసు పడఁతులకెల్ల రచ్చ-**
**కొట్టమాయ నిదివో నీగొప్పవురము**
**నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడి యట్టె**
**కట్టుకొంటి వాపెపదకము నీమెడను** ॥నవ్వే॥ **215**

**మున్నుడి :**

అన్నమయ్య భావనా సుందరి స్వామితో యేమి మొరపెట్టుకొంటున్నదో వినండి. నాలుగుదిక్కులా మనని చూసి నవ్వుకొంటున్నారయ్యా! యౌవన గర్వం సాముచేస్తుంటే నీవుమాత్రం యేమి చేస్తావులే? ఒకవైపు నా కుచములను తాకుతూనే ఆమెతో (దేవితో) మాటలేమిటయ్యా? నా అధరామృతము నాస్వాదిస్తూనే ఆమెకు సైగలు చేస్తావు. ఇలా సాగుతుంది ఆ సుందరిదెప్పుడు. కాని స్వామి మెడలో పతకం మాత్రం శ్రీదేవియే, అంటున్నది.

**భావ దీపిక :**

స్వామి! నిన్నుచూచి నవ్వేవారిని మన నాలుగు వైపులావున్నా, నీవు గమనించవేమి? జవ్వనమదమున (యౌవన గర్వంతో) సాముసేసేవు (చెలరేగుతున్నావు). నీ ఆశకు యెంతైనా అంతులేదు. అందరిలోనూ నీకెలా చెప్పను? నీమేను వున్నదే కాంత వలపులకు, కాకపోతే యేమిటి స్వామీ! నా చెంతజేరి కుచములను చేతులతో పట్టుకొని, ప్రసిద్ధినొందునట్లు ఆమెతో (శ్రీదేవితో) మాటలాడేవు. ఇదేమిటయ్యా? నీ రతి తమకివి (కాంక్ష) తలచరాదు (చెప్పలేనిది). నీ అధరము జలజాక్షులందరికీ యెంగిలికంచమైపోయింది. మరి నీవేమో ఆమె (దేవి) పొత్తునజేరి ఆమె అధరామృతమునాస్వాదిస్తూనే, నాకు సైగలు చేస్తూ నాలో కాకరేపుచున్నావు. ప్రభూ! నీవయసేమో పట్టరానిది. మరి నీ వురము పడతులందరికీ, రచ్చకొట్టము (వీధిలోని గది). ఏదియేమైనా శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను గూడితివి. నీవేమో ఆమెను (శ్రీదేవిని) నీమెడలో పదకముగా (పతకము) కట్టుకొంటివి కదా!



సంఖ్య : 198 సంపుటము : 23 పుట: 133 రాగం : ఆహిరి

**3 ఇంటికి విచ్చేసితివి యెంతవనికి**
**అంటిసుడివంటిదాన నందుకోపేనా** ॥పల్లవి॥

**యెంగిలిమోవిదాన యేడలేనిసిగ్గుదాన**
**పొంగేటి చెమటలతోఁ బొరలేదాన**
**వంగనిచన్నులదాన వాడికెవలపుదాన**
**పంగెనకోపముదాన బాఁతెయ్యేనా** ॥ఇంటి॥

**సన్నపునడిమిదాన సళుపుఁజూపులదాన**
**వెన్నెల నవ్వులతోడి వీరిడిదాన**
**నున్నని చెక్కులదాన నూఁగురులకొప్పుదాన**
**పిన్నదాన నేనీకుఁ బ్రియమయ్యేనా** ॥ఇంటి॥

**చిగురుఁబాదాలదాన చిమ్ముఁజూపులదాన**
**వెగటుఁబిఱుఁదుగలవేఁకపుదాన**
**నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి**
**జిగిబిగువులదానఁ జిత్తమువచ్చేనా** ॥ఇంటి॥ **198**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి తానెటువంటిదో వివరిస్తూ మరి ఇటువంటి కోపిష్టి మీద నీకు భ్రాంతి పుడుతుందా? ఇటువంటి పిన్నదానిమీద ప్రియము కలుగుతుందా? ఇటువంటి జిగిబిగువులదానిపై చిత్తము వస్తుందా? అని... ఎలాగో నా ఇంటికి విచ్చేసితివి స్వామీ! యేదోపని లేనిదే నీవు వస్తావా? నేను అరటి చెట్టుకున్న సుడివలె బహు అరుదైన దానన నీ ఆదరణకు తగనా? అని ప్రశ్నిస్తున్నది. అన్నమయ్య కాలంనాటి భాష అవటంచేత అంత తేలికగా కొఱుకుడుపడదు.

**భావ దీపిక :**

స్వామీ! యెంతవనికి (ఏదోవొక పనికి) నా ఇంటికి విచ్చేసితివి. నేను "అంటిసుడివంటిదాన" (అరటిచెట్టుకున్న సుడివలె బహు అరుదైనదానను). నేను అందుకువోపనా? (నీ వలపుకు తగనా ప్రభూ?) నేను ఎంగిలి నోటితోవున్నదానను. ఎడతెగని సిగ్గుకలదానను. చెమటలు పొంగుకువచ్చే బెదురుగలదానను. నిక్కబొడుచుకొని వంగని కుచములున్నదానను. నీపై వలపుకు అలవాటుపడ్డదానను. పంగెన కోపముదానను (పట్టువదలని ఆగ్రహం కలదానను.) ఇటువంటిదానిపై నీకు "బాఁతి" (భ్రాంతి) కలుగుతుందా? నేను సన్నని నడుముకలదానను. సళుపు (భారమైన) చూపులు కలదానను. వెన్నెవలె ప్రకాశించు నవ్వులతో కొంత వీరిడి (మూర్ఖత్వం) కలదానను. నున్నని చెక్కిళ్ళు గలదానను. నూగురులు (సన్నని వెంట్రుకలు) వున్నదానను. చిన్నవయసుదానను. ఇట్టి దానిపై నీకు ప్రేమ కలుగునా? ప్రభూ! నేను చిగురులవంటి పాదములు కలదానను. చిమ్ముజూపులదానను (వేగమైన కదలికగల చూపులున్న చెలువను). బలిష్టమైన పిఱుదులు కల విశిష్టమైనదానను. అందుచేతనే ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయించి నీవు నన్ను గూడితివి. ప్రకాశించు బింకములుగల నాపై నీకు మనస్సు కలుగుట లేదా?

సంఖ్య : 196 సంపుటము : 23 పుట: 131 రాగం : శంకరాభరణం

**8 మదనుబండారము మగువమేను**
**పొదిగొన్నవలపులఁ బొసఁగెఁగాన** ॥పల్లవి॥

**మరునియాయుధశాల మగువకొప్పు**
**తొరలించి విరులెల్లాఁ దురిమెఁగాన**
**యిరవై కీరపు (ము?) లాయ మీపెగళము**
**సరసపుమాఁటలెల్లా జరపెఁగాన** ॥మద॥

**కామునిసాముగరిడి కాంతవురము**
**ఆమనిచనుసంగడా లమరెఁగాన**
**ప్రేమపుఁగేళాకూళి గంభీరనాభి**
**తేమచెమటలచేత దిగుపారెఁగాన** ॥మద॥

**కంతునివేఁటపొలము కన్నెపిఱుఁదు**
**బంతి మొలనూళ్లపోఁగు వారెఁగాన**
**అంతటివానితల్లి యీయలమేల్మంగ**
**యింతలో శ్రీవేంకటేశు నెనసెఁగాన** ॥మద॥ **196**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవియొక్క శరీరమే మన్మథుని ఆయుధ భండాగారము అని వర్ణిస్తున్నారు. రెండు మూడు నిఘంటువులు తెరచి చూస్తేగాని వివరించలేని కీర్తన ఇది. పైగా అచ్చుతప్పు యెంతటివారినైనా పిచ్చెక్కిస్తుంది. వేటపొలము అంటే యేమిటో యే నిఘంటువులో దొరుకుతుంది? శ్రీవేంకటేశుడి కృపలేక ఇది వివరించడం అసాధ్యం.

**భావ దీపిక :**

ఈ మగువయొక్క శరీరము మదనుని బండారము (భండాగారము). ఎందుకంటే ఆమెలో పొదిగొన్న (చిగురించిన) వలపులు అతిశయించినవి కదా! ఈ భామిని కొప్పు మరుని (మన్మథుని) ఆయుధశాల. ఎందుకంటే ఆమె కొప్పులో తురిమినపూలు కూడా ఐదురకములైనవి. ఆమె గళము (కంఠము) సరసపు మాటలాడునపుడు చిలుక గొంతువలెనున్నది. ఈ చిలుక మన్మథుని వాహనమైన చిలుక కాదుకదా! ఈ కాంత వురము (వక్షము) కాముని (మన్మథుని) సాముగరిడి (మల్లయుద్ధముచేయుచోటు) వలెనున్నది. ఎందుకంటే యౌవనస్తన సంపదలు సంగడినున్నవి కదా! ఈ ప్రేమమూర్తి కేళాకూళి (జలకములాడుకొలను) మరేమో కాదు గంభీరపులోతైన ఆమె నాభియే. ఎందుకంటే జాలువారుతున్న ఆమె చెమటలు దిగుపారుచున్నది ఆమె నాభిలోనికే కదా! కన్నె పిరుదులపై బంతిమొలనూలు పోగులు (చుట్టు చుట్టుకొన్న మొలత్రాటి దారాలు) యెలావున్నదంటే కంతుని (మన్మథుని) వేటపొలము (వేటాడు అడవి) వలె వున్నది. ఈ అలమేల్మంగమ్మ అంతటివాని (అట్టి మన్మథుని) తల్లి. అంతలో ఆమె భర్త శ్రీవేంకటపతి అక్కడే అవతరించాడు.



సంఖ్య : 213 సంపుటము : 23 పుట: 143 రాగం : దేసాళం

**5 ఆసోదకుఁడవు నినే(నిన్నే?) మనేమయ్యా**
**ఆసుద్దు లింకానా అవునయ్యా** ॥పల్లవి॥

**కప్పురము చేతికిచ్చి కలయఁగ విడెమిచ్చి**
**చెప్పరానిమాటలెల్లాఁ జెప్పిచెప్పి**
**అప్పసము నీవద్ద నాపె గాచుకుండఁగాను**
**అప్పటి మమ్ముఁ జెనకే వవునయ్యా** ॥ఆసో॥

**గందము నీపైఁ బూసి కమ్మి సురటి విసరి**
**గొందిఁ బానుపు వరచి గుబ్బల నొత్తి**
**యెందునుఁ బాయక ఆకె యేఁకారుచుండఁగాను**
**అంది మాపైఁ జేయిచాఁచే వవునయ్యా** ॥ఆసో॥

**సిగ్గులెల్ల విడిపించి చేరి మోవి గంటిసేసి**
**వెగ్గళపునవ్వు నవ్వి వేసాలుసేసి**
**వొగ్గి శ్రీవేంకటేశ్వర వొడిగట్టాపె వుండఁగ**
**అగ్గమై నన్నుఁ గూడితి వవునయ్యా** ॥ఆసో॥ **213**

**మున్నుడి :**

"ఆసోదకుడు" అంటే ఆశగలవాడు అని అర్థం. అన్నమయ్య భావనాసుందరి (నేటినుంచి ఆమెను నేను "అన్నమ్మ" అని పిలుస్తాను) స్వామితో దెప్పిపొడుపుగా ఇలా అంటున్నది. ప్రభూ! నీవు ఆసోదకుడవు నిన్నేమనగలము? ద్వాపరయుగంలో నీ రాచలీలలు వీనులవిందే, కాదనను. కానీ ఇది కలికాలం, ఆకలికాలం. ఆసుద్దులు యింకానా? అవునయ్యా! అడ్డమై అదేమిటంటే నన్నుసైతం విడువక కూడెదవు. అవునయ్యా! అని ఆరోపిస్తున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీవు "ఆసోదకుడవు" (ఆశగలవాడవు) నిన్నేమనేమయ్యా? అవనయ్యా! ఆసుద్దులు (నీద్వాపరయుగంనాటి లీలలు) ఇంకానా? (ఇప్పుడూనా?). నీ దేవేరికి, కర్పూరము చేతికిచ్చావు. ఆమెకు సమ్మతి తాంబూలం ఇచ్చి నానోటితో చెప్పలేని మాటలను చెప్పిచెప్పీ, అప్పసమై (తనంతట తానే) ఆమె నీకోసం కాచుకొనియుండగా, అప్పటిన్ (మరల) మమ్మునూ చెనకేవు (స్పృశించేవు) అవునయ్యా! ఇదేమిటి? ఆదేవి నీకు గంధము మేనిపై బూసి, సురటి (విసనకఱ్ఱ)తో వీయుచూ, గొందిపాన్పు (ఒకమూల పరుపును) పరచి, చిలిపిగా తన చనుగవతో నిన్నొత్తి యెన్నడూ వీడని తోడైయున్నది. ఆవిధముగా ఆమె "యేకారుచు" (మిక్కిలి కోరికతో) నుండగా, మమ్మల్ని అందుకొని మాకై చేయిజాచేవు. అవునయ్యా! ఇదేమిటి? నీ హృదయేశ్వరి సహజమైన సిగ్గును ఆవలపెట్టి నిన్నుచేరి నీమోవిని గంటుపెట్టినది. వెగ్గళపు నవ్వునవ్వి (అతిశయముగా నవ్వుచూ) తన సొబగులను ప్రదర్శించినది. ఒడబడిన శ్రీవేంకటేశ్వరా! నీవువొడిగట్టుకొన్న శ్రీదేవి వుండగా, అగ్గమై (అనుకూలుడవై) నన్నేలితివి, కూడితివి. అవునయ్యా! ఇదేమిటి?

సంఖ్య : 197 సంపుటము : 23 పుట: 132 రాగం : తెలుగుగాంబోధి

**6** వట్టియలుకల నీకు వచ్చినదేమి
యిట్టె చెలిని మన్నించి యింటికి రావయ్యా ॥పల్లవి॥

ఆపెతో మాఁటాడితేను ఆయములెల్లాఁ గరఁగు
చేపట్టి పెనఁగితేను చెమరించును
వోపి నవ్వు నవ్వితేను వొడలెల్లాఁ బులకించు
తీపులుండఁగా జేఁదు తిననేఁటికయ్యా ॥వట్టి॥

సరుసఁ గూచుండితేను సంతోసములు మించు
ఇరవై చూచితే కోర్కు లీడేరును
తిరమై గురులు నించితే కొంకుగొసరు మాను
వెరవుతో నీడలివె యెండలేలయ్యా ॥వట్టి॥

మోవితేనె లానితేను మోహములు చెలరేఁగు
భావించి సేసవెట్టితే ఫలము గద్దు
శ్రీవేంకటేశ కూడితి నీవేళ నలమేల్మంగ
యీవల నీకె వుండఁగా నితరమేలయ్యా ॥వట్టి॥ **197**

**మున్నుడి :**

ఈ శృంగారకీర్తనలో అన్నమయ్య స్వామితో వేడుకొంటున్నారు. నీవు దేవిపై అలుగుట అంతా వట్టిదే. ఇకనైనా వట్టి అలకలు మాని ఇంటికి రావయ్యా! ఆ చెలిని మన్నించవయ్యా! ఉత్తుత్తి అలుకలవలన వచ్చినదేమి? ఎవరన్నా కావలసినంత తీపివుండగా చేదు తింటారా? కావలసినంత నీడవుండగా యెండలో యెవరైనా నిలుచుంటారా? భావించి తలంబ్రాలు పోయవయ్యా యీలోగా అధరామృతమెందుకు? మాదేవి వుండగా నీకు మరొకతె యెందుకు? అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! వట్టి అలుకలతో (వ్యర్థమైన కోపముతో) నీకు వచ్చినదేమి? ఇప్పుడే నీ చెలిని మన్నించి, దేవి ఇంటికి రావయ్యా! నీవు ఒక్కసారి ఆమెతో మాట్లాడితే ఆమె ఆయము (మనస్సు) కరిగిపోతుంది. చేతులలో బిగించి పెనవేసుకొంటే చెమటతో తడిసి ముద్ద అయిపోతుంది. ఒప్పుగా నవ్వితే ఆమె వొడలెల్లా పులకరించేను. ఇటువంటి తీయని చెలి నీదే ప్రభూ! ఎవరన్నా తీపి దొరికితే చేదు తింటాడటయ్యా? నీవు ఆమె సరసన (పక్కన) కూచుంటే ఆమె సంతోషంలో తలమునకలవుతుంది. నీవు ప్రేమతో చూచినంతనే ఆమె కోర్కెలన్నీ ఫలిస్తాయి. స్థిరంగా నీ బరువు ఆమెపై ఆనిస్తే కొంకుగొసరు (భయపడి, బేలయై పోతుంది). యుక్తమైన చల్లని నీడలు వుండగా మండే యెండలు దేనికయ్యా. ప్రభూ! ఇప్పుడే ఆమెకు అధరామృతం రుచిచూపితే మోహాతిరిక్త అవుతుంది. ఆమెను భావించి సేసవెట్టితే (తలంబ్రాలు పోస్తే) ఫలితం వుంటుంది. కథ సుఖాంతమై ఓ శ్రీవేంకటేశ్వరా! ఈవేళ మా అలమేలుమంగతో కూడితివి. ఈమె నీ స్వంతమయ్యాక నీకు ఇంకొకళ్ళతో పనేముందిలే?



సంఖ్య : 297 సంపుటము : 24 పుట: 199 రాగం : భైరవి

**7** అప్పటి నాతో మాటాఁడీ నదివో తాను
యిప్పుడు తనగుణాన కెన్నవత్తు నటవే ॥పల్లవి॥

పలుమారు సొలసితి పైపైఁ దన్ను దూరితి
కలువల వేసితిఁ గాఁక చల్లితి
వలపు నన్నింతసేసె వాసులు పంతము రేఁచె
మలసి తనకు నేను మంచిదాననటవే ॥అప్ప॥

బొమ్మల జంకించితి పొదుగఁగాఁ బెనఁగితి
చిమ్మితి గోళ్ల గుంపించితి సారెకు
నెమ్మనము చలపట్టె నిక్కించె మందెమేళము
యిమ్ములఁ దనకు నేను హితురాలనటవే ॥అప్ప॥

చన్నుల నొత్తితి మోవి చవిగొంటిఁ దమితోడ
కన్నులనే మెచ్చితి కాఁగిలించితి
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్‌మంగను నేను
వున్నతి నన్నేలినాఁడు వుపకారినటవే ॥అప్ప॥ **297**

**మున్నుడి :**

ఈ కీర్తనలో నాయిక తన చెలికత్తె (అన్నమ్మ)తో యేమంటున్నదో వినండి. ఆ రోజుల్లో తానే నాతో కల్పించుకొని మాట్లాడేవాడు. ఇప్పుడు తన అసలు గుణం యేమిటో తెలుస్తున్నది. వాటిని యెన్నలేము. నేనెంత తెగువచూపినా తాను చొఱవచూపడు. నేను తగిన దానను కానా? తనకు హితురాలను కానా? నా కళ్ళతో ప్రేమ గుమ్మరించినా చలించడేమే? ఇంతలో తానే నన్ను మన్నించి కూడినాడు. ఇంతకీ నేను స్వామికి వుపకారినేనా?

**భావ దీపిక :**

చెలీ! తానే నాతో అదిగో, అప్పటి (ఆనాడు) యెన్ని మాటలు చెప్పేవాడు!! ఇప్పటి తనగుణాలను చూచి,యెన్నవచ్చునటే? నీవే ఇది విను. పైపై తన్నుదూరి (ఉత్తుత్తిగా తనను దిట్టి) అనేకమార్లు నాకు అలసట వస్తున్నది. అతనిపై కలువపూలు విసరితిని. కోపం కూడా తెప్పించాను. అతనిపై ప్రేమ నన్నింత చేసింది. వాసితో పంతాలను రెచ్చగొట్టాను. ఇంత చేస్తే అతగాడు నన్ను మంచిదానిగా మన్నిస్తాడటవే? ఒక్కొక్కసారి నా కనుబొమలతోనే అతనిని యెన్నోసార్లు బెదరించాను. నన్ను పొదివిపట్టుకొంటే పెనగులాడాను. గోళ్ళతో చిమ్మితి (గిచ్చాను). సారెకు (ప్రతిసారి) గుంపించితి (ఈర్ష్యతో కసురుకొన్నాను). మొండిగా ప్రవర్తించాను. మందెమేళమున (జంకుగొంకులేక) నిక్కించె (గర్వంచూపితిని). మరి ఈనాడు నేను తనకు హితురాలనని భావిస్తాడా? ఇదిట్లాకాదని, నా కుచములనతగానిని వొత్తితిని చెలరేగి అధరామృతమును గ్రోలితిని. కన్నులతో మెచ్చుకొంటిని. గాఢముగా కౌగలించితిని. ఇదంతా యెందుకు చేశాను? ఆయన అన్ని విధములా శ్రీవేంకటేశ్వరుడు. నేను అలమేలుమంగను. ఆయన ఉన్నతుడైనన్నేలినాడు. చెలీ! నేను స్వామికి ఉపకారినటే?

సంఖ్య : 473 సంపుటము : 23 పుట: 316 రాగం : దేసాళం

**12** నే నెఱిఁగినవే తొల్లి నీసుద్దులు
మానఁగదవయ్య నీమతకము లెల్లను ||పల్లవి||

నీవున్న యిక్కు లెఱిఁగి నెలఁత యీడకే వచ్చే
సేవసేయ రమ్మని చెప్పెంపితివో
వోవల నీవప్పటిని వొట్టేల పెట్టుకొనేవు
దేవరపు గావా నీవు దిమ్మరితనానకు ||నేనె||

తప్పులేక నీవన్నట్టె తారుకాణమాట లాడె
వొప్పుగఁ బదరుకొంటివో తొలుతే
కప్పికప్పి నీవేల కడునొడఁబరచేవు
యెప్పుడు రాజవుగావా యీవిద్దెలకును ||నేనె||

నెక్కొని శ్రీవేంకటేశ నీవు నవ్వినట్టె నవ్వె
యెక్కడఁ గూడితిరో యింతకముందే
చెక్కునేల నొక్కేవు చిప్పిల నన్నిట్టె కూడి
గక్కనను గురువవుగావా యీయెమ్మెలకు ||నేనె|| **473**

**మున్నుడి :**

"మతకములు" అంటే మాయలు అని అర్థం. అన్నమయ్య వినిపించిన ఈ శృంగార కీర్తనలో నాయిక స్వామితో నీపాత కథలన్నీ నేనెరుగుదునుస్వామీ! ఇక మానవయ్యా! నీమాయలు నాదగ్గర చెల్లవు అని దెప్పుతున్నది. ఈ విలాసాలకు నీవేకదా! పెద్ద గురువుగారివి అని ముక్తాయింపునిస్తున్నది.

**భావ దీపిక :**

స్వామీ! నీ తొల్లిసుద్దుల (పూర్వకథలన్నీ) నేను యెఱిగినవే కదా! నీమాయలనికనైన మానుమయ్యా!. నీవిచ్చిన సంకేతాలందుకొని యెవరన్నా చిన్నదాన్ని నీ"సేవ" చేసికొనటానికి రమ్మని చెప్పిపంపావా యేమి? ఓవల (అవతల) మరీమరీ నీవు ఒట్లెందుకు పెట్టుకొంటున్నావు? నీవు దేవదేవుడవు కదా! ఇంత దొమ్మరితనం (భ్రమ) నీకెందుకయ్యా? నీవన్నదాంట్లో తప్పేమీలేనట్లే ఋజువులు మాట్లాడనేలనయ్యా? తగుదునమ్మా అని అర్థంలేకుండా మాటలు చెబుతున్నావు. నీదగ్గర యేమీ దోషం లేకపోతే గుంభనంగా నన్నెందుకు ఒడబరచేవు? ఈ టక్కరి విద్యలకన్నింటికీ "రాజు"వు నీవేకదా! ఓ శ్రీవేంకటేశ్వరా! అతిశయముగా ఆమె నీవు నవ్వినట్లే నవ్వుతున్నది. ఇంతకు ముందే మీరు కూడినారా యేమి? లేకపోతే చిట్లిపోయేట్లు నా చెక్కిలినొక్కి అంతతొందరగా యేల కూడెదవు? నాకు తెలియదా, ఇట్లాంటి విలాసాలు చూపటంలో నీకంటే గురువు యెవరు?



సంఖ్య : 195 సంపుటము : 23 పుట: 131 రాగం : సామంతం

**9** ఎఱఁగము నీచిత్త మిఁక నెట్లున్నదో
మఱియు నీయానతికి మారుకొనమయ్యా ||పల్లవి||

చలములు సారెకు సాదించువారికి
మలసి యేమనినా సమ్మతి గాదు
వలపులు పైపై వడిసేటివారికి
పిలిచినఁ గొండంతప్రియము గలుగు ||ఎఱఁ||

పంతములే కడుఁబచరించేవారికి
శాంత మించుకయు సమకొనదు
సంతపుఁబొందులు జరపెడివారికి
వింతగాఁ జూచినా వేడుక గలుగు ||ఎఱఁ||

ధరలో యెగ్గులుతప్పులవారికి
సరసపుఁజెనకులు చవిగావు
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
అరయ మనల కింకా ఆసలే కలుగు ||ఎఱఁ|| **195**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో స్వామి వలపుకత్తెయై యేమంటున్నారో వినండి. మగవానిచిత్తము నంచనా వేయలేము. పైగా నీవు అందరిలాంటివాడివి కాదు. నీవు ఆజ్ఞనిస్తే మారు మాట్లాడగలవారెవ్వరు? మొండివాళ్ళకి యేదీ సమ్మతికాదు. సంతలో అంగడి పెట్టుకొనేవారికి వింతగా కనుపించేదేన్ని చూచినను వేడుకగానే వుంటుంది. అయినా మనిద్దరి మధ్య ఆనలెందుకయ్యా? అన్నదా చిన్నది.

**భావ దీపిక :**

స్వామీ! నీచిత్తము యెప్పుడెట్లా వుంటుందో యెఱుగనేరము, మఱియు నీఆనతికి (ఆజ్ఞకు) యెదురుచెప్పగల ధైర్యం యెవరికున్నది? ప్రతిసారి చలములు (మొండిపట్టుదల) సాధించే వారికి మలసి (తిరిగి) యేమని నా సమ్మతిగాదు. పైపై వలపులు వడిసేటి (మెలిపెట్టే) వారికి, తమ ప్రేమికులు పిలిచినా కొండంత ప్రియము కలుగుతుంది. ఎప్పుడూ పంతములనే, పచరించువారికి (ప్రసారించువారికి) శాంతగుణం కొద్దిగా కూడా అబ్బదు. సంతలో స్నేహాలు కుదుర్చుకొని తిరిగేవారికి వింతగా యేది కనుపించినా వేడుక కలుగుతూనే వుంటుంది. ప్రియా! ఒక్కమాట చెబుతాను విను. ఈ లోకంలో అవతలవారి దోషాలు, తప్పులు మాత్రమే పట్టుకొనేవారికి సరసపు చెనకులు (చలోక్తులు) చవిగావు (వారికి రుచించవు). సరే! నేడు వో శ్రీవేంకటేశా! ఇరవుగా (నాదరిజేరి) నన్ను కూడితివి. ఇది చూచి ఆశలు ఇంకా ఇంకా కలుగుతాయి.

సంఖ్య : 105 సంపుటము : 24 పుట: 71 రాగం : నాగవరాళి

**10 ఇద్దరితలఁపు లవె యింపు లవె మీలోన-**
**నద్దినకోరిక లవె అంపరాదా మమ్ము** ॥పల్లవి॥

**నెలఁతరో నీవిదె నీవిభుఁ డల్లవాఁడె**
**పలికినమామాఁటపట్లు నవె**
**తలఁపులుఁదలఁపులుఁ దలకూడె మీలోని-**
**యలుక లిన్నియుఁ దీరె నంపరాదా మమ్ము** ॥ఇద్ద॥

**కప్పిన నీచూపు లవె కాంతునిరూప మదె**
**తెప్పలఁదేలేటిమీతెలువ లవె**
**వొప్పన సేసితిమి మిమ్మొకరొకరిని మీకే**
**అప్పుడే చలము చెల్లె నంపరాదా మమ్ము** ॥ఇద్ద॥

**చిమ్ములనీచేతు లవె శ్రీవేంకటపతి-**
**కమ్మినతమకములకాఁగి లదె**
**దొమ్మిగాఁ గూడితి రిట్టె దోమతెరమంచములో**
**అమ్ముడుజీతము లాయ నంపరాదా మమ్ము** ॥ఇద్ద॥ **105**

**మున్నుడి :**

"అంపు" అంటే వెళ్ళు అని ఆజ్ఞాపించి పంపించటం. అన్నమయ్య తానూ ఒక చెలికత్తెయై దేవితో యేమని అంటున్నారో వినండి. "దేవీ! మీ ఇద్దరి తలపులు కలిశాయి. అందచందాలు కలిశాయి. మీలో ప్రస్ఫుటమౌతున్న కోరికలూ కలిశాయి. మరికనేమి? మమ్మల్ని ఆయనవద్దకు రాయభారానికి వెళ్ళమని ఆజ్ఞాపించరాదా?" రెండుమూడుసార్లు చదివితేగాని అర్థంగాని కీర్తన ఇది.

**భావ దీపిక :**

దేవీ! మీఇద్దరి తలపులవె (ఆలోచనలొక్కటే). ఇంపులూ అవే (ఇష్టములూవొక్కటే). మీలో అద్దిన (ముద్రింపబడిన) కోరికలూ వొక్కటే. మరి జాగేల? మమ్ము ఆయన వద్దకు అంపరాదా (పంపించరాదా?) ఓ నెలతా! నీవిక్కడేవున్నావు. అల్లదిగో ఆతడక్కడనేవున్నాడు. మేము పలికిన మా మాట పట్టు (శపథాలు) అలాగే వున్నాయి. ఇంతలోనే మీ ఇద్దరి తలపులు వొకటైనాయి. మీలోని కోపతాపాలు కొండెక్కాయి. అయిందేదో అయింది, ఇప్పటికైనా అక్కడికి మమ్ము పంపించరాదా? దేవీ! పరవశంతో కప్పుకొని పోయిన నీ చూపులు అట్లాగేవున్నాయి. ఆ పరవశనానికి కారణమైన నీ కాంతుని రూపమూ అలాగే వున్నది. తెప్పలదేలేటి (తేలిపోయే) మీ తెలుపులు (యెఱుకలు) అట్లాగే వున్నాయి. మీ ఇద్దరినొక్కరొక్కరిగా కలిపాము. అప్పడే నీ పట్టుదల సడలిపోయింది. ఇకనైనా మమ్ము పంపరాదా? విజృంభించిన నీ చేతలూ అలాగేవున్నాయి. శ్రీవేంకటపతి తమకము కమ్మగా ఇచ్చిన కౌగిలీ అలాగే వున్నది. ఆపైన మీరిరువురూ చెలరేగి దోమతెరమంచములో వొకటిగా కూడినారు. ఎలాగో జీతానికి అమ్ముడుపోయాంకదా! మమ్ము పంపించెయ్యరాదా?



సంఖ్య : 296 సంపుటము : 24 పుట: 198 రాగం : ముఖారి

**11 ఏమిసేసే విక్కడను యెంతపని గద్దు నీకు**
**కోమలి నీరాకలే కోరుకొని వున్నది** ॥పల్లవి॥

**ఇచ్చకమాడేనని నీ కితవరి నయ్యేనని**
**కొచ్చి చెలులతో నెంచుకొంటా నున్నవి (ది?)**
**ముచ్చటాడేనని సతి మోముచూచి మొక్కేనని**
**విచ్చేసే వాడకునని వేళగాచుకున్నది** ॥ఏమి॥

**చనవరినయ్యేనని సరసమాడేనని**
**మనసులో సంతోసించి మరిగున్నది**
**పెనఁగులాడేనని ప్రియములు చెప్పేనని**
**తనివోనిరతులకుఁ దమకించి వున్నది** ॥ఏమి॥

**చిత్తముదెలిసేనని చేకొని కూడేవని**
**హత్తి పాన్పుపై నాయిత్తమై వున్నది**
**ఇత్తర శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ**
**కొత్తలుగా నేలితి విక్కువ నింకా నున్నది** ॥ఏమి॥ **296**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామితో యేమి అంటున్నారో వినండి. స్వామీ! ఈ కోమలి నీరాకలనే కోరుకొనివున్నది. నీకు యెంత పనివుంటే మాత్రం ఇక్కడ యేమిచేస్తావు. అక్కడ ఆమె (దేవి) నీకు హితైషినవుతానని, ఇచ్చకములాడెదనని తన వాడకెప్పుడొస్తావా అని యెదురు చూస్తోంది. నీవు తనను కొత్తగా మురిపిస్తావని అనుకుంటున్నదయ్యా! అని అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీవు యిక్కడ ఆమె నేమి సేసేవు? నీకు యెంత పని వున్నది తెలిసిన సంగతే. కాని ఈ కోమలి నీరాకలనే కోరుకొని వున్నది. మరి జాగేలనయ్యా? నీతో ఇచ్చకమాడెదనని, నీకు ఇతవరి (హితురాలు) అయ్యెదనని, కొచ్చి (గుచ్చి చూస్తూ) తన చెలులతో వూహించుకొంటున్నది. నీవు తనతో ముచ్చటలాడుతావని, నీవు సతిమోములోకి చూడగా నీకు నమస్కరించాలని తలపోస్తున్నది. నీవు ఆమె వాడకు విచ్చేస్తావని, ఆ సమయం కోసం యెదురుచూస్తున్నది. నీకు చనవరి (చనువుగల ప్రేయసి) నయ్యేదనని, సరసములాడెదనని, తనమనస్సులోనే సంతోషిస్తూ వుద్రేకము చెందుచున్నది. నీవు తనను దగ్గరకు తీసికొంటే పెనగులాడెదనని, ఆపై ప్రియములు చెప్పెదనని వూహిస్తున్నది. తనని దీరని రతులకై తన్మయత్వమున వేచివున్నది. నీవు తన చిత్తము తెలుసుకొంటావని, తనను స్వీకరించి కూడెదవని ఇతన పాన్పుపై నీకొఱకు సిద్ధముగావున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈమె యెవరనుకొన్నావు? ఈమె దేవి అలమేలుమంగమ్మ నీవు ఇంకా కొత్తగా అనురాగంతో యేలుకొంటావని యెదురుచూస్తున్నది.

సంఖ్య : 194 సంపుటము : 23 పుట: 130 రాగం : బౌళి

**16** ఏమినేరుపులు చూపే వెందాఁకాను
కామించి నీపట్టు కతికడవలేఁగాక ॥పల్లవి॥

ఆకెతో మాటాడఁగా నేమందునోయంటా నీవు
వాకున మాటాడేవు వంతుకు నాతో
పైకొని నాపై నంతబత్తిగద్దా నీ కేమైనా
నీకు మోహించినదాన నేఁ బాయలేఁగాక ॥ఏమి॥

నెట్టన నాపెతో నవ్వి నేఁ గోపగించేనంటా
నట్టనడుమ నూరకే నవ్వేవు నాతో
బట్టబయలు నేనీకు బాఁతే ఇందరిలోనా
అట్టిట్టని నీతోను అలుగలేఁగాక ॥ఏమి॥

అలమేలుమంగఁ గూడి అట్టె నన్ను బుజ్జగించఁ
గలసితి నిటు భూకాంత నేనంటా
యెలమి శ్రీవేంకటేశ ఇంతకరుణా నాపై
మలసి యెంతైనా నిన్ను మరవలేఁగాక ॥ఏమి॥ **194**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామి వలపుకత్తెయై యెలా దెప్పుతున్నదో చూడండి. “ఏమి నేర్పులు చూపుతున్నావు స్వామీ!!! ఇట్లా యెందాకా చేస్తావు? కావాలని నీవుచూపే పట్టుదలకు లోటే లేనట్లుందే? అటు నీకు నీదేవేరులూ కావాలి. ఇటు నేనూ కావాలి. నీవు నవ్వేది ఆమెతోనే. కాని వూరకనే నేనేమనుకొంటానో అని నాతో మొహమాటానికి నవ్వుతావు. నన్ను బుజ్జగించబోతున్న నిన్ను చూస్తే నీ కరుణను మరువలేనయ్యా!” అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీవు యెందాకా ఇట్లా చేస్తావు? ఏమి నేర్పులు చూపుతున్నావయ్యా!!! “కామించి నీపట్టుకు అతికడమ లేదు గాక!” (కావాలని నీవు చూపే పట్టుదలకు లోటేలేనట్లుందే!!). ఆమెతో మాట్లాడితే నేనేమనుకుంటానోయని నీవు నాతో “నోటిమాటలు” యేదో వంతుకు చెబుతావు. నిజంగా నీకు నాపైన అంత బత్తి (శ్రద్ధా-భక్తి) వున్నాయా? ఏదో నాపిచ్చి కొద్దీ నిన్ను మోహించాను. నిన్ను విడిచి వుండలేను. అదే కదా! నీ ధైర్యం? నెట్టన (ప్రత్యక్షంగా) ఆమెతో (దేవితో) నవ్వితే దేవి కోపిస్తుందనే సాకుతో, మధ్య మధ్య నాతో వూరకనే నవ్వుతావు. స్వామీ! నాకు నీమీద యేమి అధికారం వున్నది? ఇంత బట్టబయలుగా ఇందరిలో నీకు నాపై ఈ బాఁతి (భ్రాంతి) యేమిటని అట్లా యిట్లా నీపై ఆగ్రహించలేను కదా! ఒక పక్క నీదేవేరి అలమేలుమంగను కూడుతూనే, ఇట్లా యేదో నన్ను కలిసి బుజ్జగిస్తున్నావు. నీవు మరెవ్వరో కాదే... నా భూదేవివి అంటూ నచ్చచెబుతున్నావు. అతిశయించిన శ్రీవేంకటేశ్వరా: ఇంత కరుణ నాపై చూపుతున్నావే, మరల నేను నిన్నెట్లు మరువగలను ప్రభూ!



సంఖ్య : 212 సంపుటము : 23 పుట: 142 రాగం : బౌళి

**13** పిన్నలు నాచన్నులు పిసుకకు పలుమారు
వున్నతిఁ బెరిగితేను వోరిచేఁగాని ॥పల్లవి॥

నేరుపుగలవారలు నీతో మాటలాడిరి
నేరనిదాన నేను వూరకుందాన
గోరనేల వూఁదేవు కుమ్మెలయ్యీ మేనిట్టె
నేరుపరాదా నీవల్ల నేరిచేఁగాని ॥పిన్న॥

రట్టడిసతులెల్లాను జట్టులుసేసిరి నిన్ను
గుట్టుతోడిదానఁగాన కొసరనోప
పట్టకు కుచ్చెల చేత పాసీ పోఁకముడి
గట్టువాయఁ జేయరాదా ఘనమయ్యేఁగాని ॥పిన్న॥

వెగ్గళించినచుట్టాలు వెట్టిపనులు గొనిరి
సిగ్గువడ్డదానఁగాన సేవసేసితి
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయ నన్నేలితివి
తగ్గక మోవియ్యరాదా దప్పిదేరేఁగాని ॥పిన్న॥ **212**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తన కొంతమంది ఆధునికులకు ‘పచ్చి’గా కనుపించినా ఇందులోని సహజత్వం కన్నెప్రాయపు ప్రియురాండ్ర మనస్సునావిష్కరిస్తున్నది. “నేను పిన్నదాననయ్యా! వోర్చుకోలేను. ఉన్నతిగా పెరిగితే నా కుచములపిసుకుదువుగానిలే. ఇప్పుడవి పిన్నలు” అని వేడుకొంటుందట. “ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్” అని ముద్దుతిమ్మన్న అందుకే అన్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నా కుచములు పిన్నలు (చిన్నారివి). పలుమార్లు పిసుక తగదు. ఉన్నతముగ బెరిగిన వోర్వగలనుగాని ఇప్పుడు కాదయ్యా! నేరుపుగల జాణలు నీతో మాటలాడిరి. కాని నేను నేరనిదానను (ముగ్ధను). ఊరకుండరాదా? నీవు గోటితో గీరితే వొళ్ళంతా కమ్మెలయ్యేనయ్యా! సరసము నీవు నేర్పేదనంటే నేను నేర్వనా? నీచుట్టూవున్న సతులందరూ రట్టడివారే. నిన్ను వారు చట్టులుసేసిరి (దౌర్జన్యం) చేశారు. నేను గుట్టు గలదానను. కొసరి సరసములాడితే నేను సహించలేను. అంత గట్టిగా నాకుచ్చెళ్ళు పట్టుకొంటే పాసీపోకముడి (కుచ్చెళ్ళు బిగించిన పోకముడి వూడిపోదా?) ఇంకానయం, గట్టివాయజేయరాదా ఘనములయ్యేను (బలాత్కారం చేస్తే ఇంకా బాగుంటుంది). వెక్కిరించే నా చుట్టాలు నాతోవెట్టిచాకిరి చేయించుకొన్నారు. నేను సిగ్గుల మొగ్గను కావున నీకు సేవ చేశాను. అది వృధా కాలేదు. నిగ్గుదేరిన శ్రీవేంకటేశ్వరుడవైన నీవు నన్నేలితివి. ఇక నేనూ తగ్గను. నాకు అధరామృతమునందించు. నాకూ ‘దాహం’ తీరుతుంది.

సంఖ్య : 295 సంపుటము : 24 పుట: 197 రాగం : మంగళకౌసిక

**14 అతిరాజసపువాఁడు అన్నిటాఁ దాను**
**సతులచేఁ జెప్పిపంపీ సారె వచ్చేనంటాను ॥పల్లవి॥**

**చెలులతో మాటాడితే చిగిరించు వలపులు**
**కలసి మెలసి వుంటే కాఁక రేఁగును**
**మలసి నవ్వు నవ్వితే మర్మములెల్లాఁ గరఁగు**
**వొలిసి తానింతేసి కోపఁగలఁడటవే ॥అతి॥**

**చెనకితేఁ జెమటలు చెలమలవలె నూరు**
**ననిచి మోము చూచితే నాటుఁ జిత్తము**
**పెనఁగితేఁ దమకము పెరుగుఁ గోటికొండలై**
**వొనరి యిట్టిపొందుల కోపఁగలఁడటవే ॥అతి॥**

**పొసఁగఁ జేయి చాఁచితే పులకలు మోసులెత్తు**
**కొసరితే కోరికలు కుప్పలైనిండు**
**యెసఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను**
**వొసపరై కూడె నింత కోపఁగలఁడటవే ॥అతి॥ 295**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి తన చెలికత్తెయైన ఆమె (అన్నమయ్య)తో యేమంటున్నదో వినండి. స్వామి అతిరాజసమువున్నవాడు. నాసతులతో రమ్మని చెప్పి పంపిస్తే వస్తాడటనే? ఆయన చెలులతో నవ్వితే రహస్యాలు దాచలేడు. పెనవేసికొంటే తన్మయత్వం ఆపుకోలేడు. చేయిచాచి తాకితే అంతులేని పులకరింతలు. నేను అలమేలుమంగను. ఇవన్నీ యెట్లా సహించనే?

**భావ దీపిక :**

చెలీ! అతగాడు (స్వామి) అన్నిటిలోనూ అతిరాజసపువాడు (మిక్కుటమైన రాచఠీవి వున్నవాడు). సారె (ప్రతిసారి) చెలులతో, చెప్పిపంపితే (రమ్మని చెప్పిస్తే) వచ్చేనటే? తనకు చెలులతో మాట్లాడితే వలపులు చిగురిస్తాయి. కలిసిమెలిసి అతనితోవుంటే తనకు కాఁకరేగేనే. తన్మయత్వంతో చెలులతో మాట్లాడుతూ నవ్వుతూ వారి మర్మములను తాకుతుంటే మాత్రం తాను ఇంతేసి చేష్టలకు వోపగలడటవే? (ఒడిగట్టగలడటే?) తనకు వయ్యారెవతెయైనా చెనకితే (తాకితే) చెమటలు నీటిచెలమలవలె కారిపోతాయి. దగ్గరై ప్రేమగా ముఖములోకి చూస్తే హృదయం పారవేసికొంటాడు. పెనగితే (పెనవేసికొంటే) తన్మయత్వం కోటికొండలు నిలబెట్టినట్లు పెరిగిపోతుంది. అతగాని పొందులన్నీ ఇట్లాంటివే. తానెట్లా సహించునే? తనతో పొందుజేసికొనుటకు చేయిజాచితే పులకరింతలు చిగురిస్తాయి. ప్రేమగా కొసరుకొంటే కోరికలు కుప్పలెత్తుతాయి. ఏను (నేను) అతిశయించిన అలమేలుమంగను. అతడు శ్రీవేంకటేశ్వరుడు. అతడు ఒసపరై (ఉత్కృష్టముగా) నన్నుకూడితే యెట్లు సైపగలడే?



సంఖ్య : 452 సంపుటము : 23 పుట: 302 రాగం : సాళంగనాట

**15 అయ్య జియ్యలువెట్టేనీయాఁడువారము**
**పయ్యదకొంగునఁ గట్టేపాటివారమా ॥పల్లవి॥**

**కాంతలయడాటాన కాఁకదేరినవాఁడవు**
**చెంతల వలపించనేర్చినవాఁడవు**
**దొంతిమోవుల దోమటిదొడికినవాఁడవు**
**పంతాలు నీతో నాడేపాటివారమా ॥అయ్య॥**

**సరసపుమాటలనే సంతవెట్టినవాఁడవు**
**సరి నవ్వుఁగప్పురాలే చల్లేవాఁడవు**
**తొరలింపుసిగ్గుకు దోసిలొగ్గినవాఁడవు**
**పరగ నీకాళ్లు దొక్కేపాటివారమా ॥అయ్య॥**

**కొలఁదిమీరినచనుఁగొండలలోవాఁడవు**
**మెలుపుశ్రీవేంకటాద్రిమీఁదివాఁడవు**
**అలమేల్మంగను నే నన్నలమినవాఁడవు**
**కలసినరతులు పొగడేపాటివారమా ॥అయ్య॥ 452**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో స్వామి వలపుకత్తెలు తాము అతిసామాన్యులమనీ, త్రిభువనాధినాథుని కొంగుకు కట్టేసుకొనేపాటివారము కాదనీ ఆయన అనేక కామకళలు నేర్చినవాడనీ తాము సిగ్గులకు దోసిలొగ్గేవారమనీ స్వామి కాళ్ళు దొక్కేపాటివారముకాదనీ చెబుతున్నారు. ఇంతలో శ్రీవేంకటేశుని చూస్తూ దేవి ముక్తాయింపుగా యేమంటున్నదో తెలియాలంటే మీరు ఈ కీర్తన భావదీపిక కడదాకా చదవక తప్పదు.

**భావ దీపిక :**

స్వామీ! మేమేపాటివారము? నీకు సదా అయ్యాజియ్యలుపెట్టు (అయ్యా అప్పా అంటూ మనవి చేసికొనే) ఆడువారము. నిన్ను పైటకొంగుకు కట్టిపడవేసేపాటివారమా? కాంతలతో ఆడుకోవటంలో నీవు కాఁకలు దేరిన మొనగాడివి. దగ్గరకు తీసికొని వలపించనేర్చిన శృంగారరాయడవు. దొంతిమోవుల (వరుసగా అధరామృతం-గ్రోలగల) దోమటిదొడికన (మాయగుప్పించిన) మాయగాడవు. నీతో పంతాలనాడేటివారమా ప్రభూ! సరసోక్తులను నీవు సంతలో అమ్మగలవు. ఆడుదానిని చూచి నవ్వావంటే కర్పూరపుజల్లు కురిసినట్లే కదా! తొరవింపు సిగ్గులకు (మెలకలెత్తిన స్త్రీల సిగ్గులకు) దోసిలిపట్టే మొనగాడివి. అతిశయించి నీకాలుదొక్కేపాటివారమా (నిన్ను పెళ్ళాడగలవారమా?) కొలది మీరిన (సాటిలేని) చనుగొండల్లో విహరించేవాడవు. శ్రీవేంకటాద్రి మీదివాడవు. అదంతా అటుంచి నేనే నీదేవి అలమేలుమంగను. నన్నలమినవాడవు (ఆక్రమించినవాడవు) నీవే. నీవు రతులలో కలియగా నీ కళానైపుణ్యాన్ని పొగడేపాటివారమా?

సంఖ్య : 176 సంపుటము : 24 పుట: 118 రాగం : రామక్రియ

**20 అదియే కాదా సతత మాతనికి తన కిపుడు**
**పదియవస్థలఁ బొంగి భ్రమసేఁగాక ॥పల్లవి॥**

**పతిఁ బాసి విరహమున పానుపే పామనుచు**
**అతివ యల్లన లేచి అవలి కేఁగె**
**సతి యంతలోఁ గొలన జలకేలి కేఁగి యది**
**మతిఁ బొంగుజలధనుచు మారుమో మిడియ (యె?) ॥అది॥**

**తరుణి తామర యిల్లు తపనమండలమనుచు**
**అరమరచి కాఁకలనె యలసె నదివో**
**మరిగి మట్టెలరవము మంత్రశాస్త్రం బనుచు**
**వెరవెడలి తనలోనె వెరగందె నదివో ॥అది॥**

**చెలియ దనకుచగిరులు శ్రీవేంకటాచలపు-**
**నిలువుశిఖరములనుచు నిధుల నిలిచె**
**వలచి శ్రీవేంకటేశ్వరుఁ డపుడు గూడఁగా**
**తలఁపులును దనువులును తారుకాణాయ ॥అది॥ 176**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో "పదియవస్థల బొంది భ్రమసె" అన్నారు పల్లవిలో. కానీ చరణాలలో ఐదు అవస్థలనే వివరించారు. ఇదేమిటా అని యెంత ఆలోచించినా బోధపడలేదు. పల్లవి మొదటి చరణంలోనే అసలు కిటుకు వున్నది. "సతతము ఆతనికి తనకూ ఇప్పుడు అదియేకాదా"–ఈ చరణం గమనిస్తే, ఆతనికి తనకూ అవే అవస్థలు కలిగాయి కావున మొత్తం అవస్థలు "పది" అయ్యాయి. ఇదండీ అన్నమయ్య చూపే చతురత.

**భావ దీపిక :**

సతతము (యెప్పుడూ) ఆతనికి (స్వామికి) తనకూ (దేవికి) ఇపుడు (యెప్పుడూ) అదియే కాదా (అదే కదా!) పదియవస్థల పొంగి (పొంది) భ్రమసెగాక (భ్రమించిరి కదా!) పతిని విడచి విరహావస్థలో పానుపే ఆమె పాము అని భ్రమ చెంది ఆ అతివ అల్లన (చటుక్కున) లేచి అవతలికి వెళ్ళిపోయింది. సతి అంతలోనే కొలనులో జలకేళిసలిపెదనని వెళ్ళి భ్రమలో ఆ కొలనే పొందిన "జలధి" అనుకొని అందులో దిగుటకు పెడమొగమాయెను. తరుణి తామరపూల ఇంటిని ఉదయించు తపనమండలమనుచు "సూర్యబింబ"మని భ్రమజెంది ఆదమరచి కాఁకలని (వేడి అని) తపించెనదిగో. లయబద్ధమైన తన మట్టెల రవళులు రహస్యమైన మంత్రశాస్త్రములోని మంత్రములను వినిపించుచున్నవా అని భ్రమచెంది తనలోనే భీతిల్లెను. చెలియ తన కుచగిరులే వేంకటాచలపు శిఖరములను భావముచే నిధుల నిలయముగ నిలిచెను. ఈ"త్వమేవాహం" భావనతో ఆమెను వలచిన శ్రీవేంకటేశ్వరుడు ఆమెను గూడగా వారి తనువులు, తలపులు నిదర్శనములై నిలిచినవి.



సంఖ్య : 239 సంపుటము : 23 పుట: 160 రాగం : మాళవిగౌళ

**17 ఇన్నిటా ఘనుఁడు దాను యేమిచెప్పేరే**
**యెన్నుకొనీ నాగుణము లేమిచెప్పేరే ॥పల్లవి॥**

**చెంతఁ దనచెప్పినట్టు సేసితినంటా నిదె**
**యెంత నన్ను బుజ్జగించీ నేమిచెప్పేరే**
**అంతటాఁ దన కిచ్చకమాడితినంటా నిదె**
**ఇంతలో నన్నుఁ బొగడీ నేమిచెప్పేరే ॥ఇన్ని॥**

**వొట్టి తనపై పాటలు వొనరఁ బాడితినంటా**
**యిట్టె విడెమిచ్చీని యేమిచెప్పేరే**
**జట్టిగాఁ జన్నులతోడ సాముసేయించితినంటా**
**యెట్టనెదుటనే మెచ్చీ నేమిచెప్పేరే ॥ఇన్ని॥**

**మనసుమర్మములంటా మంతనమాడితినంటా**
**యెనసి కౌఁగలించీ యేమిచెప్పేరే**
**చెనకి మొక్కితినంటా శ్రీవేంకటేశ్వరుఁడు**
**యినుమడిగా మన్నించె నేమిచెప్పేరే ॥ఇన్ని॥ 239**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ కీర్తనలో స్వామి ప్రేయసియై తన చెలులతో యేమంటున్నదో వినండి. తాను అన్నిటిలోనూ ఘనుడన్నది జగద్విదితమే. ఇంకా మీరు యేమి చెబుతారే. ఆయన నన్ను యెన్నుకొన్నదే నాగుణాలు చూచి. నేను తనపై చక్కటి పాటలు పాడుతానని. తాను చెప్పినట్లు వింటానని మనసులో మర్మం లేకుండా మాట్లాడతానని అందుకే శ్రీవేంకటేశుడు నన్ను మన్నించాడు. ఇంకా యేమి చెప్పేదే?

**భావ దీపిక :**

చెలులారా! తాను ఇన్నిటా (అన్నింటిలోను) ఘనుడే. ఏమి చెప్పేరే (అయితే యేమంటారే?) అవును, నాగుణమును చూచి ఆయన (స్వామి) నన్నుయెన్నుకొన్నాడు. అయితే యేమంటారే. తను నాదగ్గరవుంటే నేను తను చెప్పినట్లే చేస్తానని యెంతబుజ్జగిస్తాడో తెలుసా? ఏమి చెబుతారే మీరు? ఇంతకాలమూ తన ముఖప్రీతిమాటలు చెప్పాననుకొన్నా ఇంతలో నిజం తెలిసి నన్ను పొగడినాడు. అయితే యేమంటారే? ఒట్టి (హత్తుకొని) తనపై పాటలు పాడెదనని వెంటనే నాకు అంగీకార తాంబూలం ఇచ్చాడు నాస్వామి. ఇది కాదంటారా మీరు? జతగా నా కుచములతో కుమ్ములాట చేసినాడే. ఇంకా యేమి చెబుతారే బాహాటంగా మీ యెదుటనే నన్ను మెచ్చుకొన్నాడు గదే! నా మనస్సులోని మాట ఇదని ఆయనతో యెన్నో మంతనాలాడాను. అందుకే చెలరేగి నన్ను కౌగలించినాడు. ఇంకా మీరేం చెబుతారే? ఆయన నాకింత చనువిచ్చినా నేను శ్రీవేంకటేశునికి మొక్కుతూనేవున్నాను. అందుకే స్వామి నన్నంత మన్నిస్తాడు. ఇంకా మీరేమి చెప్పేరే?

సంఖ్య : 167 సంపుటము : 23 పుట: 112 రాగం : సాళంగనాట

**18 బతికితి వన్నిటాను పడఁతివల్లను నీవు**
**రతికిఁ బిలువవయ్య రవ్వగాఁ జేసీని ॥పల్లవి॥**

**సుద్దులు నీతోఁ జెప్పి చొక్కించి అందరుఁ జూడ**
**బుద్దులు నీకు నేరిపీఁ బొలిఁతి**
**వొద్దనుండి నవ్వుతాను వొడివట్టి తీసితీసి**
**పెద్దరికములుసేసి ప్రియముచెప్పీని ॥బతి॥**

**చెక్కులు నీకు నొక్కి సేవలు గొంతసేసి**
**ఇక్కువలెల్లా నంటీ నింతి**
**అక్కరతో వీడెమిచ్చి ఆకుమడిచొనఁగుతా**
**వెక్కసపుటిచ్చకము వేమారుఁ జేసీని ॥బతి॥**

**నెమ్మదిఁ గాఁగిట నించి నీకు మోవి చవిచూపి**
**సమ్మతించఁజేసి కూడె సకియ**
**మమ్ముఁ గూడితివి నేఁడు మక్కువ శ్రీవేంకటేశ**
**చిమ్ముచుఁ గమ్మటిఁ దాను సేసలువెట్టీని ॥బతి॥ 167**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో స్వామి చెలికత్తెయై ఇలా అంటున్నారు. స్వామీ! నీవు కేవలం మాదేవి వలన అన్నివిధాలా బ్రతికిపోయావు. కనీసం అందుకు ప్రతిగా ఆమెకు ఉపకారం చేయవయ్యా! ఆమెను రతికేళికి బిలువవయ్యా! నీకు ఉత్కృష్టమైన మేలుచేస్తుంది – అని నచ్చచెబుతున్నారు. నేడు నీవు మక్కువతో మమ్ము గూడినా చెలరేగి తలంబ్రాలు పోసేది మాత్రం నీ హృదయేశ్వరి అలమేలుమంగమ్మపైననే.

**భావ దీపిక :**

స్వామీ! నీవు అన్నిటా (అన్నివిధములా) పడతివల్ల బతికితివి (యశస్వివైనావు). అందుకు ప్రతిగా ఆమెను రవ్వగాజేసి (ఉత్కృష్టముగాజేసి) రతికేళికి దేవిని ఆహ్వానించవయ్యా! ఆ పొలతి మీయేకాతంలో తీయని ఊసులు చెప్పి నిన్ను పరవశింపజేస్తుంది. కాని అందరూ చూస్తూవుండగా మాత్రం నీకెన్నో "హితబోధలు" చేస్తుంది. నీకు చేరువయై నవ్వుతూనే వొడివట్టితీసి (యెదిరించి) పెద్దరికంచూపిస్తూ ప్రియమైన మాటలు చెప్పి నిన్ను అనునయిస్తుంది. మీ ఏకాంతంలో నీ చెక్కిలి చిదిమి ప్రేమగా కొంతపరిచర్యలు చేస్తుంది, ఆ దేవి (ఇంతి) స్వామి యొక్క ఇక్కువల (కళాస్థానములు) నన్నింటినీ స్పృశించుతూ, ఆప్యాయంగా తాంబూలమునందిస్తూ వింతవింత సంగతులు చెబుతుంది. ఎన్ని వింతలు చెప్పినా ఆమెకే చెల్లింది. స్వామీ! నిన్ను సున్నితంగా కౌగలించి మధురాధరమునందించి ఆ సకియ (నెచ్చెలి) నిన్ను సమ్మతింపజేసి కూడినది ఆ దేవి. నేడు ఆ స్ఫూర్తితో నీవు మమ్ము గూడితివి. మక్కువగల శ్రీవేంకటేశ్వరా! చెలరేగిన దేవి యెంతకమ్మగా నీపై తలంబ్రాలు పోస్తోందో చూచి మా జన్మ తరించింది స్వామీ!



సంఖ్య : 175 సంపుటము : 24 పుట: 117 రాగం : లలిత

**19 ఓ పోబాలకి నాతో నోపుదువటె**
**చేపట్టు జలధి దాఁట చిన్నివోడేకాదా ॥పల్లవి॥**

**పువ్వుగాని పిందెగాని పూఁపవయసుపడుచ**
**యివ్వల నన్నుఁ జెనకే వేలే నీవు**
**పువ్వులపూఁపలే కావా పొదలిఫలించేవి**
**చివ్వల వోరమణుఁడ చెల్లదటయ్యా ॥ఓపో॥**

**నల్లగాని తెల్లగాని నాఁటుఁజూపులపడుచ**
**యెల్లచూపి మాఁటలాడేవేలే నాతో**
**నల్లదెల్లలే కావా నడురేయి పగలయి**
**చిల్ల రేలెండలయ్యీ చింతించవయ్యా ॥ఓపో॥**

**తగ్గులేని మొగ్గలేని తమకపుకొఁగిటను**
**యెగ్గుసిగ్గు లేక కూడేవేమే నన్ను**
**తగ్గుమొగ్గులేనియట్టిదైవపుశ్రీవేంకటేశ**
**అగ్గమైతి పంతవిచ్చి ఆడనేఁటికయ్యా ॥ఓపో॥ 175**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తన సంవాదరూపమైనది. స్వామి దేవితో జరిపిన సరససంవాదమునాలకించండి. "ఓ బాలామణీ! నాతో నువ్వు సరితూగగలవటే?" అని స్వామి ప్రశ్నిస్తే, గడుసుతనం చూపదలచిన దేవి "పూనుకొని జలధిని దాటగలిగినది ఒక చిన్న "ఓడ" కాదా" అని బదులిచ్చింది. కీర్తనలో నాయికా నాయకుల సమయస్ఫూర్తి, "చానాతనం" చూపించటం అన్నమయ్యకు వెన్నతో పెట్టిన విద్య.

**భావ దీపిక :**

ఓ బాలకీ! (బాలికా!) పోవే! నాతో నీవు ఓపగలవటే (చాలగలవా?) చేపట్టి (పూని) సముద్రాన్ని దాటాలన్నా చిన్న 'ఓడకే' సాధ్యమవుతుందయ్యా! ఓ పడుచుదానా! పూలు పిందెలై ఇంకా పూయని వయస్సు నీది. ఇంత లేతవయసులో నన్ను యేల చెనకెదవే (స్పృశిస్తావే?) ఓ రమణుడా! పూవులు పిందెలేకదయ్యా! అతిశయించి ఫలములయ్యేది? ఓ పడతీ! నల్లటి కన్నులతో తెల్లని స్వచ్ఛమైన చూపులు నాటుకొనునట్లు చూపులు చల్లెదవు కాని నాకు హద్దులు చూపి మాట్లాడెదవేలనే? రేయింబవళ్ళు లేక మనుగడేలేదు. మరి అవికూడా నలుపూ తెలుపూనే కదటయ్యా? చలిరాత్రులే, మండే యెండలవుతాయిలే ఆలోచించవయ్యా! ఇన్ని మాటలు చెప్పేదేవీ! తగ్గుమొగ్గూ లేని తన్మయత్వంతో గాఢాలింగనంలో సిగ్గూ యెగ్గూ విడనాడి నన్ను కూడెదవేలనే? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు తగ్గూమొగ్గూ లేని (ఇష్టాయిష్టములు లేని) దేవరాయడవు (దేవదేవుడవు). నీతో పంతమిచ్చి అగ్గమైతిని (పోటీపడి ఓడిపోయాను). ఇంకా మాటలెందుకయ్యా?

సంఖ్య : 293 సంపుటము : 24 పుట: 196 రాగం : బౌళి

**24** ఏల నాతో నానతిచ్చే విచ్చుకపుమాటలెల్లా
ఆలకించి లి(వి?)నఁగాక అవుఁగాదనేనా ॥పల్లవి॥

మగువకుఁ దొల్లె నీవు మాట యిచ్చినవాఁడవు
నిగిడి పొందుసేయక నీవు మానేవా
చిగిరించి పూచికాచినయట్టిమామిడి
తగఁ బండ్లు పండక తా మానీనా ॥ఏల॥

తేరకొన నీఇంటికిఁ దెచ్చుకొన్నవాఁడవు
గారవించి కూడక ఇంక మఱచేవా
ఆరనార మేనిమీఁద నలఁదినకస్తూరి
కోరి పరిమళము చేకొననంటేఁ బోవునా ॥ఏల॥

వొద్దఁ బెట్టుక నీపాదా లొత్తించుకొనేవాఁడవు
వొద్దికమగఁడవై నీవుండకుండేవా
కద్దులే శ్రీవేంకటేశ కలసె నలమేల్మంగ
అద్దములో నీడవలె నంటువాసీనా ॥ఏల॥ **293**

**మున్నుడి :**

ఈ శృంగార కీర్తనలో అన్నమయ్య యిచ్చిన ఉదాహరణలు, ఆయన "పదకవితాపితామహు"డెందకయ్యారో ఋజువు చేస్తాయి. కీర్తన ఒక్కసారి వింటే ఆ కవితా వైభవం అర్థం కాదు. ఇది వినండి, శ్రీవేంకటేశ్వరుని దేవి అలమేల్మంగ అద్దములో నీడవలె నంటువారదట. ఏదో అర్థమైనా, కానట్లుంది కదా! అదే అన్నమయ్య కవితాచాతుర్యం. దీని వివరణ అందుకే అవసరమై నాబోటి 'అనామకుడిని" ముక్తి సోపానాలను యెక్కిస్తున్నది. అన్నమయ్య తాను స్వామివారి భావనాప్రియురాలై ఇలా అంటున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! ఎందుకు నీవు నాతో ఇచ్చకములు (ముఖప్రీతిపాటలు) ఆనతిచ్చేవు (వినిపిస్తావు?) శ్రద్ధగా ఆలకించి అవుగాదనరాదా (తిరస్కరించరాదా?) ఆ మగువకు నీపొందునిస్తానని మాట ఇచ్చాక నీవు నిగడి (అతిశయించి) ఆమెను పొందక మానెదవా? ఎక్కడన్నా పుష్పించి, పిందెలు కాచిన మామిడిచెట్టు తగు విధంగా మంచి రుచికరమైన మామిడిపండ్లనీయక మానుతుందా? ఆమెను తేరగా నీఇంటికి తెచ్చుకొన్నావు. అట్టివాడవు గౌరవం, మక్కువచూపి చివరికి కూడెదవు. నీవు ఆమెను వదలెదవని యెట్లనుకొంటాను? ఆరంగారంగా నీ ఒంటిమీద అలదిన కస్తూరి పరిమళములను వెదజల్లుతుంటే, నాకు ఆ పరిమళం అక్కరలేదంటే అది పోతుందా? నీవాదేవి మగడవు. ఇప్పటిదాకా ఆమెను నీవద్దనేబెట్టుకొని నీ పాదాలనొత్తించుకొన్నావు. ఇప్పుడు నీవామెకు ఒద్దిక మగడివై (అనుకూలుడైన భర్తవై) వుండక మరొక తీరుగా వుంటావా? ఓ శ్రీవేంకటేశ్వరా! అనురాగముతో నీ ఆలమేలుమంగ నిన్ను కలిసినది. అద్దములో నీడవలెనంటువాసీనా? (అద్దములోని నీ ప్రతిబింబంవలె ఆమె నిన్ను నీతో బంధనాన్ని వదలిపెడుతుందా?)



సంఖ్య : 177 సంపుటము : 24 పుట: 119 రాగం : ముఖారి

**21** పలుకులకొలఁదే కాక పంత మేఁటికి మాను
చెలువునిఁ గలయుమతమే చింతించరాదా ॥పల్లవి॥

కలికితమకముకొలఁదే ఘనమైనచెమట లివి
అలుకలకొలఁదివే అసురుసురులు
చలములకొలఁదివే సరిలేనిచింతలును
యెలమి నిందుకు నీవు యేల విసిగేవే ॥పలు॥

కోపముకొలఁదివే కొనల కనుకెంపు లవి
రాఁపులకొలఁదివే రతికాఁకలు
చూపులకొలఁదివే సొఁ(సొం?)పైన కాంక్ష X!XX లివి
కోపు లిందుకు నీవు గొణఁగుకొన నేలే ॥పలు॥

కూటములకొలఁదివే గుజ్జులైనపులక లివి
నీటులకొలఁదులే నివ్వెరగులు
చాటి శ్రీవేంకటేశ్వరుఁ గలిసితివి నేఁడు
యేఁటికిఁక పలుబుద్దు లెంచుకొననేలే ॥పలు॥ **177**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి చెలియవలె దేనికైనా ఒక కారణం వుంటుంది కదా! మాటలు పెరిగితే పంతాలూ పెరుగుతాయి. దానివల్ల ప్రయోజనమేమిటి? నీ చెలువుని యెట్లా కలియాలో చింతించరాదా? ప్రతిదానికీ వొక కారణం వుంటుంది. ఇంతా చేసి నీ విభుని కూడితివి కదా! ఇప్పుడు అతగాడి అనేక గుణములను యెంచనేటికమ్మా?!

**భావ దీపిక :**

దేవీ! స్వామివారి పలుకుల కొలదియే, నీ పంతము. కాకపోతే నీకేటికే యీపంతము? మానవమ్మా! నీ చెలువుని, కలియుమతము (చేరువయ్యే ఆలోచన) చింతించరాదా (యోచించరాదా?) నీమేనిపై యీ అధికమైన చెమటలు, ఇవన్నీ కలికి తనముకొలదే (నీ గడుసుతనాన్ని బట్టే) కారిపోతున్నాయి. నీ అసురుసులు (నిట్టూర్పులు) నీ అలుకల కొలదియే వస్తున్నాయి. సాటిలేని నీచింతకు కారణమేమో తెలియునా? అదియూ నీ చలముల (పట్టుదల) కొలదియే. ఇంతదానికోసం నీవేల విసుగుకొనుచున్నావమ్మా? దేవీ! నీ కోపాన్నిబట్టే నీ కన్నులకెంపులు (అరుణిమలు) వుంటాయి. నీలోని రాఁపులకొలదియే (సంఘర్షణనుబట్టే) రతికాఁక (మదనతాపము) కలుగుతుంది. మీ ఇరువురి చూపులనుబట్టే మీ కాంక్షలు సొంపుగా అవగతమవుతున్నాయి. ఇవి నీ కోపులు (నిలకడలేని పోకడలు). ఇంతదానికి గొణుగుకోవటం దేనికమ్మా? మీ ఇద్దరి కూటములనుబట్టే గుజ్జులైన (చిట్టిపొట్టి) పులకలు. మీ నీటుల కొలదియే (విలాసములనుబట్టే) మీ నివ్వెరగులు (భ్రాంతులు) వుంటాయి. దేవీ! నీవు బాహాటంగానే శ్రీవేంకటేశ్వరుని కూడితివి. ఇప్పుడు అతగాని బుద్ధులనెంచనేటికమ్మా?

సంఖ్య : 294 సంపుటము : 24 పుట: 197 రాగం : పాడి

**22 ఆడకేల మమ్ముఁ బిల్చీనసరే వోచెలులాల**
**వేడుకమాటలాడ వెస మీరు చాలరా** ॥పల్లవి॥

**కందువ నాపెఁ దాను కాఁగిలించుకుండఁగాను**
**చెంది సతు లెవ్వరెట్టు సేవసేసేరు**
**యిందుకు రమ్మనవే యేపనులు గలిగినా**
**అంది సేసేము సిగ్గరిఆఁడువారము** ॥ఆడ॥

**మునుపు పాన్పుపైఁ దాము ముసుగువెట్టుకుండఁగా**
**యెనసి యెవ్వరు విడెమియ్యవచ్చేరు**
**చెనకి మావద్దికిఁ జేఇ చాఁచుమనవే**
**ఘనమైనవాసివన్నెగలవారము** ॥ఆడ॥

**మేలిమలమేల్‌మంగను మెడఁగట్టుకుండఁగాను**
**కాలుదొక్కి యెవ్వరెట్టు కలసేరు**
**యేలినాఁడు శ్రీవేంకటేశుఁ డింతలోనె మమ్ము**
**వోలిఁ దాము (ను?) మన్నించఁగా నుండేటివారము** ॥ఆడ॥ **294**

**మున్నుడి :**

అన్నమయ్య తాను స్వామిప్రియురాలై స్వామి చెలికత్తెలతో ఇలా అంటున్నారు. మమ్మల్ని (అన్నమయ్యను) అక్కడికి రమ్మనటం దేనికమ్మా? ఆయనగారికి సరససల్లాపములాడవలెనంటే మీరు చాలరా? అసలే మేము సిగ్గరి ఆడవారము. ఆపె (దేవి) తాను కౌగలించుకొనివుంటే మాబోటి స్త్రీలు సేవలెట్లు చేయగలరు? కాని ఆయనంతటివాడు అంతమన్నిస్తే మేమెలా కాదనగలం? అంటున్నారు.

**భావ దీపిక :**

ఓ చెలులారా! ఆడకేల (అక్కడికెందుకు) మమ్ము బిలిచీనసరే (పిల్చెనని అడగండే). వెస (వేగంగా) వేడుకమాటలాడ (సరసోక్తులను పలుకుటకు) ఆయనకి మీరు చాలరా? (సరిపోరా?) ఆకె, తాను (ఆమె స్వామి) వారి సంకేతస్థలములో కౌగలించుకొనివుండగా సతులు యెట్లు సేవచేయగలరు? అసలే మేము సిగ్గరి ఆడువారము ఇందుకు (అందుకే) యే పనులు గలిగినా వారినే (స్వామి చెలికత్తెలనే) రమ్మనండే. మునుపు (ఇదివరకొకసారి) యేమి జరిగిందో తెలుసా? తాము (దేవి మరియు స్వామి) పడకమీద ముసుగులో దూరివుంటే, వేరెవరో ఆహ్వాన తాంబూలం ఇద్దామని వచ్చారు. మేము కూడా ఘనమైన వాసివన్నె (పేరుప్రతిష్ఠలు) కలవారమే. మమ్మల్ని చెనకి (తాకి) చేయిచాచి (బ్రతిమాలుకోమనండి). ఆయన గారు దేవిని మెడగట్టుకొని (హృదయంలో పెట్టుకొని) వుంటే, మా బోంట్లు ఆయన కాలుదొక్కి (పరిణయమాడి) యెవరైనా ఆయన నెట్లు కలిసెదరు? ఇదంతా ఇట్లా వుండగానే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్మేలినాడు. మమ్మున్ తాము (దేవి, స్వామి) మన్నించగా వారి చెంతనే వుండేటివారము.



సంఖ్య : 168 సంపుటము : 24 పుట: 113 రాగం : దేవగాంధారి

**23 ఒక్కరీతినే వుండరా నీకు**
**మొక్కేను నాతో మొఱఁగకురా** ॥పల్లవి॥

**బెళకులమాటలు పెంచకురా! నేఁ**
**దెలిసిన నటు తలదియ్యకురా**
**ములుచెనకులకే ములుగకురా**
**నలుగడ వికవిక నవ్వకురా** ॥ఒక్క॥

**బిరుదునఁ బెచ్చులు పెరుగకురా! కడు-**
**బరవగుబతి మిటు పట్టకురా**
**తిరుగులఁ బగ సాధించకురా**
**యెరవులకాంతల నేఁచకురా** ॥ఒక్క॥

**వేగమె సిగ్గులు విడువకురా**
**వాగులకలికివి భళిభళిరా**
**యీగతి శ్రీవేంకటేశ్వరుఁడా నను**
**బోగించి కూడితివి పొందాయరా** ॥ఒక్క॥ **168**

**మున్నుడి :**

అన్నమయ్య అద్భుత సృష్టి యీ కీర్తన. ఇది దశావతార ప్రశస్తి అంతర్లీనంగా వున్న శృంగార కీర్తన. బాగుగా ఆలోచిస్తేనే అర్థం అవుతుంది. "మొఱఁగకురా" అంటే వంచించకురా అని అర్థం. నాయిక స్వామితో దెప్పి పొడుపుగా ఇలా అంటున్నది. నీవు ఒక్కమాదిరిగా వుండవు. నీకు మొక్కెదనుగాని నాతో వంచన చేయకుమయ్యా! నీవు యెన్ని వేషాలు వేశావో వొకసారి వినరాదా?

**భావ దీపిక :**

స్వామీ! ఒకేమాదిరిగా వుండరాదటయ్యా? ఇన్ని వేషములేలనయ్యా? నాతో ఇంతమొఱఁగకురా (ఇంత వంచనలెందుకయ్యా!) నీకు మ్రొక్కదనయ్యా! బెళుకులమాటలు పెంచకురా (నొప్పించుమాటలను పెంచకురా) [**చలించిపోయేట్లు చెలరేగే చేప (మత్స్యావతారం)**]. నేను తెలిసికొనునట్లు తలదియ్యకురా (తలముడుచుకోకురా! [**కూర్మావతారము**]. ములకుల్లాంటి సూటిపోటి మాటలకు ములుగకురా (మూలగకురా) [**మూలిగే వరాహావతారము**]. నలుదిక్కులా వినబడేట్లు వికవిక నవ్వకురా [**నరసింహావతారము**]. బిరుదున బెచ్చులు పెరగకురా మితిమీరి పెద్దమాటలు మాట్లాడకురా [**మితిమీరి పెరిగిన త్రివిక్రముడు, వామనుడు**]. ఇటు కడు పరువుగల నీవు బ్రతిమిలాడకురా [**బ్రతిమిలాడి భూసురులకు నేలను దానము చేసిన పరశురాముడు**] తిరుగలబగ సాధించకురా (కలతనొంది నన్ను సాధించకురా) [**అడవులలో తిరిగి సీతను సాధించిన రామచంద్రుడు**]. యెరవుల కాంతల నేచకురా (అన్యస్త్రీలను బాధించకురా) [**గోపీలోలుడైన శ్రీకృష్ణావతారం**]. స్వామీ! వేగమే సిగ్గులు విడిచి అతిశయించకురా [**త్రిపురాసురుల భార్యల శీలమునపహరించిన బుద్ధుడు**]. భళిభళిరా నీవు వాగుల కలికివి (వదరుటలో నేర్పరివి). [**గుఱ్ఱము నడుపుటలో దిట్టవు (కల్కి అవతారము)**]. ఈ విధముగా నేడు శ్రీవేంకటేశ్వరుడవై నన్ను భోగించి కూడితివి. పొందాయరా దేవరా!

సంఖ్య : 198 సంపుటము : 24 పుట: 133 రాగం : నాదరామక్రియ

**28 ఏమమ్మ మగువా నీ వింతసేతువా**
**తామసించనేఁటి కిఁక దయఁజూడవమ్మా ॥పల్లవి॥**

**తగిలి తప్పకచూచు తలవంచు నంతలోనే**
**నిగిడి చింతారతి నేలదవ్వును**
**మగువ నిన్నిటువాసి మానుపడి వూరకుండు**
**ఆగడాయ నీపతి నదె చూడవమ్మా ॥ఏమ॥**

**దీనతతోఁ జిన్నఁబోవు తెగువలే తలపోయు**
**తానే యేకతానుండి తమకించును**
**మోమునఁ దెల్లఁబారు మోహించిన విరహాన**
**మానిని నీవే విచ్చేసి మరి చూడవమ్మా ॥ఏమ॥**

**కొచ్చినకాఁకలచేఁ బైకొంగువేయనెఱఁగఁడు**
**మెచ్చుగ మెట్టినచోటే మెట్టి భ్రమయు**
**అచ్చుపు శ్రీవేంకటేశు నలమేలుమంగ నీవు**
**పచ్చిసేసి కూడితివి పంతమేఁటికమ్మా ॥ఏమ॥ 198**

**మున్నుడి :**

ఈ శృంగారకీర్తనలో అన్నమయ్య దేవిని "తామసించవద్దని" నచ్చచెబుతున్నారు. "ఏమమ్మా! నీకిట్లు చేయతగునా? తామసం చూపి ప్రయోజనమేమిటి? దయను చూపించవమ్మా! విరహముతో మోహరించిన మోము యెట్లు తెల్లబడిందో నీవే చూడవమ్మా!" అని అంటున్నారు. అంతర్లీనంగా దశావతార సమన్వయం వున్నదీ కీర్తనలో. కాకపోతే తెలివిగా ఆలోచించకపోతే ఇది కేవలం ఒక శృంగార కీర్తన మాత్రమే.

**భావ దీపిక :**

ఓ మగువా! నీవింత సేతువేలనమ్మా? ఇంత తామసించనేటికి (ఇంకా ఆలస్యం దేనికి?) అతగానిపై దయ చూపించవమ్మా! తలవంచి ఆకర్షితలై ఆయనను తదేకంగా చూచి (మీనము తదేకంగా చూస్తుంది) [**మత్స్యావతారం**] అంతలో నిగడిచింతారతి (కుంగి అంతలోనే విజృంభించి) [**కూర్మావతారం**] నేలపై బొటనవేలితో గీరును [**వరాహావతారం**] ఓ మగువా! నిన్ను బాసిన నీపతి మ్రాన్పడిపోయి వూరకుండినా మండిపడి చెలరేగుతాడు [**నరసింహావతారం**] అతివా! అంతలోనే దీనవై చిన్నబోయెదవు [**వామనావతారం**]. ఆలోచనతో తనలో తానె ఒంటరిగా తమకించును తొందరపడును [**పరశురాముడు**] మోమునదెల్లబారు (తెలవెలబోయి) విరహాన మోహించును విరహపారవశ్యమునొందును [**శ్రీరామావతారము**]. ఓ మానినీ! నీవు ఇక్కడకు వచ్చి చూడవమ్మా! కొచ్చిన కాఁకచే (గుచ్చెడి తాపముచే) పైబట్ట ధరించడు [**కృష్ణావతారము**]. త్రిపురాసురుల భార్యలనుంచి ప్రశంసలు పొంది అడుగిడిన చోట లక్ష్యము నెరవేర్చుకొనెను [**బుద్ధావతారము**]. స్వచ్ఛమైన శ్రీవేంకటేశ్వరా! నీవు అలమేలుమంగను పచ్చిచేసి కూడితివి. పంతమేటికయ్యా (పగ సాధించుటెందుకు స్వామీ?) [**కల్కిఅవతారము**]



సంఖ్య : 174 సంపుటము : 24 పుట: 117 రాగం : సామంతం

**25 చేసినదే చేఁతా చెల్లుబడిగలచోట**
**సేసకొప్పువిభుఁడ నీచిత్తమింతే ఇఁకను ॥పల్లవి॥**

**విన్నదే వినికి వివేకించినచోట**
**కన్నదే కానుపు మరి గలయుచోట**
**వున్నదే వునికి వోపికెగలుగుచోట**
**చెన్నగువిభుఁడ నీచిత్తమింతే యిఁకను ॥చేసి॥**

**ఆడినదే మాట ఆయమెఱిఁగినచోట**
**కూడినదే కూటమి చేకొనుచోటను**
**వేడుకలే వేఁలువీడుదోడాడేచోట**
**జేడుమోహపువిభుఁడ చిత్తమింతే యిఁకను ॥చేసి॥**

**యెంచినదే యేలిక (యెన్నిక?) ఏవి యెగ్గుతప్పులేనిచోట**
**నించినదే మోహము నీనాచోట**
**యెంచఁగల శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి**
**చెంచెత నింతే నీచిత్త మింతే యిఁకను ॥చేసి॥ 174**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామిని వలచిన చెంచెత. కాని ఆమె జ్ఞానం సాటిలేనది. శ్రీవేంకటేశ్వరునుద్దేశించి ఆమె ఇలా అంటున్నది. సేసకొప్పువిభుడా! నీవేమి చేసినా చెల్లేచోట నీచేసినదే చేఁత. అంతా తెలిసినట్లు వున్నా సేసకొప్పు అంటే యేమిటి? ఇలా అనేకమైన తెలుగుమాటలు మనకు తెలియవు. నీవూ నేనూ వున్నచోట నిండుగా యేభావన వుంటుందో దాన్నేమోహము అంటారు. ఇన్ని స్వామికి చెప్పిన చెంచెత కీర్తనాలకించండి.

**భావ దీపిక :**

స్వామీ! చెల్లుబాటైనచోట నీవు చేసినదే చేఁత (కార్యము) కదా! ఓ సేసకొప్పు విభుడా! (చుట్టుకొనిన సిగకొప్పుగల మగడా!) ఇకపై అంతా నీ ఇష్టమేనయ్యా! వివేకము పరిఢవిల్లేచోట విన్నదాంట్లో నిజము తెలుస్తుంది. అదే నిజమైన "వినికి" (వేదము). మరి ప్రేయసీ ప్రియులు కలిసేచోటు చూడగలిగినదంతా కానుపు (దృశ్యమే). ఓపికవున్నచోట వున్న దేవునికి (స్థానము) చెన్నగు (అందమైన) విభుడా! ఇకపై అంతా నీ ఇష్టం. మర్మమెరిగినవారి యెదుట మాట్లాడినదే అర్థవంతమైన మాట. చేకొనుచోట (ప్రియుడు ప్రేయసిని స్వీకరించినచోట) కూడినదే కూటమి. వినోదాలు విజృంభించిన చోట వేడుకలే వినోదాలు. జేడు మోహము (చెలరేగే కామవాంఛ) గల ప్రియుడా! ఇకపై నీ ఇష్టం. ఏ ఎగ్గుతప్పులు (ద్రోహములూ తప్పులూ) లేనిచోట మనము యెంచుకొన్నదే యెన్నిక. నీవు నేనూ కలిసివున్నచోట, నించిన (నిండిన) భావనలన్నీ మోహములే. నీవారెవరో యెంచగల శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడి ధన్యురాలిని చేశావు. నేనెంత నా బ్రతుకెంత? నేను చెంచుదానిని అంతే. నీ చిత్తము నాప్రాప్తము.

సంఖ్య : 171 సంపుటము : 24 పుట: 115 రాగం : సామంతం

**26** నయగారిసటకాఁడ నారసింహా నీ-
ప్రియమెల్లాఁ గంటి వింటి పెనునారసింహా ॥పల్లవి॥

వేరేమారురూపై వెలనే వింతిమాటున
చేరి యేమిసేసితివో శ్రీనారసింహా
సారె నోరు దెరచేవు సతితమ్ములము నీకుఁ
గారమై తోఁచెనోకాక గననారసింహా ॥నయ॥

తీగెనవ్వు నవ్వేవు తెరవ నీమర్మమెత్తి
చేగదేర నేమనెనో శ్రీనారసింహా
వేగమే చెమరించేవు వెలఁదిదగ్గరనుండి
యేగతిఁ గళలంటెనో యిటు నారసింహా ॥నయ॥

అంతలోనే బుసకొట్టే వంగనకాఁగిట నీవు
చెంత నెట్టు గూడితివో శ్రీనారసింహా
దొంతిగా శ్రీవేంకటాద్రిఁ దొడ నిఁ(నిం?)తిఁ బెట్టుకొంటి
పంతమిచ్చితి అవుభళనారసింహా ॥నయ॥ **171**

**మున్నుడి :**

అహోబలనారసింహునిపై అన్నమయ్య వినిపించిన శృంగార కీర్తననాలకించండి. ఈ అవుభళనారసింహుడే శ్రీవేంకటాద్రిమీదనున్న వేంకటరమణుడు అంటున్నారు. ఈ పెద్ద నారసింహుడు నయగారి సటకాడట. నీ ప్రేమవ్యవహారం మాకు తెలుసులే అంటున్నారు. ఈయన శ్రీలక్ష్మి కౌగిటకూడా బుసకొడుతున్నాడట.

**భావ దీపిక :**

ఓ అహోబలనారసింహా! నీవు నయగారి (మృదువుగా మాటలాడు) సటకాడవు (మాయగాడవు). నీ ప్రేమను చూచినాము. నీ కథలన్నీ విన్నాము. నీ ఇంతిమాటను (భార్యకోరికపై) వేరే మారురూపముతో (నరహరివలె) ఆమెకు కనుపిస్తావు. ఆమెకు చేరువయై యేమి చేసితివోగాని నీవు నోరు తెరచినప్పుడల్లా యెట్టని తాంబూలము నీకు ప్రియమైనట్లు అనిపించుచున్నదయ్యా! నారసింహా! ఆ తెరవ (ఇంతి) నీమర్మము (నారసింహుడైన వైనం) తెలియుటచే, చేగదేర (చేవ కలుగుటకు) యేమనెనోకాని, నీవు తీగనవ్వు (తీగవలె కొనసాగే నవ్వు) నవ్వేవయ్యా! శ్రీలక్ష్మి నీదగ్గర వుండగా నీవు శీఘ్రమే చెమరించేవు. ఆమె నీతో యేగతి కళలంటెనో కదా! నారసింహా! స్వామీ! అంతలోనే ఆ అంగన శ్రీలక్ష్మి కౌగిట బుసకొట్టేవు (వగర్చుచుంటివి). ఆమె చెంత యెట్లు కూడితివో కదా! దొంతిగా (జమళిగా) శ్రీవేంకటాద్రి శిఖరముపై ఇంతిని యెదలో పెట్టుకొనివున్నావు. పంతముగా వరములిస్తున్నావయ్యా అవుభళ నారసింహా!



సంఖ్య : 101 సంపుటము : 24 పుట: 68 రాగం : గుండక్రియ

**27** ఓడలు బండ్లవచ్చు నొక్కవేళ దానికేమి
కూడినమీఁదటఁగాని కూరిమి లేదు ॥పల్లవి॥

నీవు విచ్చేసినదాఁకా నెలఁత ప్రియము చెప్పె
సేవలు నీవాకె కిఁకఁ జేయవలసె
తావులఁ దగులయినదాఁకానేపో యెవ్వరికి
యేవలఁ జొరక లోఁతెఱఁగరాదు ॥ఓడ॥

అంకెకు నచ్చినదాఁకా నాడినట్టె యాడెఁ జెలి
ఇంక నీవాకెకుఁ బంతమియ్యవలసె
పొంకము లట్లనేపో భూమిమీఁద నెవ్వరికి
లంకెలఁ బెనఁగ కిట్టె లావెరఁగరాదు ॥ఓడ॥

ఇప్పు డింతవడి నిన్ను నింతి రతులఁ జొక్కించె
పిప్పిగా నాకెమెఱ మఱపించవలనె
యెప్పుడు శ్రీవేంకటేశ ఇంతికి నీకిదియేపో
ముప్పిరిమాటలఁగాని ముచ్చట వోదు ॥ఓడ॥ **101**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో స్త్రీపురుషుల ప్రణయం అనిశ్చితమైనది. భగవదేచ్ఛతోనే బంధాలు కలుగుతాయి విడిపోతాయి. ఓడలు బండ్లవటం యెంతలో జరుగుతుంది? ప్రేయసీప్రియుల కూరిమి నమ్మకంతో బలపడుతుంది, అనుమానంతో సడలిపోతుంది. అన్నట్లు నమ్మకం కూడిన మీదటగాని స్థిరపడదు. స్వామీ! నీకు దేవికి కుదిరిన ముచ్చటైనది బంధం. ముబ్బడి మాటలతో కాని ఆ ముచ్చట తీరదు అంటున్నారు. ఈ కీర్తన స్వామి చెలికత్తె (అన్నమయ్య) చెబుతున్నది.

**భావ దీపిక :**

స్వామీ! దానికేముందయ్యా? ఓడలు బండ్లవటం సర్వసామాన్యమే కదా! మీరిరువురూ ప్రేయసీ ప్రియులు. మీరు కూడిన మీదగాని కూరిమి (అనురాగం) స్థిరపడదు. ప్రభూ! లోపలికి దిగినదాకా చెఱువులోతు తెలియదు కదా! నీవు విచ్చేసినదాకా యీ చెలియ (దేవి) నాతో యెన్నో ప్రియములజెప్పినది. ఇప్పుడు నీవామెకు సేవలు జేయవలసెను. ఓడలు బండ్లవటమంటే ఇదే కదా! తగులయేదాకా (వ్యామోహం కలిగాక) ఇదియెవ్వరికైనా తప్పదు. స్వామీ! చేరువయై పెనగితేగాని అవతలివారి లావు (బలము) తెలియదు కదా! ఆ చెలి నీ అంకెకు వచ్చేదాకా (వశమయ్యేవరకు) ఆడినట్లే ఆడేవు (చెప్పినట్లు చేసేవు). ఇప్పుడు పంతమిచ్చి (పట్టుదల వహించి) ప్రయోజనమేమి? పొంకము (పొందిక) కొలదియే యీభూమిపై బంధాలు స్థిరపడతాయి. నీవా లేక నీ చెలియా? యెవరు బలవంతులో యెవరు చెప్పగలరు? ఇప్పుడింతవరకు ఆ ఇంతి నిన్ను రతులలో జొక్కించినది. పిప్పిగా (చిత్తుచిత్తుగా) ఆమె స్వామిని మైమరపింపజేసినది. ఓ శ్రీవేంకటేశ్వరా! యెప్పుడూ నీకు నీ యింతికి ఇదియేపో!! నీకూ దేవికి కుదరిన బంధము ముచ్చటైనది. ముబ్బడిమాటలతోకాని ఆ ముచ్చట తీరదు.

సంఖ్య : 195 సంపుటము : 24 పుట: 131 రాగం : ముఖారి

**32 చక్కనిమానిని నీసరి యెవ్వరే**
**యెక్కువైననీభావ మెంచిచూడవసమా** ॥పల్లవి॥

**కోమలి నీకుచములకొండలకొనలపొంత**
**వోముచు మించి నిలిచె నొకసింహము**
**కాముఁడు జఘనమనేకట్టు బండిమీఁదఁ బెట్టి**
**దీమముతో వేటలాడీఁ దేరిచూడవసమా** ॥చక్క॥

**పదఁతి లేఁజిగురులపాదపుటడవిలోన**
**నడపుల యేనుగలు నటిఇంచఁగా**
**తొడలరటికంబాలతోఁ గట్టి దీములుగా**
**బడిబడి వేటలాడీ భావించవసమా** ॥చక్క॥

**అంగనముఖమనేటిఅంబుజాకరముపొంత**
**ముంగిటఁజూపులలేళ్లు మోహరించఁగా**
**కఁ(కం?)గని శ్రీవేంకటేశకాఁగిటిభావానఁ గట్టి**
**చెంగటనే వేటలాడీఁ జిత్తగించవసమా** ॥చక్క॥ **195**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో దేవి అంగాంగ శోభ చెప్పనలవికానిదని, అందంలో ఆమె సరియెవ్వరూ లేరని నిర్ద్వంద్వంగా చెబుతున్నారు. ఈ శృంగారకీర్తనతో వచ్చిన చిక్కేమిటంటే పైకి కనుపించేది శృంగార భావము. కానీ అంతర్లీనంగా అన్నమయ్య భావము అధ్యాత్మికమే. ఆ రెండిటినీ సమన్వయం చేసి పండిత మనోరంజకంగా వివరించాలంటే ఉన్నపళంగా ఎవరెస్టు శిఖరం యెక్కడంలాంటిది. అది నాబోటి సామాన్యుడి వల్ల అయ్యే పనికాదు. అందుకని నేను 'భావదీపిక'తోనే స్వామిని ఆశ్రయిస్తున్నాను.

**భావ దీపిక :**

చక్కనిదానివైన వోభామినీ! నీసాటి యెవరమ్మా? శ్రేష్ఠమైన నీ భావమెంచి చూడగా (మనోగతము దెలియగ) మావసమా (మాకు సాధ్యమా?) ఓ కోమలీ! నీ కుచగిరి శిఖరములందు, మించి ఓముచు (కాచుకొని) ఒక సింహము పొంచివున్నది. కాముడు (మన్మథుడు) నీ జఘనములనే రథములపై వేటాడబోవ నిశ్చయించి, దీమముతో (వేట యెరతో) వేటలాడుచున్నాడు. వాని తేరిపార జూడ స్వామికి దక్క అన్యుల వసమా (సాధ్యమా?) ఓ పడతీ! లేత చిగురులవంటి నీపాదములనే అరణ్యములో గజగామినవైన నీవు నడయాడగా నీ వూరువులనే అరటి కంభములు గట్టిన రథముపై వడివడిగా వేటలాడబోయినాడా మదనుడు. దీనిని భావించ నీస్వామికి దక్క అన్యుల వసమా (సాధ్యమా?) ఓ అంగనా! నీ వదనమనే పద్మాకరములో ముంగిటజూపులలేళ్ళు (ముందు చూపు మాత్రమే వున్న జింకలు) మోహరించగా (అనగా లేడిచూపులున్న దేవిని జూచి), కంగని (జంకని) శ్రీవేంకటేశ్వరుని తన భావనా కౌగిటిలో ఆలేళ్ళను కట్టివేసి ఆమె సముఖముననే వేటలాడబోయెను. దానిని చిత్తగించ నాస్వామికి దక్క అన్యులకు సాధ్యమా?



సంఖ్య : 197 సంపుటము : 24 పుట: 132 రాగం : నాగగాంధారి

**29 విపరీతము లివి వినరాదు**
**వుపమలెల్ల మీవొద్దనె కలిగె** ॥పల్లవి॥

**వువిదవదనచంద్రోదయవేళను**
**రవియగుసూర్యప్రభ నీవేఁగఁగ**
**యివల నవల మీయిద్దరివలననే**
**దివమును రాతిరి దెలియఁగఁ గలిగె** ॥విప॥

**అంగనతురుము మహర్ని (హాని?) శివేళను**
**రంగగు సూర్యప్రభ నీవేఁగఁగ**
**సంగడి వెలుఁగును సరిఁ జీఁకటియును**
**చెంగట మీయందే చెప్పఁగఁ గలిగె** ॥విప॥

**కాంతమోవి చుక్కల(లు?) నిండువేళ**
**రంతుల సూర్యప్రభ నీవేఁగఁగ**
**యింతట శ్రీవేంకటేశ్వర మీయందే**
**కాంతులుఁ గళలునుఁ గలయుట గలిగె** ॥విప॥ **197**

**మున్నుడి :**

అన్నమయ్య వొకానొక, సూర్యప్రభ వాహన వేడుకను వర్ణిస్తున్నారు. సూర్యచంద్రులిద్దరూ యేకకాలమున కాంతులు విరజిమ్మటం విపరీతం కాకపోతే మరేమిటి? మరి ఈనాడు అదే జరుగుతున్నది. అంగన కేశపాశమనే మహానిశివేళలో కాంతులీనే సూర్యప్రభ వాహనమెలా వుందంటే చీకటి వెలుగులు మీముందే వున్నాయని చెప్పవచ్చును అంటున్నారు. "ఉపమా కాళిదాసస్య" అన్నవారు అన్నమయ్య కీర్తనలను వినివుండరు.

**భావ దీపిక :**

సూర్యప్రభ వాహనంపై వేంకటరమణుడు వూరేగుతుంటే, అలివేణి అలమేలుమంగ ఆయన సరసన వుంటే, ఈ విపరీతమునేమని వర్ణించను? ఉపమాలంకారమంతా మీ ఇద్దరిలోనే వున్నదా అనిపిస్తున్నది. ఆ వువిద (తరుణి) వదనచంద్రుడు కాంతులీనువేళ "రవిబింబం" వంటి నీ సూర్యప్రభలో నీవు వెళుతుంటే మీ ఇద్దరివలన ఇవల (ఈ భూమిమీద) అవల (ఆకాశంలోను) మీ ఇద్దరి వలననే రేయింబవళ్ళు కలుగుతున్నాయా అనిపిస్తున్నది. ఆ అంగన తురుము అనే మహానిశివేళ, శోభలీను సూర్యప్రభపై నీవు పోతుంటే చీకటివెలుగుల సంగడి (సంగమము) ఎదురుగా మీయందే చెప్పవచ్చునేమో అన్నట్లున్నది. ఆకాంత మోవిపై (అధరముపై) చుక్కలు నిండిపోయి (దంతక్షతముల నిండినదై) సూర్యప్రభలో రంతుల (విలాసంగా) నీవేగగా ఆ శోభనేమని వర్ణించను? ఓ శ్రీవేంకటేశ్వరా! సృష్టిలోని కాంతులు కళలు మీయందే కలిగినవా అనిపిస్తున్నది స్వామీ!

సంఖ్య : 104 సంపుటము : 24 పుట: 70 రాగం : గుండక్రియ

**30** అప్పటి నీచెలు వంతయును
కుప్పలుఁదెప్పలు కోరికలాయ ॥పల్లవి॥

పాయలేక ననుఁ బలుమరుఁజూచే
సోయగంపునీచూపు లివి
సేయనిములుకులచిలుకుల మదనున-
సాయకకోట్లచందములాయ ॥అప్ప॥

అడుగిడఁజాలక ఆడినమాటలె
బడిబడిఁ బలికేపలుకు లివి
జడిగొనుముత్యపుసరులై విరులై
విడువనివెన్నెలవేఁడిము లాయ ॥అప్ప॥

ముచ్చట వాయక మోహదాహమున-
నిచ్చేటిమోవులయీవు లివి
విచ్చనవిడి శ్రీవేంకటేశ నీ-
తచ్చనకూటపుతలపోఁతలాయ ॥అప్ప॥ **104**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో నాయిక స్వామితో తన మదన తాపాన్ని వివరిస్తున్నది. స్వామీ! నేను నిన్ను చూచిన క్షణంనుంచే నీ అందమంతా కుప్పలుతెప్పలుగా నాలో కోరికల్ని పెంచింది. నాముచ్చట దీరక నామోహదాహమును దీర్చేటివి నీమోవుల యీవులు మాత్రమే అంటున్నది దేవి. ఇక్కడే వివరాలేల? స్వామితో తన ప్రధమ సమాగమమును గుర్తుచేస్తున్నది అన్నమయ్య భావనా శృంగార నాయిక.

**భావ దీపిక :**

స్వామీ! అప్పటి నీ చెలువంతయు (అందమంతా) చూడగ నాకోరికలన్నీ కుప్పలుతెప్పలాయెను (అసంఖ్యాకములైనవి). నీవునన్ను పాయలేక (విడువలేక) అనేకమార్లు తిరిగి తిరిగి చూచేవు. నీ సోయగంపు చూపులు మరువలేను. నీ ములుకులవంటి చిలుకగాట్లు, మదనుని బాణములు కోట్ల సంఖ్యలో తగిలినట్లయినవి. అడుగుతీసి అడుగు వేయలేని నేను మాట్లాడిన మాటలనే మరలమరల పలికే పలుకులని అనిపిస్తున్నది. జడిగొను (అతిశయించిన) ముత్యాలసరాలు పూవులవలెవున్నవి. విడువని వెన్నెలవేడిని చిమ్ముతున్నది. ముచ్చట తీరక మోహదాహముపశమించుటకు ఇచ్చేటి అధరామృత ఝురులవి. విచ్చలవిడితనము అతిశయించిన శ్రీవేంకటేశ్వరా! నాతలపోతలన్నీ (ఆలోచనలన్నీ) నీ తచ్చనకూటముల గురించే (నీ కపటపు కూటముల గురించే).



సంఖ్య : 103 సంపుటము : 24 పుట: 70 రాగం : లలిత

**31** కోరి బిడ్డఁడంటాఁ గంటి గోవిందుని
సారెసారె దూరనేల చందమాయనే ॥పల్లవి॥

వెల్లిమడుగు లీఁదఁబోవు వెడఁగుకొండ లెత్తఁబోవు
చల్లరీఁడు మా(మాఁ?) కులందు సురిగి తిరుగునే
వల్లెతాట రోలఁగట్టువరచినను పరచినను
యెల్లనాఁడు మానఁడింక నేమిసేతువే ॥కోరి॥

వేఁడుకొనఁ బెచ్చుపెరుగు వెరవఁడింత తల్లికైన
వాఁడియడవిఁ దిరుగు బండివాలఁదన్నెనే
పోఁడిమలర నెంత నేము బుద్ధిచెప్పినాను వినఁడు
వీఁడేఁటిబాలుఁడమ్మ వింత చూడరే ॥కోరి॥

చెలులనెల్ల బంగపెట్టి చేఁతలందె కలికియాయ
పులుమీఁద నెక్కి తోలి పుడమి వెలసెను
మెలఁగి శ్రీవేంకటాద్రిమీఁద నిలిచె నింతలోనె
యెలమి నతఁడుచేయిచేఁతలెల్లఁ గంటిరే ॥కోరి॥ **103**

**మున్నుడి :**

ఇది అన్నమయ్య చెప్పిన దశావతార కీర్తన. శ్రీకృష్ణునిపరంగా వివరిస్తే శృంగారకీర్తనే. కాని గూఢంగా విశ్లేషిస్తే ఇందులో అంతర్లీనంగా దశావతార వర్ణన దాగివున్నది. జాగ్రత్తగా గమనించండి. యశోదాదేవి వాపోతున్న వైనం చిత్తగించండి. ఆ తల్లి ఇలా అంటున్నది. చెలులారా! నేను కోరి యీ బిడ్డను కన్నానమ్మా! ఈ గోవిందుని మాటిమాటికీ నిందిస్తారెందుకమ్మా? వీడెంత మంచివాడో అంత మొండివాడు. ఇదేం చూశారు, వేంకటాద్రిమీద వెలసిన అతడు చేసిన చేతలు చూశారా? అంటున్నది.

**భావ దీపిక :**

చెలులారా! నేను కోరి ఈ గోవిందుని నా బిడ్డడని కన్నానమ్మా! నా వరాలమూట వీడు. సారెసారె (ప్రతిసారి) మీరు వీడిని దూరనేల (నిందించుటెందుకు). చందమాయనే? (ఇదే మీ పనిలా వున్నదే?) వెల్లిమడుగులీదబోవు (ప్రవాహాల్లో ఈదుతాడు) (మత్స్యావతారము) వెడగుకొండలెత్తబోవు (జడత్వంగల కొండలెత్తబోవు (కూర్మావతారం) చల్లరీడుమాకులందు సురిగితిరుగు (చెట్లలో పిచ్చిగా తిరిగే వరాహము) వల్లెతాటితో రోటికి కట్టేశాను. ఎల్లనాఁడు మానడు (పొరబాట్లను వదలడు) (వరాలన్నిటినీ తప్పుచూపి హిరణ్యకశిపుని చంపిన నరసింహావతారం). వేడుకొన్నకొద్దీ పెచ్చుపెరుగు (మితిమీరుతాడు) (త్రివిక్రముడైన వామనుడు). తల్లికైతే ఇంతకూడా వెరవడు (పరశురామావతారము). వాడియడవుల దిరుగు (అడవులలో సీతాన్వేషణ చేసిన రామచంద్రుడు). బండిపడిపోయేట్లు తన్నెనే (శకటాసురుని చంపిన శ్రీకృష్ణుడు). నేనేం చేయనమ్మా? యెంత బుద్ధి చెప్పినా వినడు. నాకూ వింతగానే వున్నది. వీడెటువంటి పిల్లవాడమ్మా!! చెలులనెల్లా భంగపెట్టి (త్రిపురాసురుల భార్యలను భంగపరచిన బుద్ధుడు), చేతలందె కలికి ఆయె (అందమంతా చేతల్లోనే వున్నది) (దుష్టశిక్షణ చేసిన కల్కి అవతారం), గరుత్మంతునిపై తిరిగేవాడు భూమిమీద వెలిశాడే, శ్రీవేంకటాద్రిమీద నిలిచినవీడే కదా! అతడు చేసిన చేతలన్నీ కంటిమే.

సంఖ్య : 170 సంపుటము : 24 పుట: 114 రాగం : నాదరామక్రియ

**36** ఇంతిసింగారము నేఁడు యెట్టున్నది
కంతునిదీమము రూపై కలిగినట్లాయ ||పల్లవి||

నివ్వటిల్లుతురుములో నెలఁతముడిచినట్టి-
యివ్వలఁ గమ్మవిరు లెట్టున్నవి
పువ్వుఁదేనె లంటిరాఁగా పువ్వులెల్ల తుమ్మిదల
అవ్వల వెంటనే వచ్చి అనినట్లాయ ||ఇంతి||

కందువకుచములపై కామిని పూసినయట్టి-
యిందులో గందపుబూత లెట్టున్నవి
చందురుని వెన్నెలలు జక్కవలు సారె దాఁగ
అందుకే వెన్నెలలెల్ల ఆనినయట్లాయ ||ఇంతి||

శ్రీవేంకటేశ్వరుఁడు చెలిఁగూడేరతివేళ
యీవల మోవిగుఱుతు లెట్లున్నవి
దేవుఁ డితనికిమీఁదెత్తినయమృతముకోవి
వేవేలుముద్రలు పయివేసినయట్లాయ ||ఇంతి|| **170**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో దేవి సోయగము యెట్లున్నదో వివరిస్తున్నారు. పడకగదిలోకి పోబోతున్న దేవిని వర్ణించిన చెలియలు ఆఖరికి స్వామిని కూడిన తమ నెచ్చెలి యెట్లావున్నదో వివరించడంతో గాని ఆపలేదు. అతిశయోక్తి అలంకారాన్ని యెంతబాగా వాడుకున్నారో అన్నమయ్య గమనించండి. ఆమె సింగారము కంతుని దీమము రూపైనట్లున్నదట. వివరణ చదవకపోతే అంతా అయోమయమే. స్వామిని తలచుకొని ముందుకు సాగండి.

**భావ దీపిక :**

చెలులారా! నేడు యీ ఇంతి సింగారము యెట్లున్నదో చెప్పండే. కంతుని (మన్మథుని) దీమము (గృహము) వలెనున్నది. ఈ నెలత నివ్వటిల్లుతురుమున (విస్తరించిన కొప్పులో) ముడిచిన కమ్మటి విరులు యెట్లున్నవి? పూదేనియలు గ్రోలివచ్చి తుమ్మెదలు వేర్వేరు పూలపై వ్రాలగా ఆ నల్లని తుమ్మెదలన్నీ పూలకు అంటుకుపోయినట్లున్నది. ఈ కామిని పొంకమైన కుచములపై పూసిన గంధపుపూతలెట్లున్నవే? జక్కువలు (గుండ్రటి చక్రవాకములు) చంద్రునివెన్నెలద్రాగబోయినప్పుడు తెల్లని వెన్నెలగామారి ఆమె యెదను పట్టుకొనినట్లున్నది. శ్రీవేంకటేశ్వరుడు చెలినిగూడువేళ సురతమున మన దేవియిచ్చిన మోవిపైని దంతక్షతములెట్లున్నవో తెలియునటే? ఈ దేవుడు అమృతమును త్రాగునప్పుడు ఆ పాత్ర అంచులు వేసిన అనేక ముద్రలా అన్నట్లు తీపిగాను నొచ్చునట్లుగాను వున్నవి.

గమనిక : ఇది నా స్ఫురణ మాత్రమే అని నా మనవి.



సంఖ్య : 169 సంపుటము : 24 పుట: 113 రాగం : సాళంగం

**33** చాలుఁజాలు నిన్నింత జరయనేల
నీలాగులెల్లఁ గంటిమి నీవు నీవేకావా ||పల్లవి||

వంకదిద్ద వసమా వాఁటపుయేరులకెల్ల
అంకెల నీగుణములు అట్టివెకావా
లంకెఁబెట్టవశమా లావున మేఘములను
ఇంకనేల నీమనసు ఇట్టిదేకాదా ||చాలుఁ||

కట్టిపెట్టవశమా గాలి ముడియగాఁగ
వొట్టిననీమోహమును నట్టిదేకాదా
కట్టుకొనవశమా కానరానిపట్టుచీర
వట్టినీవినయములు వలసినవేకావా ||చాలుఁ||

లెక్కపెట్టవశమా లీలతోడఁ జుక్కలెల్ల
యిక్కడ నారతు లిట్టివేకావా
గక్కున శ్రీవేంకటేశ కలసితి విట్టె నన్ను
చక్కనిసరస మిఁక సమ్మతేకాదా ||చాలుఁ|| **169**

**మున్నుడి :**

“జరయుట” అంటేనిందించటం. అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో స్వామి ప్రియురాలై యెలా దెప్పుతున్నారో చూడండి. చాల్లేవయ్యా! నిన్నెంత నిందించినా లాభమేముంది? నీ ప్రేమలూ, మమతలూ చూస్తూనేవున్నాము కదా! ఉపమాలంకారాలతో అన్నమయ్య చెప్పే ఉదాహరణలు పండితుల్ని అబ్బురపరుస్తాయి, పామరుల్ని మురిపిస్తాయి. ఆకాశంలో చుక్కల్ని లెక్కపెట్టగలమా? ఇక్కడ నా రతులు (మన్మథ తాపములు) అట్టివే కావా? అంటున్నారు. ఇదండీ “శృంగారం” అంటే.

**భావ దీపిక :**

ఓ ప్రియా! చాలుజాలులేవయ్యా! నిన్నింత (నిన్నింకా) జరయనేల నిందించుటెందుకు? నీలాగులు (ప్రేమలు) చూస్తూనేవున్నాము. నీవు నీవేకావా? నీవు మారిపోయే అవకాశమే లేదు. ధారాళముగా పారే యేరు వంకరలు తిరిగి పారుతుంటే ఆ వంకరలు దిద్దటం యెవరివల్ల అవుతుంది? అంకెల (అధీనములో లేని) నీ గుణములట్టివే కాదా? లావున (బలిమితో) మేఘములను అధీనంలో వుంచగలమా? ఇంకా యెందుకయ్యా నీ మనసు కూడా ఇట్టిదే కదా! గాలిని ముడివేసి కట్టివేయవచ్చునా? ఒట్టిన (హత్తుకొనిన) నీమోహము అట్టిదేకదా! కంటికి కానరాని పట్టుచీరను కట్టుకోగలమా? నీ వుత్తుత్తి వినయాలు అవసరమా? లీలతో (ఆటలాగ) చుక్కల్ని (నక్షత్రాలను) లెక్కపెట్టవచ్చునా? ఇక్కడ నీరతులు (మన్మథలీలలు) అట్టివేకదా! ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను వెంటనే సులువుగా కలిసితివి. ఇక చక్కని సరసము సమ్మతికాకయేమవుతుంది?

సంఖ్య : 172 సంపుటము : 24 పుట: 115 రాగం : బౌళిరామక్రియ

**34 అట్టెకాదా మరి అవునయ్యా నీ-**
**పుట్టుగెల్ల నిట్టె పోపోవయ్యా** ॥పల్లవి॥

**వుద్దండాన నీవే వొగిఁ గాలుదొక్కి**
**గద్దించేవు నీవే కానీవయ్యా**
**అద్దలించఁగానే ఆయము లంటేవు**
**పొద్దువోదో నీకు పోపోవయ్యా** ॥అట్టె॥

**దాకొని నీకొంగు దాఁకించి నీవే**
**మేకొని తిట్టేవు మేలయ్యా**
**వూఁకొనకుండిన వొత్తిమాఁటాడేవు**
**బూకలింతేశేల పోపోవయ్యా** ॥అట్టె॥

**కందువల నీవే కౌఁగిలించిపట్టి**
**యిందులోనే జంకించే వేమయ్యా**
**చిందేటినవ్వుల శ్రీవేంకటేశుఁడ**
**పొందితివి నన్నుఁ బోపోవయ్యా** ॥అట్టె॥ **172**

**మున్నుడి :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగారకీర్తనలో నాయిక స్వామితో యేమంటున్నదో వినండి. అవునయ్యా! నీ జన్మంతా ఇంతే పోపోవయ్యా! మరి అంతే కదా! నీవు నన్ను పెళ్ళాడిన దగ్గర్నుంచీ నీ ఆగడాలకంతేలేదు. నన్ను కాసేపు కౌగలించుకొంటావు, అంతలోనే బెదిరిస్తావు. నీ చిందేటి నవ్వులతోనే పొందితివి కదా! పోపోవయ్యా!

**భావ దీపిక :**

స్వామీ! అవునయ్యా! నీ పుట్టుకెల్లా (జన్మంతా) మరి అట్టేకాదా! (అంతేకదా!) పోపోవయ్యా! నీవే ఆనాడు వుద్దండాల (సాహసంతో) నా కాలుదొక్కినావు (పెండ్లాడినావు). నీవే నేడు నన్ను గద్దించుచున్నావు. ఇదేమయ్యా నేను అద్దలించగానే (బెదరించగానే) నా సిగ్గులనంటేవు. నీకేమీ పొద్దుపోదాయేమి? పోపోవయ్యా! ఎక్కడో దాకొని (దాగికొని) నీవేనీకొంగు నాకుతాకించి, మేకొని తిట్టేవు (బాధ కలిగేట్లు నిందించేవు) ఇదేమయ్యా? బాగుందా? పోనీలే గొడవెందుకని నేను అనుకోక వూరకొనకుంటే యెదిరించి మాట్లాడతావు. ఇంత బూకలేలయ్యా (మాయలెందుకయ్యా?) పోపోవయ్యా! నాతోయేమిటి? మళ్ళీ నీవే కందువల (మన సంకేతస్థలములలో) పట్టి కౌగలించుకొంటావు. అంతలోనే జంకించెదవు (బెదిరిస్తావు). ఇదేమయ్యా? నవ్వులు చిందించే ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను పొందకుండా వదిలావా? పోపోవయ్యా!



సంఖ్య : 183 సంపుటము : 25 పుట: 123 రాగం : మాళవి

**35 నన్ను నేలినాఁ డితఁడు నరసింహుఁడు**
**అన్నిటాను జాణఁడు ప్రహ్లాదనారసింహుఁడు** ॥పల్లవి॥

**నగవులవాఁడుగదె నరసింహుఁడు**
**వెగటులేనివాఁడు వీరనరసింహుఁడు**
**నగముపైనున్న వాఁడు నరసింహుఁడు**
**అగపడె మనకుఁ బ్రహ్లాదనరసింహుఁడు** ॥నన్ను॥

**ననవిలుతునితండ్రి నరసింహుఁడు**
**కనకపుకాశ(సె?)వాఁడు గజనరసింహుఁడు**
**ననుపుపొందులు నేసేనరసింహుఁడు**
**అనిశముఁ బాయఁడు ప్రహ్లాదనరసింహుఁడు** ॥నన్ను॥

**నాతో సరసమాడీ నరసింహుఁడు నా-**
**చేతికి నుంగర మిచ్చె శ్రీనరసింహుఁడు**
**యేతుల శ్రీవేంకటాద్రి నిదే యహోబలమున**
**ఆతుమలోఁ బాయఁడు ప్రహ్లాదనరసింహుఁడు** ॥నన్ను॥ **183**

**మున్నుడి :**

అహోబలంలో వెలసిన ప్రహ్లాద నారసింహునిపై శృంగార ఛాయగల అధ్యాత్మకీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. జాణతనం అంటే నేటిభాషలో 'స్మార్ట్' అని చెప్పుకోవచ్చు. భక్తవత్సలతలోను, హిరణ్యాసురుని అతితెలివి వరాలను తెలివిగా "వమ్ము" చేయటంలోనూ, దేవతలను కరుణించడంలోనూ నరసింహునిగా శ్రీలక్ష్మిని నరహరిగా చెంచులక్ష్మిని అలరించడంలోను తనకు తానే సాటియైనవాడు "జాణడు" గాక మరేమిటి?

**భావ దీపిక :**

ఈతడే నరసింహుడు. నన్ను యేలినవాడితడే. ఈ ప్రహ్లాదనారసింహుడు అహోబలమున వెలసియున్న దేవదేవుడు. అన్నిటా జాణడు (నేర్పరి) యితడు. ఇతడు భయంకరుడు కాదు, నగవులవాడు. ఈ వీరనరసింహుడు వెగటు (ద్వేషము) లేనివాడు. నగము (కొండ)పై వెలసినవాడు. మనకనులముందు అగపడుచున్న యీతడే ప్రహ్లాద నరసింహుడు. ఈ ప్రహ్లాద నారసింహుడే నారాయణుడయినందువల్ల యీయనే ననవిలుతుడు (పుష్పధన్వుడైన) మన్మథుని తండ్రి. ఈ నృసింహుడే కనకపుకాసె (పీతాంబరము) ధరించు గజనరసింహుడు (గొప్ప నరసింహుడు). ఈయన ననుపుపొందులు (అతిశయించే కూటమి) చేసే ఘనుడు. అనశము 'ఎల్లప్పుడూ' తన భక్తులను వీడనివాడు ఈయనే. నాతో సరసములాడే చిలిపివాడు ఈయన. నాచేతికి వుంగరమిచ్చినవాడీ నృసింహుడే. అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడే అహోబలమున వెలసిన నరసింహుడు. ఈ ప్రహ్లాదనరసింహుడు జీవుల ఆత్మలో విడువక నిలిచియుంటాడు.

సంఖ్య : 96 సంపుటము : 102 పుట: 55 రాగం : దేసాళం

**40 సిగ్గువడ నేమిటికి చెలువమె యిది నీకు**
**యెగ్గు లేదు యిట్టె సింగారించుకొనవయ్యా ॥పల్లవి॥**

**కపురపుఁ బలుకుల కంటసరులు నీకు**
**యిపు డిట్టె చెలి యంపెనిందవయ్యా**
**చపలపు నీమెడ చంద్రవంకలమీఁద**
**కపురై వుండు నిట్టె కట్టుకొనవయ్యా ॥సిగ్గు॥**

**నెలకొన్నకస్తూరి నిగరపుఁ బోఁగులు**
**కలికి నీకు నంపెఁ గైకొనవయ్యా**
**యెలమిని మేదించినితరవాసనఁ గప్పె**
**పెలుచ వందురు యిట్టె పెట్టుకొనవయ్యా ॥సిగ్గు॥**

**కోవరపుఁ బచ్చికుంకుమపూవుదండ లంపె**
**శ్రీవెంకటనాథ యింతిఁ జేకొనవయ్యా**
**తోవల నీమై నంటిన తొలుతటి పస పెల్లా**
**వేవేగ నిది గప్పె వేసుకొనవయ్యా. ॥సిగ్గు॥ 96**

**మున్నుడి :**

చినతిరుమలయ్య వినిపిస్తున్న శృంగారకీర్తననాస్వాదించండి. “స్వామీ! ఇందులో సిగ్గుపడేదేముంది? నీకు యిది కూడా అందంగానే వున్నది. ఇందులో యెగ్గేమీలేదు. నీకు యెట్లానచ్చితే అట్లా సింగారించుకోవయ్యా!” అంటున్నారు. నాయిక యేమేమి పంపిందో వివరిస్తున్నారు కూడాను. ఆ కాలంలో శృంగార పురుషుల అలంకరణకు అద్దం పడుతున్నట్లున్నదీ కీర్తన.

**భావ దీపిక :**

స్వామీ! ఇది (నీవు అలంకరించుకొన్న విధానము) చెలువమే ప్రభూ! సిగ్గుపడనేమిటికి? నీకు యెగ్గు (దోషము) యేమీలేదు. ఇట్టే సింగారించుకోవయ్యా! ఇందవయ్య (ఇదిగోనయ్యా!) నీ చెలి నీకు ఇప్పుడే పంపిన, కపురపు పలుకుల (కర్పూరపు తునకల)తో చేసిన కంటసరులు (కంఠాభరణములు). నీ మెడలో కదలాడుతున్న చంద్రవంకలమీద కపురైవుండు (శోభాయమానంగా వుంటుంది). దీన్ని కట్టుకోవయ్యా! వీటిని తీసికొనుమయ్యా స్వామీ! ఆమె యెవరో కలికి నీకు నంపె (పంపించింది), ఇది నీవంటికి అతుక్కొనిన మేలైన కస్తూరి రాశులట. దీనిని వంటిపై మేదించిన (మర్దించగ) ఇతర వాసనలు గప్పినవి పెలుచు అవుతాయట (క్షీణిస్తాయట). ఇట్టే పెట్టుకోవయ్యా! ఎంత జాగ్రత్తపడుతున్నదో చూడుస్వామీ! ఓ శ్రీవేంకటేశా! నీ ఇంతి (ఇల్లాలు) కోవరపు పచ్చికుంకుమపువ్వు (అధికముగా తాజా కుంకుమపూవు) దండలు కట్టి పంపినది, తీసికొనవయ్యా! పాపం నీకు యెవరెవరిదగ్గరో నీవంటికి అంటుకొన్న పసుపును వేవేగ (చాలా వేగముగా) ఈ దండలు కనుమరుగు చేస్తాయి. వేసుకోవయ్యా శృంగారరాయా!



సంఖ్య : 194 సంపుటము : 24 పుట: 130 రాగం : వరాళి

**37 మీకు మీకే కానవచ్చు మిన్నులపై మెఱుఁగులు**
**మాకు నెట్టు దెలుసు మీమనసులమాయలు ॥పల్లవి॥**

**యేమిటికే చెలియ నీ వితఁడు యెదురెదుర**
**మోము మోము వంచితిరి ముసిముసి సిగ్గులతో**
**తామెరకుఁ దామరే ధరఁ జంద్రుఁ డాయనో మీ-**
**మోముటద్దములలోనిమొరఁగులు గంటిరో ॥మీకు॥**

**యేపనికే మగువ మీరిద్దరూను మీలోన**
**చూపుఁజూపు సరిఁదాఁకె సొలపుల చొక్కితిరి**
**యేపుఁగలువల కవె యిటు తామెరలాయనో**
**మేపుమీనములు జఁటై (జంటై?) మేఁతలు మఱచెనో ॥మీకు॥**

**యెక్కడివే వనిత మీకిద్దరికెమ్మోవులందు**
**చుక్కలుఁజుక్కలే సురవొన్నలైపూచె**
**వొక్కటై శ్రీవేంకటేశుఁ డొద్దికైనలెక్కలో**
**చక్కనిరతుల మీరు సరిబేశాడితిరో ॥మీకు॥ 194**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో ఆయన దేవి చెలికత్తెవలె తోటివారితో కలిసి దేవిని ఆటపట్టిస్తున్నారు. చక్కని ఉపమానాలతో దేవి, స్వామి చూపులకెట్లున్నారో వర్ణిస్తున్నారు. నేను స్వానుభవంతో ఒకమాట చెప్పగలను. నిఘంటువులలో లేని పదాలకు కూడానాకు అర్థం స్ఫురించి ఆకాశంలో తటిల్లతలా మాయమవుతుంది. అది స్వామి కరుణగాక వేరొకటి కాదు. “ఆ వలపు జంట కెమ్మోవులందు చుక్కలు జుక్కలై సురవొన్నలై పూచె”నట, దీని భావమేమి తిరుమలేశ!!

**భావ దీపిక :**

దేవీ! మీవలపుజంట అనుభవాలు మీకుమీకే కానవచ్చు. అవి ఆకాశంలోని తటిల్లతలవంటివి. మీ మనసులు ఏమాయలో తగులుకొన్నాయో, మాకెట్లా తెలుస్తుంది? ఓ చెలియా! యేమిటికే (యెందుకే) నీవు, ఇతడు ఎదురెదురు మొగములుగలవారై తలలు వంచుకొని ముసిముసి సిగ్గులతో... ఇదేమి వింత తామరవంటి ఆమె మోము వంగిపోయింది. తామరవంటి స్వామి మోము చంద్రుడైనదా? లేక అద్దమువంటి ఆమె మోములో చంద్రునివంటి స్వామి మోము కనిపించిందా? ఓ మగువా! యేపనికే (యెందుకే) మీరిద్దరూ ఒకరినొకరు చూచుకొంటూ కలిసిన చూపులతో సొలసి పరవశించి సరిదాకేరు (చేరువయ్యేరు?) అదెట్లావున్నదంటే కలువలు పద్మములు సయోధ్యతో చెలిమిచేయుచున్నాయా లేక బలిసిన మీనముల జంట మేతలుమాని నిశ్చేష్టులైనవా అన్నట్లున్నాయి. ఓ వనితా! యెక్కడివే? మీ ఒండారుల కెమ్మోవి (ఎఱ్ఱని పెదవులపై) ఆ చుక్కలు చుక్కలే ఎఱ్ఱని చుక్కలుండే పూలైన “సురవొన్న”లైనవి. శ్రీవేంకటేశ్వరు ఒద్దికైన లెక్కలో మీయిద్దరి చక్కని రతులతో మీరు సరిబేసులాడినారు.

గమనిక : సరిబేసులు పిల్లలాడే ఆట. అరచేతులు తిరగేస్తే సరి, మరగేస్తే బేసి.

సంఖ్య : 173 సంపుటము : 24 పుట: 116 రాగం : హిందోళవసంతం

**38 తొయ్యలి వెంగెములాడ దోసముసుమ్మీ**
**చయ్యన నీతో నింత చాలదా యేమీ** ॥పల్లవి॥

**యిద్దరిలో నీకు మోహ మిచ్చితిఁ జుమ్మీ! అవురా**
**కద్దు కద్దు నీమాఁట కల్లలా యేమీ**
**పెద్దగా నీపై నానవెట్టేఁజుమ్మీ! అంత**
**వద్దూవద్దు నీ వట్టివాఁడవా యేమీ** ॥తొయ్య॥

**ఆఱడిఁ గానుక నీకే యంపితిఁజుమ్మీ**
**మీఱి యె(యం?) తసేసేది మేలుదా యేమి**
**జాఱిననీపై వలపు చల్లితిఁజుమ్మీ! నీకుఁ**
**బాఱిపాఱి నాతోనే పంతమా యేమీ** ॥తొయ్య॥

**మించిన శ్రీవేంకటాద్రిమేఁటి నేఁ జుమ్మీ! యింత-**
**వంచనతో నాకుఁ జెప్పవలెనా యేమి**
**అంచెలఁ గూడితి నన్ను నప్పుడేసుమ్మీ! యివె**
**పొంచిపొంచి చెప్పేవు. పొద్దువోదా యేమి** ॥తొయ్య॥ **173**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో శ్రీదేవితో స్వామి సంవాదం చేస్తూ తొయ్యలి నీతో పరిహాసమాడితే అది దోసము సుమా! అన్నాడు స్వామి. చయ్యన నీతో ఇంతగొడవ చాలదా యేమి అన్నది దేవి. కీర్తన అంతా ఇలా ప్రశ్నోత్తరాలతోనే గడుస్తుంది. సాధ్యమైనంత తేలిక భాషలో వివరించడానికి ప్రయత్నిస్తాను.

**భావ దీపిక :**

**స్వామి:** తొయ్యలి! (ఓ యువతీ) నిజమే నీతో వెంగెములాడ (పరిహాసమాడుట) దోసము సుమ్మీ! (తప్పే సుమా!)
**దేవి:** చయ్యన (మాటకుమాటగా) ఇంతచాలదా యేమి?

**స్వామి:** మీ ఇద్దరిలో (శ్రీదేవి, భూదేవి) నీకు నామోహమిచ్చితిని సుమా!
**దేవి:** ఔరా! నిజమే నిజమే!! అవి అబద్ధాలా యేమి?

**స్వామి:** పెద్దగా నీపైనే నా ఆశలు పెట్టుకొన్నాను సుమా!
**దేవి:** అంతవద్దయ్యా! వద్దు! నీవేమి సామాన్యుడవా?

**స్వామి:** ఆఱడి (అపవాదు) కానుకగా నీవే ఇచ్చావు సుమా!
**దేవి:** మితిమీరి ఇంతరగడ చేసినది మేలుదా యేమయ్యా?

**స్వామి:** జాఱిన నీతో (నిమ్మళించిన నీతో) వలపు జల్లితిని సుమా!
**దేవి:** నీకు జాఱిపాఱిన (వెనకకు తగ్గిన) నాతోనే పంతమా యేమి?

**స్వామి:** అతిశయించిన శ్రీవేంకటాద్రి సర్వోన్నతుడను నేనేసుమా!
**దేవి:** ఇంత వంచనతో నాకు ఇప్పుడామాట చెప్పవలెనా యేమి?

**స్వామి:** అప్పుడే (అంతలోనే) నన్ను అంచెల (క్రమముగా) కూడినావు సుమా!
**దేవి:** ఇవె (ఈ మాటలే) పొంచి పొంచి (దాచి దాచి) చెబుతున్నావు నీకేమి పొద్దు పోదాయేమి?



సంఖ్య : 167 సంపుటము : 24 పుట: 112 రాగం : కొండమలహరి

**39 తరవాతిపనులెల్లాఁ దానే యెఱుఁగు**
**సిరులవిభుని కిట్టె చెప్పరే చెలులు** ॥పల్లవి॥

**మనసులోపలిచింత మాఁటలకు గుఱిగాదు**
**తనివోనితమకాలే తామే యెఱుఁగు**
**తనువులోపలికాఁక తచ్చిచూప గుఱిగాదు**
**మునుపువెనకల నామోహమే యెఱుఁగు** ॥తర॥

**కన్నులచూపులయాస గట్టిసేయ గురిగాదు**
**కన్నెలాల నాకోరికలే యెఱుఁగు**
**పన్నినజవ్వన మిది పట్టిచూప గురిగాదు**
**వెన్నెలవంటినానివ్వెరగే యెఱుఁగు** ॥తర॥

**వాడిన నామోవితేనె వారవట్టగురిగాదు**
**సూడువట్టినట్టిపలుసోఁకు లెఱుఁగు**
**యీడనెశ్రీవేంకటేశుఁ డిట్టె విచ్చేసి నన్ను**
**కూడినకూటమి మేనిగుఱుతులే యెఱుఁగు** ॥తర॥ **167**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి యేమి అంటున్నదంటే "వొకానొక సంఘటన జరిగిన తరువాత జరిగే పనులన్నీ అది యెవరివల్ల జరిగిందో వారికే తెలుస్తుంది. చెలులారా! శ్రీమంతుడైన నామగనికి ఈ సంగతి మీరైనా చెప్పండె". మనోవేదన, కళ్ళల్లో కనుపించే యావ, వాడిపోయిన అధరామృతం మన కళ్ళకు కనబడెనా? మరి అవి యెలా తెలుస్తాయి. భావదీపిక చదివితే కొంత తెలియవచ్చును.

**భావ దీపిక :**

ఓ చెలులారా! తరువాతి పనులు (ఒక సంఘటన జరిగిన తరువాతి పనులు) తానే (ఆ సంఘటన యెవరి వల్ల జరిగిందో వారే) యెఱుగు (తెలియగలరు). ఈ సంగతి సిరులవిభునికి (శ్రీమంతుడైన నామగనికి) చెప్పరే. మనసులోపలి చింతమాటలకు గురిగాదు (తీరదు). తనివోని (తృప్తి చెందని) తన్మయత్వములకే ఆ చింత యేమిటో తెలుస్తుంది. శరీరం అనుభవించే కాఁక (మదనతాపం) తరచిచూప సాధ్యంకాదు. మునుపు నేను పొందిన మోహమే దానినెఱుగును. కను చూపులో కానవచ్చే "యావ" గట్టిసేయ (ధృఢపరచ) సాధ్యము కాదు. ఓ కన్యలారా! దానినెఱుంగజాలినది నా కోరిక మాత్రమే. వికసించిన యౌవనము ఇదే. దీనిని పట్టుకొని చూపుట జరిగే పనియేనా? వెన్నెలవలె తెల్లబడిన నా నిశ్చేతనత్వమునకే ఆ జవ్వనమదమెట్టిదో తెలియును. వేచివేచి, వారువట్టిన (ధారగా కారిపోయిన) నామోవితేనె (అధరామృతము) గురించి నా సూడువట్టిన (పగవారైన) అతగాని సోఁకులు (స్పర్శలు) మాత్రమే యెఱుగును. ఇక్కడికే శ్రీవేంకటేశుడు ఠక్కున విచ్చేసి నన్ను కూడినప్పుడు, నామేనిపై ఆయన గుఱుతులే ఆ కూటమి మధురిమనెఱుగును.

సంఖ్య : 97 సంపుటము :10.2 పుట: 56 రాగం : ముఖారి

**44** దానిసాహసము మేలు తరవాత నీవు మేలు
పూనిన యారడికి ని న్నొడి గట్టించినది ॥పల్లవి॥

రవ్వగా మే నెల్లా జీరలుగాఁ జేయించుక
మవ్వపు నాయెదుట నీవు మలసేవు
నవ్వుల కైనాను నామాఁట మీరనినిన్ను
యెవ్వతెరా నిన్ను నింతగాఁ జేసినది ॥దాని॥

చిగురు నీమోవి యెల్లా చిల్లులుగాఁ జేయించుక
వెగటుగా నాయెదుట విఱ్ఱవీఁగేవు
తగవుల కైనా జివగాఁటని (జవదాఁటని?) నిన్నుఁ దెచ్చి
జగ నీపై యింత సేసి చలి వాపెను ॥దాని॥

చేవ దేర నీతురుము చిక్కువడఁ జేయించుక
శ్రీవెంకటనాథ కడుఁ జెలఁగేవు
యేవేళ నన్నుఁ బాయక యెనసి వుండితి నిన్ను
యీవేళఁ జెనకుచు యెమ్మెలు సేసినది. ॥దాని॥ **97**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన బహుచక్కని శృంగారకీర్తన ఇది. శ్రీవేంకటేశ్వరునితో యేమంటున్నారో వినండి. స్వామీ! నిజమేనయ్యా! దాని సాహసం సాటిలేనిదే. అలాగే నీవుకూడా సాటిలేనివాడివే. కాకపోతే ఆవిడే (దేవియే) ఆరడిచేసి నిన్ను అట్లా చేయించింది. కాకపోతే ఇంకెవరకి నిన్నిట్లా చేసే సాహసం వుంటుంది? నువ్వు నన్ను వదలవని నాకు తెలుసు. కాని ఇవ్వాళ ఆవిడ నిన్నెంత గర్వంగా తాకుతున్నదో చూడు.

**భావ దీపిక :**

స్వామీ! దాని సాహసము (దేవియొక్క తెగువ) మేలు (గొప్పది). అటుతరువాత నీవూమేలే (గొప్పవాడివే). నిన్ను పూనిన ఆరడికి (కావాలని చేసే అల్లరికి) ఒడిగట్టించినది (సిద్ధంచేసింది). రవ్వగా (గొప్పగా) నీ ఒడలంతా జీరలతో (గోటి గీతలతో) నాయెదుటికి వచ్చావు. నవ్వులకైనా నా మాట జవదాటని నిన్ను ఇంతగా మార్చివేసిన అది (దేవి) యెవ్వతెరా? లేత చిగురుటాకు వంటి నీ అధరాన్ని యెలా చిల్లులు చేసేసిందో చూడుస్వామీ! నాయెదుటనే యెంత వెగటుగా (లేకిగా) విఱ్ఱవీగుతున్నదో చూడు. నేను మాటామాటా వచ్చినా నీ మాట జవదాటానా? తెగించి నీపై ఇంత చలివాసెను (సిగ్గువిడిచిపెట్టిందో) చూడు, ఓ వేంకటనాథా! నీవూ తక్కువతినలేదు. కావాలని నీతురుమును (కొప్పులోని కేశములను) చిక్కుపడునట్లు చేసికొని మితిమీరి అతిశయించుచున్నావు కాని యేవేళనైనా నీవు నన్ను విడువక వుంటావు. ఇవ్వాళ ఆవిడగారు (దేవి) నిన్ను చెనకుచు (తాకుతూ) ఎమ్మెలు సేసినది (గొప్ప చూపిస్తున్నది.)



సంఖ్య : 103 సంపుటము : 24 పుట: 69 రాగం : వేళావళి

**41** ఆతనికి నిది పరాకౌనో కాదో
కాతరపుభ్రమ నేఁ గాచుకున్నదాకును ॥పల్లవి॥

యెప్పుడు వచ్చునో విభుఁ దేమనిపలుకునో
అప్పుడు నేరరాదంటా నేను
రెప్పవెయ్యక కన్నుల రేఁగి రేఁగి కనుగొంటాఁ
జప్పు డాలింపుచు నే నిచ్చట నున్నదానను ॥ఆత॥

యెదురుగఁ బోకున్న యేమని యెగ్గువట్టునో
అదనేదో విబునికినంటా నేను
వెదచల్లుఁగూరిమితో వేఁగుదివ్వె వెటుట్కొని
నిదుర గంటికి రాక నిలుచున్నదానను ॥ఆత॥

యింతలోనె శ్రీవేంకటేశుఁ డిందు విచ్చేసి
యెంతకెంత నన్నుఁగూడె నిదె యంటాను
సంతసపుఁబులకల జడియుచుఁ గరఁగుచు
వింతరతుల విఱ్ఱవీఁగుచున్న దానను ॥ఆత॥ **102**

**మున్నుడి :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నాయిక యేమంటున్నదో వినండి. “ఇది ఆతనికి పరవశత్వం కలిగిస్తుందో లేదో, నేనుమాత్రం స్వామి కోసం భయాందోళనతోను, భ్రమతోను కాచుకొనివున్నాను. ఎప్పుడొస్తాడో తెలియదు. కాస్త చప్పుడైనదేనని యెదురు చూస్తాను. కంటికి నిద్రే రావటంలేదు.” ఇంత బాధపడ్డాక స్వామి వచ్చాడు అప్పుడేమయిందంటే...

**భావ దీపిక :**

ఆతనికి (స్వామికి) ఇది పరాకౌనో కాదో (నాదగ్గర రావటం పరవశత్వం కలిగిస్తున్నదో లేదో?) నేను కాతరపు (భయాందోళనలతో) కలిగిన భ్రమలో కాచుకొని వున్నదానను. నా విభుడెప్పుడొచ్చునో? వచ్చినవాడు యేమనునో? అప్పుడు ఇక నావల్లకాదని రెప్పవేయక నాకన్నులు మండి మండిపోతుంటే చప్పుడు విని నేను ఇక్కడకు వచ్చివున్నాను. నేను ఒకవేళ స్వామికి యెదురుగా పోకున్నచో యెగ్గుపట్టీనేమో (తప్పుగా అనుకొంటాడేమో!) అదనేదో (యెప్పుడొచ్చేవేళయో) ప్రియునికి? తెలియకున్నది నాకు. వెదచల్లిన కూరిమితో కాంతివంతమైన దీపముబెట్టుకొని కంటిమీద కునుకులేక నేను వేచివున్నదాననైతిని. ఇంతలోనే శ్రీవేంకటేశుడు ఇక్కడికి విచ్చేసినాడు. ఇదే తరుణమని, ఇంతకింతకు (ఈ నిరీక్షణకు ఫలితమన్నట్లు) నన్ను కూడినాడు. సంతోషముతో తనువు పులకరించగా కరిగిపోతూ, వింతివింత రతులతో విఱ్ఱవీగిపోయినదాననై ధన్యత చెందితిని.

సంఖ్య : 94 సంపుటము :10.2 పుట: 54 రాగం : భైరవి

**42 ఎంతనేరుపరివి ని న్నే మందమే**
**పంత మాడె యాపె నింత భ్రమయించెఁ జూడరే ॥పల్లవి॥**

**చలపాదియాపె నా సంగడినె వుండఁగాను**
**వెలఁది రమణుఁ డొక్కవిధము సేసె**
**అల చుక్కల నెంచవె యని దాని నేమరించి**
**కళ లంటి నను బిగ్గెఁ గాఁగిలించెనే ॥ఎంత॥**

**మొక్కళాన యాపె నాతో మొనసి సాటికిరాఁగా**
**చక్కనిరమణుఁడొక్కజాడ సేసెనే**
**అక్కడ దాఁగిలిముచ్చు లాడి దానిఁ గన్ను మూసి**
**దక్కి నామో వాని నాకుఁ దమ్ములము వెట్టెనే ॥ఎంత॥**

**బట్ట గుత్తె యాపె నేఁడు పాయక వద్ద నుండఁగా**
**యిట్టె శ్రీవెంకటనాథుఁ డిటు సేసెనే**
**గట్టిగా నాపె కన్నులఁ గప్రమునిండాఁ బెట్టి**
**జట్టిగా నాతోఁ గూడి సమరతి సేసెనే. ॥ఎంత॥94**

**మున్నుడి :**

చినతిరుమలయ్య ఈ శృంగార కీర్తనలో తాను దేవి చెలికత్తెయై రసిక శిఖామణియైన స్వామి, భార్య వెంటవున్నా సందుచూచి తనతో ఎలా చిలిపి శృంగార చేష్టలు చేస్తున్నాడో వివరిస్తున్నారు. ఎంతటి చిలిపివాడంటే దేవికి కర్పూరపు కాటుక పెట్టి కళ్ళు మండతున్నాయని దేవి కళ్ళు మూసికొంటే అంతలోనే తనతో సమరతి జరిపినాడట. ఇంకా యేమి చెప్పమంటారు?

**భావ దీపిక :**

స్వామీ! నీవెంతనేరుపరివి (జాణవు?) నిన్నేమందమే? (యేమనగలము?) చూడండి పట్టుదలగల దేవినే యెంత భ్రమకు గురిచేస్తున్నాడో కదా! ఆపె (దేవి) చలపాది (పంతముగలది). ఆమె నాసంగడి (తోడుగా వుండగానే) రమణుడు ఆ వెలదిని ఒకరకంగా ఆటపట్టించాడు. ఆమెను ఆకాశంలో చుక్కలెన్నున్నాయో చెప్పు అని అడిగి ఆమెను యేమరుపాటుకు గురిచేసి నా కళాస్థానములనంటి బిగికౌగిలిలో బంధిస్తాడు. ఆమె మొనసి (తెగించి) నాతో ధైర్యంతో ఎదిరించి పోటీకి వచ్చింది. చక్కని ఆ రమణుడు ఒక విధంగా చేసినాడు. ఆమెతో దాగిముచ్చులు (దాగుడుమూత) లాడెదమని పిలిచి ఆమె కళ్ళను మూసి దిక్కులు చూస్తున్న నాకు ముద్దిచ్చి తన నోటిలోని తాంబూలము నానోట్లో కుక్కినాడు. ఆమె పట్టగుత్తె (లేడీ డిటెక్టివ్) గా మారి వదలక మాదగ్గరే వుంటే ఆ శ్రీవేంకటనాథుడు యేమిచేశాడో చూశారా? ఆమె కళ్ళకు కాటుకపెడతానని కర్పూరం యెక్కువగానున్న కాటుక పెట్టి, కళ్ళుమండుతున్నాయని ఆమె కళ్ళుమూసుకొని వుంటే నాతో జట్టిగా (లొంగదీసుకొని) నాతో సమరతిని కూడినాడే.



సంఖ్య : 318 సంపుటము : 25 పుట: 213 రాగం : దేవగాంధారి

**43 పట్టరానివయసుతో బలిమి సేసేముగాక**
**యెట్టు నేఁడు బాఁతియై రితరులు నీకు ॥పల్లవి॥**

**భామినిమాటలెల్ల పంచమవేదము నీకు**
**ప్రేమపుమోవితేనె పెండ్లివిందులు**
**సాముసేసేటిగరిడి సతమైనకాఁగిలి**
**యేమిటికి మాటలాడే వెవ్వరితో నీవు ॥పట్ట॥**

**అంగనతోడి సరస మంకెల రాజ్యపదవి**
**సంగడినవ్వులు నీజన్మఫలము**
**ముంగిటినిధానాలు మొనగోరి సరసాలు**
**యెంగిలివలపులేల యెవ్వరితో నీకు ॥పట్ట॥**

**కాంతవురమె నీకు కందువ సింహాసనము**
**పంతపుకూటములే పట్టబద్ధము**
**ఇంతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె**
**యెంత కెంత సడ్డయేల యెవ్వరితో నీకు ॥పట్ట॥318**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగారకీర్తనలో స్వామిని నిగ్గదీసి అడుగుతున్నారు. మేమంటే సామాన్యులం. మా వయసు మదముచేత స్త్రీలను బలవంతంచేస్తే పోనీలే అని సరిపెట్టుకోవచ్చును. కాని నీవు దేవదేవుడవు. నీకు “బాఁతి” (భ్రాంతి) కలిగించేవారుంటారా? నీకేమో ఆదేవి మాటలు పంచమవేదంలా వుంటాయి. ఆవిడతో సరసమాడటమంటే నీకు రాజ్యపట్టాభిషేకమే నాయె? ఆవిడగారి వురము నీకు సింహాసనము. ఇంతజేసి నన్నూ యేలితివి స్వామీ! యెవరితోపోటీ నాకెందుకు?

**భావ దీపిక :**

స్వామీ! మాకు పట్టరాని వయసు యొక్క బలిమితో (బలగర్వంతో) ఇంతవరకూ యేవేవో చేస్తే చేశాము. కాని నీకు నేడు ఇతరులు యెట్లు “బాఁతి”యైరి (భ్రాంతి కలిగించేవారైనారయ్యా?) నీకు ఆ భామిని (శ్రీదేవి) మాటలన్నీ పంచమవేదం వలెనే వుంటాయి. ప్రేమతో ఆమె ఇచ్చే అధరామృతం నీకు పెండ్లి విందులుగా వుంటాయి. విడలేని ఆమె శాశ్వత కౌగిలి నీకు మల్లయుద్ధపు గరిడీ (సాముకూటమి), ఇంకా నీకెవరితోనైనా మాటలాడే అవకాశం కూడా లేదు కదా! స్వామీ! నాకు తెలియని సంగతియా ఇది? నీకు ఆ అంగనతో (శ్రీదేవితో) సరసము అంకెల రాజ్యము (వశమైన రాజ్యాధికారము). ఆమెతో కలసి హాస్యోక్తులాడటం నీకు జన్మ సాఫల్యమైనట్లు వుంటుంది. కొనగోటితో ఆమె చక్కలిగింతలు పెడితే నీకు ముంగిటిలో నిధివున్నట్లే స్వామీ! శ్రీదేవి నీకింత చేస్తుంటే నీకు ఇంకెవ్వరితోనో యెంగిలివలపులు యెందుకు స్వామీ? నీకు శ్రీకాంతయొక్క వురము కందువ సింహాసనము (చిత్రమైనగద్దె). పంతముతో జరిపే కూటమి నీకు రాజ్యపట్టాభిషేకము. ఇదంతా ఇట్లా వుండగానే వో శ్రీవేంకటేశా! నన్ను కూడా యేలి ధన్యతనిచ్చావు. నీకు యెవ్వరితోనైనా యెంతకెంత సడ్డయేల? (యెవ్వరెవ్వరిమీదనో ఆసక్తి యెందుకు?)

సంఖ్య : 284 సంపుటము : 25 పుట: 190 రాగం : ముఖారి

**48 కంటివిగా వోయి నీకాంతలసుద్ది**
**దంటతనములఁ దామూఁ దమకించేరు ॥పల్లవి॥**

**నిన్నుఁ జూచేపరాకున నివ్వెరగై నేనుండఁగా**
**సన్నలు సేసుకొనేరు సవతులెల్ల**
**యెన్నికె నీచేఁతలకు యిచ్చగించి నే నుండఁగా**
**అన్నిటాఁ దామేమిటికి నబ్బురపడేరు ॥కంటి॥**

**అంతలో నీమాటలే ఆలకించి నే వినఁగా**
**ఇంతేసిగుజగుజ్జిలేల తమకు**
**ఇంతలో నే నీకు విడెమియ్యఁగాఁ జూచి చూచి**
**వింతగా నప్పటినేల వెంగెమాడేరు ॥కంటి॥**

**యేకతము లాడుతా నే నిట్టె వద్ద నుండఁగా**
**కాకుసేసి తామేల కాఁతాళించేరు**
**కైకొని శ్రీవేంకటేశ కాఁగిట నే నుండఁగాను**
**మేకొని తామేటికి మెచ్చు మెచ్చేరు ॥కంటి॥284**

**మున్నుడి :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో శ్రీదేవి భూదేవి స్వతహాగా సవతులైనప్పటికీ తాను స్వామికి చేరువ అవుతున్నందున రంగంలోకి దిగి ధైర్యంగా తాము కూడా స్వామిని మైమర్చేదమని నిశ్చయించుకున్నారట. అందుకే "అన్నమ్మ" యేమంటున్నదంటే "వోయి! నీవే కంటివిగా నీ కాంతల సుద్దులు" అని అంటున్నారు. అవున్లే స్వామి కౌగిట్లో పరవశించి నేనుంటే తామెందుకు మెచ్చేరులే అంటున్నారు.

**భావ దీపిక :**

ఓయీ! శ్రీనివాసా! నీ కాంతల సుద్దులు (వ్యవహారాలు) నీవే కంటివిగా? తాము (నీ భార్యలైన శ్రీదేవి భూదేవి కూడా) దంటతనముల (ధైర్యంగా) నిన్ను తమకించేరు (మైమరపిస్తున్నారు). నేను నిన్ను చూచిన పరాకున (పారవశ్యంలో) వుంటే సవతులైన నీ భార్యలు వారిలో వారు సన్నలు (సైగలు) చేసికొంటున్నారు. నీ చేతలకు అంగీకరించి నిన్నే నమ్ముకొని నేనుంటే అన్నివిధములుగా వారెందుకు ఆశ్చర్యపోతున్నారో తెలియదు. స్వామీ! నీవు మాట్లాడుతుంటే నేను పరవశించి వింటుంటే అంతలోనే నీ భార్యలకు ఇంతేసి గుజగుజలేల (పీడనమెందుకు?) ఇంతలో నేను నీకు ఆహ్వానతాంబూలమిచ్చాను. అది చూచి వింతగా అప్పటిన్ (మరల మరల) వెంగెములాడేరు (వ్యంగ్యంగా మాట్లాడుకొంటున్నారు). ప్రభూ! ఏకాంతసేవలో నేను నీవద్దనుంటే వారు (నీ భార్యలు) కాకుసేసి (నన్ను నిందించి) తాము యెందుకు కాతాళించేరు (కోపగించేరు?) ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను కౌగలించి నేనుంటే వారు తామెందుకు మెచ్చుకొంటున్నారో నీకే తెలియాలి స్వామీ!



సంఖ్య : 92 సంపుటము :10.2 పుట: 53 రాగం : పాడి

**45 సుసరాన మంచి దాయ సుదతులాల**
**విసుగక పతిఁ దెస్తే వెద లేమి లేవే ॥పల్లవి॥**

**తమ్మితూఁడు లా(నా?)ళమునఁ దగిన కస్తూరివుంట**
**వుమ్మడినె మదనుఁడు పూదఁగను**
**కొమ్మ చనుజక్కవలు గొబ్బున నెగయఁగాను**
**కమ్మి వతి(లి?)పె పయ్యద గలుగఁగ నిల్చెనే ॥సుసరాన॥**

**మొగలిరే కొడిశంట ముదురుఁ గప్రపులప్ప**
**వెగటున మదనుఁడు వేయఁగను**
**అగడై యింతి నడపుటంచలు బెదరఁగాను**
**వొగిఁ బాదపుపెండెము లోపికె నిలిపెనే ॥సుసరాన॥**

**చెఱకుఁదూఁట సింగిణి చెంగలువ మిట్టకోల**
**వెఱవక మదనుఁడు వేయఁగను**
**పఱచికురులతేంట్లు పారఁగా నడ్డమై కాంతఁ**
**గఱఁగించి కూడీ శ్రీవెంకటనాథుఁ డాఁపెనే. ॥సుసరాన॥92**

**మున్నుడి :**

చినతిరుమలయ్య ఈ శృంగార కీర్తనలో తానొక చెలికత్తెయై తనతోటి సుదతులకు మన్మథుడు తమ చెలి (శ్రీదేవి)పై చేసిన దాడిని వివరిస్తున్నారు. కస్తూరిని, కర్పూరపులప్పాన్ని ఆమెపైవేసి ఆమెను యెలా యాతన పెట్టాడో వివరిస్తున్నారు. ఆ మదనుండు ఇంత అఘాయిత్యం చేసినా చివరకు మంచియే జరిగిందిట. మరి ఆ చెఱకు వింటి సోగ్గాడివల్లనే కదా! శ్రీవేంకటనాథుడామెను కూడి కరగించినాడు, అంటున్నారు.

**భావ దీపిక :**

ఓ సుదతులారా! సుసరాన (సూక్ష్మంగా చూస్తే) అంతా మంచియే జరుగుతుంది. మీరు విసుగుకొనకుండా వేంకటపతిని తీసికొని వస్తే వెదలు (వ్యథలు) యేమీ వుండవు. మదనుడు తామరపూవు నాళము (పద్మపుతూడు) గొట్టముగా వుపయోగించి కస్తూరిని ఆమె (దేవి)పై పడునట్లు వూదినాడు. అది కొమ్మ (వనిత) చక్రవాకములవంటి కుచగిరులపై గబుక్కున వ్యాపించింది. అది ఆమె సన్నని పయ్యెదపై నిలిచిపోయి కమ్ముకొన్నది. మదనుడంతటితో వూరకున్నాడా? మొగలిరేకునొకదానితో, కర్పూరపు లద్దెను ఒడిశలు విసిరినట్లు, వెగటుగా ఆమెపై (దేవిపై) వేసినాడు. అగడై (చిన్నబోయిన) ఆ ఇంతి నడక ఆగి, ఆగి బెరుకుతో కొనసాగింది. కాని ఆమె పాదాలకు ధరించిన బరువైన పెండేరములు ఆమె నడకను వోపికతో నిలువరించినవి. మదనుడు వెఱవక (భయంలేకుండా తన చెఱకువింటితో చెంగలువను బాణమువలె సంధించి ఆమెపై వేసినాడు. అప్పుడు పఱచిన ఆమె నల్లని కురులు తొందర తొందరగా అడ్డమైన కాంతను పరవశింపజేసి శ్రీవేంకటనాథుడు ఆమెను కూడినాడు.

సంఖ్య : 285 సంపుటము : 25 పుట: 191 రాగం : లలిత

**46** కోరికలు కొనసాగె గోవిందరాజ
మేరమీరి ఇట్లానే మెరసితివా ॥పల్లవి॥

బాలుఁడవై రేపల్లెలోఁ బాలుదాగేవేళ
యీలీలనే పవళించి యిరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లెత లూఁచి పాడఁగా
ఆలకించి విని పాట లవధరించితివా ॥కోరి॥

కొంచక మధురలోనఁ గుబ్జఇంట నీలాగుల
మంచాలపైఁ బవళించి మరిగితివా
చంచులద్వారకలోన సత్యభామతొడమీఁద
ముంచి యీరీతి నొరగి ముచ్చటలాడితివా ॥కోరి॥

పదియారువేలింతులపాలిండ్లు తలగడలై
పొందల నిటువలెనే భోగించితివా
యెదుట శ్రీవేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదిరించక శ్రీభూమినీళలఁ గూడితివా ॥కోరి॥ 285

**మున్నుడి :**

గోవిందరాజస్వామిపై సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. తిరుపతిలో మెరసిపోతున్న స్వామిని చూస్తేనే కోరికలు చెలరేగటమేకాదు కొనసాగతాయట. బాలకృష్ణయ్యగా, ఆయన చేసిన లీలలు, గొల్లెతలతో చేసిన గోలలు, కుబ్జకు తీర్చిన పవళింపుసేవలు, పదియారువేలమంది రాచకన్నెల కలలను నిజము చేసిన కలికితనం, ఆహా! శ్రీవేంకటపతీ! నీసొగసు చూడతరమా?

**భావ దీపిక :**

ఓ గోవిందరాజా! నీవు శృంగారరాయడవు. నీ వలపు సొలపులు కోరికలై కొనసాగుతూనే వున్నాయి. మేరమీరి (హద్దులు దాటిన) నీవు ఇట్లానే (ఈ విధముగానే) మెరసితివా (శోభించితివా?) నాడు రేపల్లెలో బాలుడవై పాలుత్రాగేవేళ నీ ఈ లీలనే (తిరుపతిలో శయనించినట్లే) పవ్వళించితివా? తొట్టెలలో (ఉయ్యాలలో) గోలవై (అమాయకత్వం చూపి) పాడుతూ వుంటే ఆలకించితివా? కొంచక (సంకోచించక) ఆనాడు మధురలో కుబ్జ ఇంట నీవు ప్రదర్శించిన లాగులు (పరవశత్వం) మరువగలమా? ఆమె మంచాలపై పవళించి మరిగితివికదా! ప్రభూ! ఆ లీలల అనంతరం అష్టమహిషీ ఇష్టనాయకుడవైకూడా ద్వారకలో సత్యభామ తొడపై యీరీతిగనే వొరగి ముచ్చటలాడితివా? అటు పిమ్మట పదియారువేలమంది రాచకన్నెలను వొకేసారి పెండ్లియాడి వారి పాలిండ్ల తలగడలపై పొదలన్ (అతిశయముతో) ఇటువలెనే భోగించితివా? ఎదుట తిరుపతిలో శ్రీదేవి, భూదేవి మరియు నీలాదేవితో నిదురను త్యజించి కూడితివా స్వామీ! ఓ శ్రీవేంకటేశ్వరా! నీ లీలలను నీసొగసును చూడతరమా!



సంఖ్య : 8 సంపుటము :10.2 పుట: 5 రాగం : శ్రీరాగం

**47** ఇంతిచక్కఁదన మిఁక నేమని కొన్యాడుదము
చెంత నాతఁడును నీపె. చేఁతలకె భ్రమసె ॥పల్లవి॥

మొలక నవ్వుల చెలిమోము చూచి విభుఁడు
తొలఁకువెన్నెలల చందురుఁ డని భ్రమసె
మలయ జంకెనల బొమ్మలుచూచి రమణుఁడు
వెలయఁగ మదనుని విండ్లని భ్రమసె ॥ఇంతి॥

సొగసిన చెలి చూపు చూడఁ జూచి ప్రియుఁడు
పగతో మరుఁ డేసిన బాణ మని భ్రమసె
మగువ యాడినయట్టి మాఁట విని నాయకుఁడు
పగటునఁ గోవిలపలు కని భ్రమసె ॥ఇంతి॥

కరఁగించి చెలి దన్ను కాఁగిలించిననుఁ బతి
తిరమైయున్న మెరుఁగుఁ దీగె యని భ్రమసె
గరిమతోడుత శ్రీవెంకటనాథుఁడు కాంత
వరుసఁ గూడఁగ పరవశమున భ్రమసె. ॥ఇంతి॥ 8

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తన ప్రత్యేకత యేమంటే జగత్తునంతా భ్రమింపజేసే వేంకటనాథుడు దేవినవ్వులు, కనుబొమలు, వాడిచూపులు, తేనెలొలుకు మాటలు తనను కౌగలించుటలో ఆమె వొడుపు జూచి భ్రమచెందినాడట. ఏమని భ్రమ చెందాడో తెలియాలంటే. మీకు భావదీపిక చదవక తప్పదు. పులికడుపున పులే పుడుతుంది. అన్నమయ్య మనుమడు అపర అన్నమయ్య కాక మరేమవుతాడు? చెప్పండి.

**భావ దీపిక :**

(ఓ చెలులారా!) ఈ ఇంతి చక్కదనమును యేమని కొనియాడెదము చెప్పండి? ఆమె చెంత వున్న రమణుడు కూడా ఈపె (ఈమె) చేతలకు భ్రమసినాడు (భ్రమజెందినాడు). ఆ చెలిమోమున గల మొలక నవ్వులను చూచి విభుడు వెన్నెల కురిపించుచున్న చంద్రుడు కాదుగదా!! అని భ్రమ చెందినాడు. మలయు జంకెనల బొమలు (బెదిరించునట్లు కదులుచున్న కనుబొమ్మలను) చూచి రమణుడు ఇవి మన్మథుని విండ్లు (ధనస్సులు) కాదుగదా!! అని భ్రమ చెందినాడు. సొగసైన ఆ చెలి చూపులు చూచి ఆమె ప్రియుడు ఇవి చూపులా లేక పగబూనిన మరుడు వేసిన బాణములా!! అని భ్రమ చెందినాడు. ఆ నాయకుడు తన మగువ చెప్పిన మాటలను విని, పగటున (మురిపెముతో) కోకిలలు పలికిన పలుకులు (కూజితములు) కాదుగదా! అని భ్రమ జెందినాడు. తన చెలి లాఘవముగ తనను కౌగలించి తళుక్కు మెరిసే తటిల్లత (మెఱుపుతీగె) కాదుగదా!! అని శ్రీపతి భ్రమ చెందినాడు. గరిమతో (మహిమతో) శ్రీవేంకటనాథుడు ఆ కాంతను వరుస కూటముల అలరించి ఆపలేని పరవశమున తాను కూడా భ్రమచెందినాడు.

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 శ్రీమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళాశాసనపరైర్మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వై రాచార్యైఃసత్కృతాయాస్తు మంగళమ్

శ్రీ పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః



సంఖ్య : 90 సంపుటము :10.2 పుట: 52 రాగం : శ్రీరాగం

**49** వల పేమి గంపఁ గమ్మవచ్చునా యెందైన
చెలులాల మాయిద్దరి చిత్తములే యెరుఁగు ॥పల్లవి॥

యెనయని కోపమున యేమైనా నంటిఁ గాక
మనసులో మమతలు మానఁ గలనా
ఘనమైన పొలయలుకలఁ గొసరితిఁ గాక
వినరమ్మె రమణుని వితనాడఁ గలనా ॥వల॥

ఆలసించి రాఁగానె అన్నియుఁ దిటి(ట్టి?)తిఁ గాక
మేలుదాన వానిఁ బాసి మించఁ గలనా
అలరి యై తిరుగఁగ నమ్మరో దూరితిఁ గాక
బాలకి నైన వానిఁ బాసి వుండఁ గలనా ॥వల॥

దగ్గరని కాఁతాళాన తగుఁ దగ దంటిఁ గాక
యెగ్గువట్టి వానితప్పు లెంచఁ గలనా
కగ్గు లేక శ్రీవెంకటనాథుఁడె నన్ను
అగ్గల మై కూడె వానియండ వాయఁ గలనా. ॥వల॥ **90**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి తన చెలికత్తెలతో యేమని వాపోతున్నదో వినండి. ఏమర్రా? "వలపు" అంటే గంపలో పోసి అమ్మే వస్తువు అనుకొన్నారా యేమి? ఎక్కడైనా విన్నారా? మా భార్యా భర్తలిద్దరి మనస్సులకు ఆ సంగతి యెప్పుడో తెలుసు. ఏదో నాకు ప్రధమ కోపముయెక్కువ, ఆయన ఆలశ్యంగా వస్తే అప్పుడప్పుడూ "నోరు పారేసుకొంటాను, దగ్గరైనప్పుడు కంగారులో 'వద్దు' అంటానుకాని ఆయనను తప్పుపట్టగలనటే? అంటున్నదా జగన్మాత.

**భావ దీపిక :**

ఓ చెలులారా! వలపు యేమైనా గంపలలోపోసి అమ్మేదా? యెందైనా అది జరిగే పనియేనా? మా అనురాగము మా ఇద్దరి మనస్సులకే తెలుసు. ఎప్పుడో వొకప్పుడు యెనయని కోపాన (పోల్చలేని ఆగ్రహమున) యేదన్నా అంటుంటాను. నా మనస్సులో స్వామిపై యెంత మమతవున్నదే? దానిని నేను మానగలనటే? ఘనమైన పొలియలుక (నష్టకరమైన చిరాకులో) కొసరితినిగాక (కసురుకొన్న మాట నిజమే). కాని వినరమ్మా! నేను రమణుని వితనాడగలనా? (నివ్వెరపోయేట్లు చేయగలనా?) స్వామి ఆలస్యంగా వస్తే యెన్నోమార్లు తిట్టినమాట నిజమే. కాని నేను ఆయన మేలు కోరే దాననుకానా? ఆయన బాసను మించగలనా? ఆయన తన వలపుకత్తెలతో ఆలరియై (అల్లరిగా) తిరుగుతున్నాడని దూరితిని (తిట్టాను). బేలనైన నేను వానిని పాసి (విడచి) వుండగలనటే? స్వామి దగ్గరయైనప్పుడు కాతాళాన (తొందరపాటులో) వద్దువద్దు అన్నానుగాని దోషములనెంచి వానితప్పులనెంచితినటే? కగ్గు (కళంకము) లేని శ్రీవేంకటేశ్వరుడు నన్ను అగ్గమై (పోటీపడి) కూడినాడు. ఇకనేను వాని అండను వీడగలనా?

సంఖ్య : 182 సంపుటము : 25 పుట: 122 రాగం : దేసాళం

**50 ఎంతరాజసము చూపే వీకెయెదుట**
**చెంతలనే మమ్మును చిమ్మిరేఁతురా ॥పల్లవి॥**

**కొండలెక్కి నీకుఁ జనుఁగొండలు చూపీ మారు-**
**గొండపైనుండిన నీకుఁ గోమలి**
**రెండుచేతులుఁ జాఁచి కూరిమి నందు కొనరాదా**
**అండనున్న లకిమమ్మ నలఇంతురా ॥ఎంత॥**

**పండుండి నీకు మోవిపండు చూపి యెలఇంచీ**
**పండువెన్నెలబయట పడఁతి**
**నిండునీవదనమున నిక్కించి చేకొనరాదా**
**మెండైనలకిమమ్మతో మేకుసేతురా ॥ఎంత॥**

**కొనబుఁదనాన గోరికొన చూపీ పెండ్లిసేసు-**
**కొనవలెనని నీకుఁ గోమలి**
**యెనసితిని శ్రీవేంకటేశ నీ వౌభళేశుఁడ-**
**ననరాదా లకిమమ్మ కటు మాటదాఁతురా ॥ఎంత॥ 182**

**మున్నుడి :**

అన్నమయ్య అహోబలనృసింహునితో నిర్భయంగా యేమంటున్నారో చిత్తగించండి. ఆ లకిమమ్మ (లక్ష్మమ్మ) దగ్గర అట్లా మాటదాచిపెట్టనేలనయ్యా? నీవే శ్రీహరివి, నీవే శ్రీవేంకటేశ్వరుడవని ఆమెకు చెప్పరాదా? దేనికి ఆమెదగ్గర నీ రాజసము చూపించటం? ఎప్పుడూ నీయెదుటే వుంటే మాపై కూడ నీ చిరాకు చూపించతగునా అని స్వామికి నచ్చుజెబుతున్నారు.

**భావ దీపిక :**

స్వామీ! నీవు ఈమె (శ్రీలక్ష్మి) యెదుట యెంత రాజసము చూపుచున్నావయ్యా? నీ చెంతనే వుండే మాపై కూడా ఇంత చిమ్మిరేచ తగునా (విజృంభించవచ్చునా?) ఓ నారసింహా! కొండనెక్కి నీకు తన చనుకొండలను చూపి, యెదురుగానున్న కొండపైనున్న నీకు ఆ కోమలి రెండు చేతులు చూచి కూరిమితో వాటినందుకోరాదా? ఏమయ్యా! అక్కడవున్న లకిమమ్మను (లక్ష్మమ్మను) అలరించరాదా? ఓ నారసింహా! ఆమె నీ చెంత పరుండి నీకు తన మోవితేనె (అధరామృతము) నందించి పండువెన్నెలలో పరవశింపజేసినది. స్వామీ! నిండైన నీ వదనమును పైకెత్తి ఆమెను చేకొనరాదా? ఏమయ్యా! అధికురాలైన లకిమమ్మతో మేకుసేతురా? (పరిహాసము చేస్తావా?) స్వామీ! నిన్ను పెండ్లాడవలెనని ఆ కోమలి గొనబుతనాన (సొంపుగా) తన కొనగోళ్ళను చూపి పెండ్లి చేసికొనవలెనని బోధించినది. శ్రీవేంకటేశ్వరా! నీవే ఔభళమున (అహోబలమున) కధిపతివైన నారసింహుడవని చెప్పకుండా మాట దాచిపెట్టెదవా?



సంఖ్య : 91 సంపుటము :10.2 పుట: 52 రాగం : వరాళి

**51 ఎటువంటి దొర వైతి వేమయ్య నీవు**
**అటమటముల నీకు నాచార మేది ॥పల్లవి॥**

**వెనక నా యడపమువెలఁది మో వానితివి**
**అనువుగ నేఁ గంటి నద్దములోన**
**తనియక నాకు నిట్టె తమ్ముల మిడ వచ్చేవు**
**యెనసి వూడిగపుదానెంగిలి కోపుదునా ॥ఎటు॥**

**ముచ్చట నా కాళాంజిముదితఁ గాఁగిలించితి**
**వచ్చుగా నే రత్నపుగోడావలఁ గంటి**
**యిచ్చకాన నామీఁద నిట్టె చెయి వేసేవు**
**చెచ్చెర సేవకురాలిచెమట కోపుదునా ॥ఎటు॥**

**వొద్దనె నా కుంచదాని నొగిఁ దోఁటలోఁ గూడఁగా**
**నిద్దపుఁ గేళారూ (కూ?) ళి నీటిలోఁ గంటి**
**గద్దరివై నన్ను శ్రీవేంకటనాథ కూడితివి**
**అద్దో పరిచారకురాలంటుకు నోపుదునా. ॥ఎటు॥ 91**

**మున్నుడి :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో శ్రీదేవి తన నాథునితో తెగవేసి చెబుతున్నది. స్వామికి చినతిరుమలయ్య వూడిగకత్తె (దాసి). ఆమెతో స్వామి ప్రేమలో పడినమాట నిజమే. మరీ దాసిదానితో యీ వ్యవహారం శ్రీదేవికి నచ్చలేదు. స్వామీ! తెంపరివై అద్దో పరిచారికురాలితో "అంటుపడ్డావు". నేను సాగర పుత్రికను, నీదేవేరిని నేను ఇదెట్లా సహించగలను స్వామీ?

**భావ దీపిక :**

స్వామీ! నీవెటువంటి (యెంత గొప్ప) దొరవైతివి (ఏలికవయ్యా). ఏమయ్యా! మమ్ము అటమటము (బాధలను) పెట్టుట నీకు ఆచారము. వెనక (ఇదివరకు) నా యడపము వెలది (ఆకువక్క అందించే స్త్రీ) అధరమును చుంబించితివి. అది ఆనాడే నేను నా అద్దములో చూచితిని. అంతటితో నాగక నా నోట్లో నీనోటితాంబూలము నందించబోతున్నావు. అది నీ వూడిగపుదాని యెంగిలి (చినతిరుమలయ్య భావనా సుందరి). నేను దానికి (అంత నిరాదరణకు) తగుదునా స్వామీ! నీకెంత మక్కువవున్నా నా"కాళాంజి ముదిత" (తాంబూలపు ఉమ్మినిపట్టే స్త్రీ)ని కౌగలించుకొంటివి. నేను రత్నపు గోడ అవతలివైపునే వున్నానని తమరు గమనించలేదు. నవ్వుతూ ఇవతలకు వచ్చి నాపై చేయివేసేవు. నీ సేవకురాలి వంటి చెమట నాకు అంటించటం న్యాయమా? నేనందుకు తగుదునా ప్రభూ! ఇది సహింతునా? నా కుంచపుదానిని (వింజామర విసిరే స్త్రీని) నీవు తోటలో బాగా దగ్గరకు తీసికొని కూడితివి. నేను కేళాకూళి (జలక్రీడాసరస్సు) నుండి అది చూచితిని. ఓ వేంకటనాథా! నీవు తెంపరివై నన్నూ కూడితివి. అదిగో నీపరిచారికల "అంటు"కు నన్ను గురిచేయుట న్యాయమా?

గమనిక : స్వామి వ్యభిచారి కాడు. ఆ స్త్రీలందరూ చినతిరుమల భావనా వనితలే. భక్తికి లొంగిన పరమాత్మ, నిందలైనా భరిస్తాడు.

రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | ఎం.టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్ధార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్. |
| రంథి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |